19-03Pg1exHMNWJQE.qxd:19-03Pg1exHMNWJQE.qxd 01/01/01 9:53 AM Page 1


వారం ముచ్చట
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు, : fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-3-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 46 పేజీలు: 12 వెల: 6.50


ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు
నేడు బిల్‌గేట్స్‌తో భేటీ

లండన్‌లో చిరంజీవి
నేడు బ్రిటిష్ పార్లమెంటు పురస్కారం

2లో

## ఆధార్ + ఓటర్ కార్డు అనుసంధానం

### కేంద్రం గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, మార్చి 18:** ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనితో ఆధార్‌కార్డుతో ఓటర్ ఐడి అనుసంధాన ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించింది. దీనికోసం మంగళవారం సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఓటరు గుర్తింపుకార్డుల్లో అవకతవకలు జరుగుతున్నాయని అనేక విమర్శలు వెల్లువత్తాయి. ఈక్రమంలోనే ఓటరుకార్డును, ఆధార్ కార్డుతో అనుసంధానంచేసే అంశంపై మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించింది. నిర్వాచన్‌సదన్‌లో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ఇసిలు డాక్టర్ సుఖ్‌బీర్‌సింగ్ సంధు, డాక్టర్ వివేక్‌జోషి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి లెజిసేట్లఇవ్ డిపార్టుమెంట్ కార్యదర్శి యుఐడిఎఐ, ఇసిఐ సాంకేతికనిపుణులు భేటీ అయ్యారు. ఈభేటీ ప్రధాన ఉద్దేశ్యం అర్హులైన అందరికీ ఓటర్లుగా నమోదుచేసుకునే అవకాశం కల్పించడంతో పాటు నకిలీ ఐడికార్డులను తొలగించడం వంటి అంశాలపై చర్చజరిగింది.

ఈ చర్చలో ఓటర్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎపిక్‌కార్డు ఆధార్‌తో లింక్‌చేయడంకోసం 326 అధికరణం ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఆధార్‌కార్డు ఓటరు కార్డు అనుసంధానికి ఎన్నికల సంగం నిర్ణయించింది. ఇసి నిర్ణయంతో త్వరలో యుఐడిఎఐ, ఇసిఐ నిపుణులమధ్య సాంకేతికప్రక్రియ ప్రారంభం కానుంది. రాజ్యాంగంలోని 326 అధికరణం ప్రకారం భారత పౌరుడికి మాత్రమే ఓటుహక్కు, ఆధార్‌కార్డు ద్వారానే పౌరుడి గుర్తింపు నిర్ధారణ. ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయడం రాజ్యాంగంలోని 326 నిబంధన, ప్రజాప్రతినిధ్యచట్టం 1950లోని సెక్షన్ 23(4), 23(5)23(6)లోని నిబంధనలప్రకారం సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా మాత్రమే జరుగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదలచేసింది. మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విపక్షాలు ఓటర్ల జాబితాల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని, మహారాష్ట్ర ఓటర్లను >>2


# ప్రతి కుటుంబానికి ఇంటిస్థలం

గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇస్తాం

26 జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహాలు

అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాల్లో సౌర విద్యుత్ ఫలకాలు

- మీడియాతో సిఎం చంద్రబాబు నాయుడు



**విజయవాడ,మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నియోజకవర్గాలన్నింటిలోను ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇస్తాం. గత ప్రభుత్వం సెంటు పట్టాను ఊరికి దూరంగా ఇచ్చింది. దాంతో అవి ఎవరికీ పనికిరాకుండా, చాలీచాలనట్టుగా ఉండటంతో నిరుపయోగం అయ్యాయి. సెంటు పట్టా ఉన్నచోటనే స్థలం కావాలంటే రెండు సెంట్లు స్థలం ఇస్తాం. 2029 నాటికి ప్రతి కుటుంబానికి సొంతిల్లు నిర్మిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని ప్రతి కుటుంబానికి ఇళ్లు, పారిశుధ్య సౌకర్యం, నీటి సరఫరా, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, డిజిటల్ కనెక్టవిటీ, ఎలక్ట్రిసిటీ, సోలార్ రూఫ్ టాప్, రహదారుల అనుసంధానం, డ్రైనేజీ నెట్వర్క్, వేస్ట్ టు వెల్త్, స్ట్రీట్ లైటింగ్, సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం భవిష్యత్తు రాష్ట్ర ప్రయోజనాలను రూపొందిస్తున్న కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. శనివారం ఢిల్లీ ప్రయాణానికి ముందు చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, గుంతలు లేని రోడ్ల కోసం మిషన్, ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు. గత దుర్భలపాలన, దుష్పరిపాలన నుంచి బాధ్యతాయుతమైన, సుపరిపాలనద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడంలో గత ఎనిమిది నెలల్లో మా ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించింది. గత ప్రభుత్వం నిలిపివేసిన 93 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 74 పథకాలను పునరుద్ధరించి రూ.9,371 కోట్ల అప్పులు తీర్చాం. ఆర్థిక కార్యకలాపాలను పునరుద్ధరించడానికి, బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌పై విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి నీటిపారుదల, రోడ్లు, ఇతర పనులకు సంబంధించి రూ.10,125 కోట్ల బిల్లులను క్లియర్ చేశాం. దీర్ఘకాలంగాపెండింగ్‌లో ఉన్న రూ.2,488 కోట్ల ఆర్థిక సంఘం గ్రాంట్లను విడుదల చేయడం ద్వారా స్థానిక పాలనను బలోపేతం చేశాం. 2024-25 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గత సంవత్సరం రూ.14.22 లక్షల కోట్ల నుండి రూ.16 లక్షల కోట్లకు విస్తరించింది.

ఇది 12.94 నామమాత్రపు వృద్ధి రేటు. మన తలసరి ఆదాయంకూడా గత సంవత్సరం లోని రూ.2.37 లక్షల నుంచి రూ.2.68 లక్షలకు పెరిగింది. వ్యవసాయం, అనుబంధ రంగాలు 15.86, పరిశ్రమలు 6.71, సేవల రంగం 11.70 చొప్పున వృద్ధి చెందాయి. ఈ ప్రగతి అన్ని కీలక రంగాలలో గణనీయమైన పనితీరు వల్ల సాధ్య మయింది. సుస్థిర ఆర్థిక వృద్ధిక, మానవ వనరుల అభివృద్ధికి నైపుణ్యం, ఆరోగ్యకరమైన శ్రామిక శక్తి మూలస్తంభమని నా ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుంది. సుమారు రూ.1770 కోట్లమేర పెండింగ్‌లో ఉన్న అప్పులనుతీర్చి, ఎన్ టిఆర్ వైద్యసేవ, ఉద్యోగుల ఆరోగ్య పథకం వంటి కీలక >>2

## అమరావతి రీలాంచ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

### సిఆర్‌డిఎ సమావేశంలో నిర్ణయం

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** స్వయం సమృద్ధి నగరంగా అమరావతి రాజధానిని తీర్చిదిద్దాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. రాజధాని నిర్మాణంలో మనం అనుసరిస్తున్న విధానాలు సంపదసృష్టిలో అంతర్భాగాలన్నారు. రాజధాని నిర్మాణ పనులకు ప్రధానిని ఆహ్వానిస్తున్నామన్నారు. అసెంబ్లీలోని ఛాంబర్‌లో మంత్రి నారాయణ, సిఆర్‌డిఎ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సమావేశమయ్యారు. రాజధాని పనుల పున:ప్రారంభంపై ప్రధాని నరేంద్ర మోడీ ముందు ఉంచాల్సిన ప్రతిపాదనలపై చర్చిస్తున్నారు. అలాగే ప్రధాని అనుకూల సమయం, అందుబాటులో ఉన్న ముహూర్త సమయాలు తదితర అంశాలపై సిఎం సమావేశంలో చర్చించారు.. ప్రధాని కార్యక్రమంకోసం స్థలంఎంపిక ఇతర అంశాలపైనా చర్చించారు. నవ నగ >>2

# మరిన్ని ప్రైవేటు, విదేశీ వర్సిటీలు

## విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టాం

## అమరావతిలో బిట్స్ ఏర్పాటుకు కృషి

### రాజధానిలో డీప్‌టెక్, విశాఖలో ఎఐ వర్సిటీలు: అసెంబ్లీలో మంత్రి లోకేష్



**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని అనేక సంస్కరణలు చేపట్టామని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఎపి ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ శాసనసభ ఆమోదం తెలిపింది. మన రాష్ట్ర విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేకుండా ఎపిలోనే నాణ్యమైన విద్యను అందించేలా సంస్థలను తీసుకురావాలని ఎమ్మెల్యేలు కోరారు. దీనికి స్పందించిన మంత్రి లోకేశ్ భారత్‌లో ఉన్న అత్యుత్తమ విశ్వవిద్యాలయాలక్యాంపస్‌లు ఎపివ్యాప్తంగా ఏర్పాటుఅయ్యేలా చర్యలు చేపడతామన్నారు. బిట్స్ పిలానీకి అమరావతిలో 70 ఎకరాలను కేటాయించామని టాటా లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు కూడా వస్తాయన్నారు. డీప్ టెక్ వర్సిటీ ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యమని మంత్రి తెలిపారు. విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ వర్సిటీలు స్థాపిస్తామని అన్నారు. ప్రైవేట్ స్కూల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్ మెకానిజం ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఆటస్థలాలు, అగ్నిమాపక భద్రతా పరికరాల ఏర్పాటుకు గల నిబంధనలు, ప్రైవేటు స్కూల్ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పాఠశాలల్లో ఎన్‌సిసి అభివృద్ధికి చేపడుతున్న సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. ప్రైవేటు స్కూళ్ల అనుమతులకు సంబంధించి ఫైర్ ఎన్‌ఓసీని అగ్నిమాపకశాఖ, బిల్డింగ్ పర్మిషన్స్ పంచాయతీ, లోకల్ బాడీస్ ఇస్తాయన్నారు. జీఓ 88 ప్రకారం అడ్మిషన్లను బట్టి ఎంత ఆటస్థలం ఉండాలనే విషయమై నిబంధనలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. ఈ జిఓ ప్రకారం సరిపడనంత ఆటస్థలం లేకపోతే మున్సిపల్ గ్రౌండ్స్‌తో టైఅప్ కావచ్చని అది కూడా అందుబాటులో లేకపోతే వేరే స్కూళ్లతో టైఅప్ కావచ్చని అన్నారు.

ప్రైవేటు స్కూళ్ల పర్మిషన్ల విషయంలో కొన్ని లోటుపాట్లు ఉన్నట్లు తన దృష్టికి వచ్చాయని ఇందుకు ట్రాన్సపరెంట్ మెకానిజం ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రైవేటు స్కూల్ టీచర్ల జీతాల విషయమై ప్రైవేటు యజమానులతో సమావేశం కాగా, కొన్ని పత్రాలు ఇచ్చేందుకు ప్రైవేటు టీచర్లు నిరాకరిస్తున్నట్లు తమ దృష్టికి తెచ్చారన్నారు. వచ్చేవారం ప్రైవేటు టీచర్లతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకోనున్నట్లు మంత్రి లోకేష్ చెప్పారు. పలు ప్రైవేటు వర్సిటీలు ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డుతో చర్చలు జరుపుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో, ఎఎంఇ వర్సిటీ ఫిలిప్పీన్స్ ఆసక్తి కనబర్చాయి. ఇతర వర్సిటీల ప్రతినిధులు కూడా చర్చలకు వస్తున్నారు. పెద్దఎత్తున ప్రైవేటు రంగంలో భారత్‌లో టాప్ వర్సిటీలతోపాటు విదేశీ యూనివర్సిటీలను ఎపికి తెచ్చేవిధంగా ప్రోత్సహిస్తాం. కేవలం అమరావతి, విశాఖపట్నంకే కాకుండా అన్నిప్రాంతాలకు తెస్తాం. ఇన్సెంటివ్‌లు అధికంగా ఇచ్చి రాయలసీమకు కూడా వర్సిటీలు రప్పించేందుకుకృషి చేస్తున్నాం. కనిగిరి ప్రాంతానికి ట్రిపుల్ ఐటి ఏర్పాటు >>2

## ప్రభుత్వ విభాగాల సర్‌ఛార్జి మాఫీ

**విజయవాడ,మార్చి 18,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాలు,సంస్థల విద్యుత్ సర్‌ఛార్జి మాఫీ చేస్తున్నట్లు ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సీ) ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం(ఒటిఎస్) కింద సర్‌ఛార్జి మాఫీ చేసేందుకు అనుమతిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ విభాగాలు,సంస్థలన్నీ విద్యుత్ వినియోగం క్రింద రూ.3,176కోట్ల మేర డిస్కంలకు బకాయి పడ్డాయి. బకాయిలపై విధించిన సర్‌ఛార్జిను మాఫీ చేయాలంటూ ప్రభుత్వం లేఖ వ్రాసింది. 2024 డిసెంబరు 31 నాటికి ప్రభుత్వం మొత్తం పెండింగ్ బకాయిలు రూ.12,169 కోట్లుగా ఉన్నట్లు ఇఆర్సీ వెల్లడించింది. ఇందులో కరెంటు బకాయిలు రూ.9,010 కోట్లమేర చెల్లింపుల ఆలస్యంపై విధించిన సర్‌ఛార్జి రూ.3,158 కోట్లు ఉన్నట్లు స్పష్టం చేసింది. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కరెంటు బకాయిలు రూ.4,782 కోట్లుగా వెల్లడించింది. వీటిలో రూ.1605 కోట్ల మేర సర్‌ఛార్జ్ కట్టాల్సి ఉందని ఇఆర్సీ స్పష్టం చేసింది. ప్రభుత్వ విభాగాలు,సంస్థలు కరెంటు బకాయిలు చెల్లించేందుకు కాను 2024-25 ఆర్థిక సంవత్సరానికి సర్‌ఛార్జీని మాఫీచేసేందుకు ఇఆర్సీ అనుమతించింది. ప్రత్యేక కేసుగా పరిగణించి ఒటిఎస్ క్రింద రూ.1605 కోట్ల >>2

## ఏప్రిల్ 1దాకా వల్లభనేనికి రిమాండ్

**విజయవాడ,మార్చి 18,ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీని పిటీ వారెంట్‌పై అరెస్ట్‌చేసి గన్నవరం కోర్టులో హాజరుపర్చారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఏప్రిల్ 1 వరకు వంశీకి రిమాండు విధించింది. అనంతరం గన్నవరం కోర్టు నుండి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. ప్రస్తుతం సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్ట్ అయి విజయవాడ జిల్లా జైలులో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు పిఎస్ పరిధిలో ఓ ముస్లిం మహిళకు చెందిన భూమిని ....ఆమె కుమారులమని పేర్కొంటూ ఇద్దరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేశారు. భూమిని >>2



క్రీడా మైదానంలో అఖండ క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న స్పీకరు అయ్యన్న పాత్రుడు

## మానసిక ఒత్తిడికి క్రీడలు ఉపశమనం

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ క్రీడాపోటీలను ప్రారంభించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

### టగ్ ఆఫ్ వార్‌లో పురుషులపై మహిళా ప్రజా ప్రతినిధులు విజయం

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు తీవ్ర మానసిక వత్తిడికి ఈ రోజుల్లో గురవుతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. క్రీడలు రాజకీయ నాయకులకు కొంత మనోల్లాసాన్నిస్తాయన్నారు. దాంతోపాటు శారీరక వ్యాయమం లభిస్తోందన్నారు. శాసనసభ్యులకు క్రీడా పోటీలు నిర్వహించడం కొత్త సంప్రదాయం కాదన్నారు. తాము పాత సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ నగరపాలక క్రీడా మైదానం శాసనసభా, శాసనమండలి సభ్యులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను అయ్యన్న పాత్రుడు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు విజయవాడ నగరానికి అసెంబ్లీ ప్రాంగణానికి తీసుకుని వచ్చిన క్రీడా జ్యోతిని స్పీకరు స్వీకరించారు. మైదానంలోకి అఖండ క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో జ్యోతిప్రజ్వలన చేసిన తరువాత ప్రసంగించారు.

ఆటల పోటీలను క్రికెట్ బ్యాట్‌తో తొలి షాట్ ఆడుతూ ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.."ఎన్టీఆర్ గారి హయాంలో వీటిని నిర్వహించేవారు. అప్పట్లో కల్చరల్ ప్రోగ్రాంలు, ఆటల పోటీలుజరిగేవి. రవీంద్రభారతిలో నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రాంలో నేను కూడా ఎమ్మెల్యేనే కదా,నాకు అవకాశంఇవ్వండి అని ఎన్టీఆర్ గారిని అడిగాను. పోటీలో పాల్గొంటానని >>2

## లోకాయుక్తకు 2597 ఫిర్యాదులు

### ప్రజావ్యాజ్యాల పరిష్కారంలో ప్రజల విశ్వాసం పొందిన సంస్థ: జస్టిస్ పి. రజిని

**కర్నూలు, మార్చి 18, ప్రభాతవార్త :** ప్రజా వ్యాజ్యాలపరిష్కారంలో లోకాయుక్త ప్రజల విశ్వాసం పొందిందని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ పి రజిని పేర్కొన్నారు. ఈ మేరకు ఆ సంస్థ వార్షిక నివేదికను మంగళవారం సాయంత్రం మీడియాకు విడుదల చేసింది. 2024 సంవత్సర వార్షిక నివేదికను ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 12 (5) ప్రకారం సోమవారం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సమర్పించారు. జస్టిస్ పి. రజని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొదటి మహిళా ఉప లోకాయుక్తగా 24-02-2024న ప్రమాణ స్వీకారం చేశారు. 15-09-2024న జస్టిస్ లక్ష్మణ రెడ్డి ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా పదవిరమణ చేయడంతో జస్టిస్ పి.రజని, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త (పూర్తి అదనపు బాధ్యతలు)గా బాధ్యతలు చేపట్టారు. 2024లో లోకాయుక్త 2597 ఫిర్యాదులను స్వీకరించారు. అందులో ఎక్కువ ఫిర్యాదులు కర్నూలు జిల్లా నుండి నమోదు అయ్యాయి. తక్కువ ఫిర్యాదులు అల్లూరి సీతారాము రాజు జిల్లా నుండి రిపోర్టు చేయబడ్డాయి.

దుర్వినియోగమైన ఆర్థికనిధుల రికవరీలో లోకాయుక్త ద్వారా రూ.61,27,64,314ల. నిధులను ప్రభుత్వ ఖాతాకు తిరిగి కట్టించారు. వాటి వివరాలు 1). రూ. 52,78,48,436 కేంద్ర ప్రభుత్వ నిధులను అక్రమంగా మళ్లించారు, 2). రూ.1,97,65,412.లు అదనపు నిధులు వివిధ సందర్భాలలో దుర్వినియోగం చేయబడ్డాయి. 3). రూ.1,25,87,000 ల లైబ్రరీ సెస్ జిల్లా గ్రంథాలయ సంస్థలకు మున్సిపాలిటీ/ పంచాయితీల ద్వారా చెల్లించబడ్డాయి. 4). సహకార సంఘ అధ్యక్షుడి నుండి రూ.43,73,600 లు మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యాధికారులనుండి మూడు లక్షలు రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జను చేయించడం జరిగింది. ఇది ప్రజల సొమ్మును పరిరక్షించడంలో ఈ సంస్థ యొక్క తిరుగులేని నిబద్ధతకు నిదర్శనం అని చెప్పవచ్చు. కాలుష్యం, పర్యావరణ మరియు భూమి సమస్యలపై అనేక క్రియాశీలక చర్యలు తీసుకున్నారు.

**భూ వివాదాల్లో పారదర్శకత**

2024లో వచ్చిన ఫిర్యాదులో సగానికి పైగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి. భూస్వామ్య నమోదు అనుచిత మార్పులపై లోకాయుక్త చర్యలు తీసుకున్నారు. భూమి మ్యుటేషన్లలో జరిగిన అవకతవకలు, మండల స్థాయి అధికారులు భూ రికార్డులలో అనాధికారిక మార్పులపై లోకాయుక్త సంస్థ ప్రధానంగా ద్రుష్టి సాధించింది. అందులో భాగంగా భూవర్గీకరణ ప్రక్రియలో పారదర్శకత మరియు జవాబుదారితనం కోసం సమగ్ర సర్క్యులర్ సూచనలను అందించాలని లోకాయుక్త భూపరిపాలన ప్రధాన కమీషనర్ మరియు ప్రధాన కార్యాదర్శి ఆంధ్రప్రదేశ్ వారిని ఆదేశించారు... అవినీతి అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు. అవినీతి మరియు అక్రమాలపై లోకాయుక్త/ ఉపలోకాయుక్త నిరంతర చర్యలు కొనసాగించారు. ఫలితంగా అవినీతి అక్రమాలకు పాల్పడిన >>2

## విజయసాయికి మళ్లీ సిఐడి నోటీసులు

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి సిఐడి అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు ఈ నెల 25వ తేదీన విజయసాయి రెడ్డి మళ్లీ విచారణకు రావాలని నోటీసులో తెలిపారు. కాకినాడ సీ పోర్ట్, సెజ్ వ్యవహారంలో గత బుధవారం విచారణకు సిఐడి అధికారులు పిలిచిన విషయం తెలిసిందే. విజయవాడ సిఐడి కార్యాలయంలో 5 గంటలపాటు విజయసాయి రెడ్డిని విచారణ చేశారు. అవసరమైతే మళ్లీ రావాలని సిఐడి అధికారులు చెప్పారు. ఆ మేరకు విజయసాయి రెడ్డికి సిఐడి అధికారులు మళ్లీ నోటీస్‌లు జారీ చేశారు.కాకినాడ సీపోర్టు ప్రైవేటు లిమిటెడ్ అధిపతి కేవీ రావు నుంచి అక్రమంగా వాటాలను బదిలీ చేసుకున్నారన్న ఆరోపణలపై విజయసాయిరెడ్డిని గతంలో మంగళగిరి సిఐడి పోలీసులు ప్రశ్నించారు. వాటాలు ఏ విధంగా తీసుకున్నారు, బలవంతంగా లాక్కున్నారా, బలవంతంగా తీసుకుంటే ఇందులో ఎవరెవరి పాత్ర >>2

## 8 జిల్లాల్లో స్టేడియంల నిర్మాణం

### కొత్త క్రీడా వికాస కేంద్రాలు కూడా నిర్మిస్తాం: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**సచివాలయం,మార్చి 18,ప్రభాతవార్త :** ఎస్ఏఏపి నియంత్రణలో రాష్ట్రంలోని జిల్లా ప్రధాన నగరాల్లో స్టేడియాలు 25 ఉన్నాయని, 44 క్రీడా వికాస కేంద్రాలున్నాయన్నారు. మంగళవారం శాసన మండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల క్రార్యక్రమంలో పిడిఎఫ్ సభ్యులు వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వివరిస్తూ నూతన జిల్లాల్లో కూడా స్టేడియాల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఇప్పటికే కొత్తస్టేడియంలు మంజూరు కోసం ప్రజాప్రతినిధుల నుండి 31ప్రతిపాదనలు అందాయన్నారు. ఇప్పటి లెక్కల ప్రకారం రాష్ట్రంలో 8జిల్లాల్లో స్టేడియాలు,క్రీడా వికాస కేంద్రలు లేవన్నారు. సింథటిక్ ట్రాక్‌ల ఏర్పాటు పరిశీలిస్తున్నామన్నారు. రైల్వేల్లో సైతం క్రీడాకారులకు కన్సెషన్ ఇచ్చేలా చర్చలు ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన పే అండ ప్లే విధానంను తొలగించనున్నామన్నారు. 50 ఏళ్లకు ఫించను పథకంపై లేళ్ల అప్పిరెడ్డి, తూమాటి మాధవరావు, బొమ్మి ఇజ్రాయేల్‌లు అడిగిన ప్రశ్నకు ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై సాధికారత, సంబంధాల శాఖ మంత్రి సమాధానం చెబుతూ 2024-25 సంవత్సరంలో పింఛన్ పథకం క్రింద 50-59 సంవత్సరాల వయస్సుగల 12,09,732 మందికి ఫించన్లు అందించామని,రూ.4709.77కోట్లు పింఛన్ అందించామన్నారు. 50ఏళ్లు దాటిన అర్హులందరికీ పింఛన్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యానవన రైతులకు ప్రోత్సాకాలు పై భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ,బి.తిరుమల నాయుడు, దువ్వారపు రామారావులు >>2

19-03pg2exHMNWJQE.qxd:19-03pg2exHMNWJQE.qxd 01/01/01 9:49 AM Page 1





మంగళవారం తానా సభలకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం అందిస్తున్న ఆ సంస్థ ప్రతినిధులు

## తానా సభలకు సిఎం చంద్రబాబుకు ఆహ్వానం

**విజయవాడ, మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికాలోని డెట్రాయిట్‌లో జరిగే ఈ ఏడాది జులై 3 నుంచి 5 వరకు తానా సమావేశాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తానా ప్రతినిధులు ఆహ్వానించారు. తానా ఛైర్మన్ గంగాధర్ నాదెళ్ల, తానా కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్ పాంత్రా, మాజీ ప్రెసిడెంట్ జయరాం కోమటి పలువురు ఎన్నారైలు ముఖ్యమంత్రి గారిని కలిసిన వారిలో ఉన్నారు.

## ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు

### నేడు బిల్‌గేట్స్‌తో భేటీ

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సాయంత్రం 4 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయలు దేరి ఢిల్లీ చేరుకున్నారు. రోజు రాత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుటుంబంలో జరిగే వివాహ రిసెప్షన్ కు హాజరు అవుతారు. ఈ సందర్భంలో ఆయన పలువురు మంత్రులను కలుసుకునే అవకాశం ఉంది. ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్‌తో ఢిల్లీలో సమావేశం అవుతారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం అందించనుంది. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ ఒప్పందాలు చేసుకుంటాయి. 19తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ నుంచి బయలుదేరి అమరావతికి తిరిగి వస్తారు. 20వ తేదీ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారు. 20వతేదీ రాత్రికి అమరావతి నుంచి తిరుమల వెళతారు. 21వ తేదీ తిరుమలలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం అవుతారు.

## లోకాయుక్తకు 2597 ఫిర్యాదులు

>> ప్రభుత్వ ఉద్యోగులపై గణనీయమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడ్డాయి. అందులో కొన్ని కేసు నెంబర్లు మరియు వివరాలు (474/2012/బి1 మరియు 1217/2012/బి1). కమ్యూనిటీ ప్రయోజనాల కోసం రిజర్వు చేసిన ఇంటి ప్లాటులను అక్రమంగా కేటాయించి, విక్రయించినందుకు విశాఖపట్నం అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ (ఉడా) మరియు రెవెన్యూ శాఖలోని ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ సంస్థ యొక్క నిరంతర ప్రయత్నాల ఫలితంగా అవినీతి నిరోధకశాఖ నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసింది మరియు అక్రమంగా కేటాయించిన ప్లాట్లకు సంబంధించిన సేల్ డీడ్లను రికవరీ చేయడానికి మరియు రద్దు చేయడానికి చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభించబడ్డాయి. లోకాయుక్త సంస్థపై అవగాహన పెంచడాని మరియు ప్రజలు తమ ఫిర్యాదులను సులభంగా నమోదు చేయడానికి విజయవాడ మరియు విశాఖపట్నంలలో ప్రాంతీయ గ్రీవియన్స్ క్యాంపులు ఏర్పాటు చేయడానికి సిఫార్సు చేయబడింది.ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సంస్థ ప్రజా విశ్వాసం పెంచటానికి, అవినీతి నిరోధానికి క్రుషిచేస్తూ పారదర్శకతకు ప్రాధాన్యతనిచ్చి ప్రజా ఫిర్యాదులను సమర్థవతంగా పరిష్కరించడం ద్వారా సుపరిపాలన ప్రోత్సహించడానికి అంకిత భావంతో ఉన్నది.

## లండన్‌లో చిరంజీవి

### నేడు బ్రిటిష్ పార్లమెంటు పురస్కారం



**లండన్, మార్చి 18:** టాలివుడ్ మెగాస్టార్ చిరంజీవికి బ్రిటన్ పార్లమెంట్‌లో గౌరవ సత్కారం జరగనున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా సినిమాల ద్వారా కళారంగానికి సమాజానికి చేసిన సేవలకుగాను బ్రిటన్‌కి చెందిన అధికార లేబర్‌పార్టీఎంపి నవేందు మిశ్రా చిరంజీవిని ఇతర ఎంపిల సమక్షంలో 19వ తేదీ సత్కరించనున్నారు. సోజన్‌జోసెఫ్, బాబ్‌బ్లాక్‌మన్‌సహా ఇతర పార్లమెంటు సభ్యులు కార్యక్రమంలో పాల్గొంటారు. అదే వేదికపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ, సినిమా మరియు ప్రజాసేవ ధాతృత్వానికి చిరంజీవిచేసిన కృషిని గురించి కల్చరల్ లీడర్‌షిప్‌ద్వారా ప్రజాసేవలో ఎక్స్‌లెన్స్‌కోసం జీవితసాఫల్యపురస్కారం కూడా ప్రధానంచేస్తోంది. బ్రిడ్జి ఇండియా సంస్థ యుకెలో ఒక ప్రముఖ సంస్థ. పబ్లిక్ పాలసీ రూపకల్పనలో కృషిచేస్తుంది. యుకెకి చెందిన పార్లమెంటు సభ్యులు, బ్రిడ్జ్ ఇండియా వంటిప్రఖ్యాత సంస్థ అంతర్జాతీయ వేదికపై చిరంజీవిని సతనకరించడం ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇవ్వడం అనేది ప్రత్యేక సందర్భం.

## ప్రతి కుటుంబానికి ఇంటిస్థలం

>> పథకాలను పునరుద్ధరించడం జరిగింది. జల్‌జీవన్ కోసం రూ.80,000ల కోట్లు కావాల్సి ఉంటే అప్పటి సర్కార్ కేవలం రూ.20,000ల కోట్లు అడిగిందని విమర్శించారు. అందరూ గర్వపడేలా రాజధాని నిర్మిస్తామని స్పష్టం చేశారు. పేదరికం లేని సమాజాన్ని తయారు చేయడమే తమ లక్ష్యమని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని 686 మండలాలకు సంబంధించి బలాలు, అవకాశాలు గుర్తించాం. మండల స్థాయిలో ప్రాథమిక రంగంపైనా, శ్రీ గ్రోత్ ఇంజిన్స్‌పైనా దృష్టి పెట్టాం. 2028- 29 కల్లా విభాగాల వారీగా ఐదేళ్ల లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో ఇవి రూపొందించాం. రాష్ట్రంలోని 26 జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నాం. మౌలిక వసతులు, ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధి చేయడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, గవర్నెన్స్‌కు లక్ష్యాలు ఈ విజన్ డాక్యుమెంట్‌లో సుస్పష్టంగా ఉన్నాయి. వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించుకున్నాం. దీనికి అనుగుణంగా ప్రతి ఏటా 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం. 2047 నాటికి రాష్ట్రాన్ని రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా ప్రభుత్వ ఆశయం. తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేరుకునేలా ప్రణాళికలు అమలు చేస్తాం.. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో, ఇప్పుడు నియోజకవర్గస్థాయిలో విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం. ఎపిలోనూ సౌర విద్యుత్ ఫలకాల ఉత్పత్తిపైనా ప్రభుత్వం దృష్టి పెట్టిందని వివరించారు. సోలార్ మాడ్యూల్స్ ఉత్పత్తి కోసం వచ్చే పరిశ్రమలకూ పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించారు. విద్యుత్ భారం తగ్గించడానికి కరెంటు స్వాపింగ్ అనే విధానానికి కూడా స్వీకారం చుట్టామన్నారు. 600 మెగావాట్ల విద్యుత్ ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి స్వాపింగ్ ద్వారా వస్తోందని వెల్లడించారు. విద్యుత్ స్వాపింగ్ ద్వారా రోజూ 7 కోట్ల రూపాలయలకు పైగా ఆదా అవుతోందని చెప్పారు. సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టు ఏపీకి గేమ్ చేంజర్ అని అన్నారు. పీఎం సూర్యఘర్ కింద ప్రతి ఇంటిలోనూ విద్యుత్ ఉండనుందన్నారు. 2 కిలోవాట్ల సామర్థంతో సౌర ఫలకాలను ప్రతి ఇంటిపైనా ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. వందశాతం మేర సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా ఏపీ మారాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ రావాలని అన్నారు. ప్రతి ఇంటికీ 240 యూనిట్ల మేర విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటు వినియోగం 100 యూనిట్ల మేర ఉంటోందని తెలిపారు. మిగతా విద్యుత్ అంతా డిస్కమ్‌లు కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తాయని అన్నారు. 20 ఏళ్లపాటు ఉచితంగా విద్యుత్ వచ్చే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాల్లోనూ సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది 20 లక్షల ఇళ్లపై ఈ తరహా రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్లు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తద్వారా 1440 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటు సోలార్ పంప్ సెట్ల వద్ద కూడా సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అన్నారు. రైతులు కూడా ఈ సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సబ్ స్టేషన్లను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం ద్వారా పంపిణీ నష్టాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## విజయసాయికి మళ్లీ సిఐడి నోటీసులు

>> ఎంత ఉందనే విషయాలపై అధికారులు విచారణ జరిపారు. కెవి రావు ఫిర్యాదు మేరకు విజయసాయిరెడ్డితో పాటు మెత్తం ఐదుగురిపై సిఐడి అధికారులు కేసు నమోదు చేశారు ఈ కేసులో ఏ 1 విక్రాంత్ రెడ్డి,ఏ2 విజయసాయిరెడ్డి, ఏ3 శరత్ చంద్రారెడ్డి, ఏ4 శ్రీధర్, ఏ5గా అరబిందో రియాల్టీ ఇన్‌ఫ్రా ఉన్నారు. గతంలో ఇచ్చిన నోటీసుల్లో 506, 384, 420, 109, 467, 120(బి) రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్లను సీఐడీ అధికారులు ప్రస్తావించారు.

## ప్రధాని మోడీకి ఆహ్వానం

>> రాల్లో ఇంకా పనులు ప్రారంభించాల్సినవి ఏంటి, వాటిల్లో ప్రధానితో ఏవి శంకుస్థాపన చేయించాలి అనే అంశాలపై సిఎం నివేదిక తయారు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. నేడు, రేపటి ఢిల్లీ పర్యటనలో మోడీని కలిసి రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని చంద్రబాబు ఆహ్వానించనున్నారు. ఇప్పటికే రూ.22 వేల కోట్లకు పైగా అమరావతిలో పనులు చేసేందుకు నిన్న కేబినెట్ కూడా ఆమోద ముద్ర వేసింది.

అదే విధంగా ప్రధాని చేతుల మీదుగానే అమరావతి పనులు పున:ప్రారంభిస్తామని ఇప్పటికే ఓ కార్యక్రమంలో సిఎం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ముహూర్త సమయాన్ని సిద్ధం చేసుకుని ఢిల్లీ వెళ్లాలని సిఎం నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే ఏ సమయం బాగుంటుందనే దానిపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. అమరావతి రాజధాని నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రధాని మోడీ ఎపిలో పర్యటన దృష్ట్యా సిఆర్‌డిఎ అన్ని ఏర్పాట్లను ఇప్పటికే ప్రారంభించింది.

మోడీ పర్యటనకు సంబంధించి సిఎం చంద్రబాబుతో సమీక్షా సమావేశం ముగిసిన అనంతరం సిఆర్‌డిఎ కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు సచివాలయం వెనుక స్థలాన్ని పరిశీలించారు. ఇక రాజధానిలో నవ నగరాల నిర్మాణాలకు సంబంధించిన పనులకు ప్రధాని శంకుస్థాపన చేసేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తంచేసారంటున్నారు. ప్రధాని పర్యటన కోసం రాజధానిలోని ఉద్ధండరాయుని పాలెం, సచివాలయం వెలుపల ఉన్న హెలిపాడ్లను సైతం వినియోగించాలని నిర్ణయించారు. ప్రధాని పర్యటన ఖరారు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లారు. ఒకవేళ ఇది ఖరారైతే సీఆర్డీఏ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తారు.

## సర్‌ఛార్జి మాఫీ

>> మాఫీకి డిస్కంలకు అనుమతినిస్తూ ఇఆర్సీ ఉత్తర్వులు ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన కరెంటు బకాయిలను మాత్రం 2025 ఏప్రిల్ 17వ తేదీ లోపు చెల్లించాల్సిందిగా ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ గడువు తేదీని పొడిగించవద్దని డిస్కంలకు సూచిస్తూ ఎపి ఇఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది.

### వారం - వర్జ్యం

తేది : 19-03-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
పంచమి రా. 12.38
విశాఖ రా. 8.49
వర్జ్యం రా. 1.16-3.03
దు.ఉ. 12.00-12.48
శుభసమయం : సా. 6.00-8.00
రాహుకాలం - మ. 12.00-1.30

### వార్తాఫలం

**మేషం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**వృషభం:**కుటుంబ సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మిథునం:**దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**సింహం:**అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసు కొంటారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**కన్య :** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. రుణవత్తిడులు చికాకులు పెడతాయి.

**వృశ్చికం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. వాహనయోగం.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు. వస్తువులు కొనుగోలు.

**మకరం:** పాతమిత్రులు కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ప్రయాణాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఫొటో సెషన్

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఎమ్మెల్సీల ఫొటో సెషన్ వేదికగా రాజకీయ సందడి నెలకొంది. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్సీలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.ఏపీ అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఫొటో సెషన్ నిర్వహించారు. మొదటి వరుసలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు పాల్గొన్నారు. సీనియారిటీ ప్రకారం ఎమ్మెల్యేలు 2, 3, 4 వరుసల్లో కూర్చున్నారు. అనంతరం ఎమ్మెల్సీల ఫొటో సెషన్ జరిగింది. అసెంబ్లీ వద్ద డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పలకరించారు. ఎమ్మెల్యేలు ఫొటో సెషన్‌ను ముగించుకుని వెళ్తున్న సమయంలో వైఎస్సార్సీ ఎమ్మెల్సీలు ఎదురొచ్చారు. ఈ క్రమంలో పవన్‌ను ఎలా ఉన్నారు, బాగున్నారా అని బొత్స పలకరించారు. ఈ సందర్భంగా నేతలిద్దరూ కరచాలనం చేసుకున్నారు. ఎమ్మెల్సీల ఫొటో సెషన్‌లో ఆసక్తి కర ఘటనలు చోటు చేసుకున్నాయి. మీతో ఫొటో దిగడం నా అదృష్టం అంటూ డిప్యూటీ ఛైర్మన్ జకీయా ఖానం సిఎం చంద్రబాబుతో అన్నారు. డిప్యూటీ ఛైర్మన్ మాటలకు వైఎస్సార్సీ ఎమ్మెల్సీలు ఖంగుతిన్నారు. మీతో విడిగా ఫొటో దిగాలంటూ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సిఎంని కోరారు. ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజాపై లక్ష్మణరావు ఓడిపోయారు. లక్ష్మణరావు అడిగిన వెంటనే సిఎం ఫొటోకు అవకాశం కల్పించారు. మండలిలో ఛైర్మన్ తమకు సరిగా మైక్ ఇవ్వట్లేదని సీఎంతో ఛైర్మన్ సమక్షంలో లోకేశ్ సరదా వ్యాఖ్యలు చేసారు. పట్టుబట్టి మీరే మైక్ తీసుకోవాలంటూ లోకేశ్ తో సిఎం సరదాగా వ్యాఖ్యానించారు. ఫొటో సెషన్‌లో తనకు ముందు వరుసలో అవకాశం ఉందా అని బొత్స అడగ్గా, మండలి ప్రతిపక్ష నేతగా మీకు ముందు వరుసలో సీటు ఉందని చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ చెప్పారు. కానీ బొత్స పొరపాటున వేరే కుర్చీలో కూర్చున్నారు. ఉపముఖ్యమంత్రి కూర్చునే సీటుకు ఇబ్బంది అవుతోందని గమనించి, బొత్సని కూర్చున్న స్థానం నుంచి లేపకుండా లోకేశ్ మరో కుర్చీ ఏర్పాటు చేయించారు.

## మరిన్ని ప్రైవేటు, విదేశీ వర్సిటీలు

>> అంశాన్ని పరిశీలిస్తాం. ఆంధ్రకేసరి యూనివర్సిటీని 2022లో ఎటువంటి శాంక్షన్ పోస్టులు లేకుండా ఎలాంటి పోస్టులు లేకుండా ప్రకాశం జిల్లాలో ఏర్పాటుచేశారు. దీనివల్ల ప్రొఫెసర్లు, సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల బలోపేతానికి దాతలు కూడా ముందుకు వస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన మెకానిజం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆంధ్రకేసరి యూనివర్సిటీనికూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అంతకుముందుకు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతల రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రంలోకి అనుమతించే విషయమై పరిశీలించాలని కోరారు. బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ... రాష్ట్రం నుంచి లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకోసం ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారు. దీనివల్ల రాష్ట్ర సంపద కూడా పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోంది. కొన్ని వర్సిటీలు ఇక్కడ ఏర్పాటుచేసినా ఐటి, జిఎస్‌టి రిజిస్ట్రేషన్ వేరే ప్రాంతాల్లో ఉండటం వల్ల ఆదాయం అక్కడకు వెళుతోంది. ప్రైవేటు యూనివర్సిటీలు ఇంకా పెద్దఎత్తున రాష్ట్రానికి రప్పించేందుకు సబ్సిడీపై వారికి భూములు ఇవ్వాలి. మన రాష్ట్రంలోకూడా ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున జాతీయ, అంతర్జాతీయస్థాయి వర్సిటీలను ప్రోత్సహించాలని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ... కనిగిరిలో ట్రిపుల్ ఐటి విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది, తిరిగి ప్రారంభించాలని కోరారు. చేనేత కళాకారులకు 200 యూనిట్లు, పవర్ లూమ్ ఉన్నవారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలనే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదముద్ర వేయడం తనకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలలలోగానే తాను ఇచ్చిన మాటను మంత్రి మండలి కార్యరూపంలో పెట్టడం ఎన్డీఏ ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేతలందరూ పడుతున్న ఇబ్బందులు కళ్లారా చూశాక చేనేతలకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చానని నేడు మాట నిలబెట్టుకుని చేనేతలకు చేదోడుగా నిలిచామని పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని అనేక సంస్కరణలు చేపట్టాం. విద్యార్థుల మానసిక వికాసానికి ఫిజికల్ ఎడ్యుకేషన్ కీలకపాత్ర వహిస్తుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి పిఇటిలను నియమించే విషయమై సమీక్షిస్తున్నాం. క్రీడాస్థలాల విషయంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు - 2025 ను మంత్రి నారా లోకేష్ శాసనసభలో ప్రవేశపెడుతూ... దేశంలో విదేశీ విశ్వ విద్యాలయాలను కేంద్రప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది, వివిధ ఫారిన్ వర్సిటీల క్యాంపస్‌లను రాష్ట్రానికి రప్పించాలన్నది సభ్యుల మనోగతం.



టగ్ ఆఫ్ వార్‌లో గెలిచిన మహిళల జట్టు

## క్రీడలు ఉపశమనం

>> చెప్పి దానవీరశూర కర్ణ ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించి అవార్డు దక్కించుకున్నాను" అని గుర్తు చేసుకున్నారు. కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉంటున్నారని, వారికీ ఆటవిడుపుగా ఉండేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని స్పీకర్ తెలిపారు.ఇలాంటి ఆటపాటలు మనకు స్ఫూర్తి కలిగిస్తాయని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. యువతను ప్రోత్సహించేందుకు ఇలాంటివి దోహదం చేస్తాయని చెప్పారు. నియోజకవర్గాల్లో గేమ్స్‌ను ప్రోత్సహిద్దామన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని శాప్ ఛైర్మన్ రవినాయుడు స్పష్టంచేశారు. చంద్రబాబు సీఎం అయ్యాక క్రీడలకు మరింత ప్రోత్సాహం లభిస్తోందని క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టంచేశారు. "మూడురోజుల పాటు ఈ పోటీలు జరుగనున్నాయి. అందరూ ఉత్సాహంగా పాల్గొనాలి. రాష్ట్రంలో చాలా మంది యువ క్రీడాకారులు ఉన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ, ఆటలకు పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం" అని అన్నారు. 20వ తేదీన నిర్వహించే కల్చరల్ ప్రోగ్రాంలో అన్ని రంగాలకు చెందిన శాసనసభ్యులు పాల్గొనాలని స్పీకర్ పిలుపునిచ్చారు. శాసనసభ్యులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో విజయకేతనం శాసనసభ్యులకు నిర్వహించిన ప్రత్యేక క్రీడా పోటీల్లో భాగంగా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు వాలీబాల్ పోటీలో పాల్గొన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు యువకుల తరహాలో మైదానంలో చురుకుగా కదలాడి, ప్రత్యర్థి జట్టుపై ఆధిక్యత చూపించారు. వాలీబాల్ ప్లేయర్‌గా గతంలో మంచి అనుభవం కలిగిన స్పీకర్, అదే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ తన జట్టుకు గెలుపును అందించారు. సభ్యులకు షటిల్, త్రోబాల్, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, కబడ్డీ, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్ (పరుగు పందెం, షాట్‌పుట్) పోటీలు నిర్వహించనున్నారు. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, టెన్నికాయిట్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్ క్రీడలు ఉండనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు మొత్తం 173 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు పోటీలకు దూరంగా ఉన్నారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ ఎమ్మెల్సీలు శివరామరెడ్డి, వంకా రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ పోటీ నీదా నాదా అంటూ సాగింది. ఇందులో పురుష సభ్యులపై మహిళా ప్రజాప్రతినిధులు గెలిచారు. అదేవిధంగా మహిళా సభ్యులకు జరిగిన టగ్ ఆఫ్ వార్ పోటీలో హోం మంత్రి బృందంపై సంధ్యారాణి నేతృత్వంలోని టీం గెలుపొందింది. పురుష సభ్యులకు టగ్ ఆఫ్ వార్ పోటీ అచ్చెన్నాయుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరిల మధ్య జరిగింది. ఇందులో బుచ్చయ్య చౌదరి నేతృత్వంలోని జట్టు గెలిచింది.

## షటిల్‌లో విజేతగా నిలిచిన దగ్గుపాటి జట్టు

### దగ్గుపాటి ప్రసాద్ వర్సెస్ నాదెండ్ల మనోహర్ మధ్య పోటీలు , జనసేన జట్టుపై టిడిపి జట్టు విజయం

**అనంతపురం, మార్చి 18, (ప్రభాతవార్త బ్యూరో):** విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన షటిల్ పోటీల్లో అనంత పురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జట్టు విజయం సాధించింది. టిడిపి ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, వెనిగళ్ళ రాము ఒక జట్టుగా, జనసేన ఎమ్మెల్యేలు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, బొమ్మిడి నాయకర్లు ఒక జట్టుగా షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి మంచి షాట్స్‌తో ఆకట్టుకున్నారు. జనసేన జట్టుపై టిడిపి జట్టు విజయం సాధించింది. ఎంతో స్నేహపూర్వకంగా జరిగిన ఈ పోటీలు తమకు ప్రత్యేక అనుభూతిని నింపాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## ఓటర్ కార్డు అనుసంధానం

>> జాబితాలోచేర్చడంద్వారా ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి లబ్దిపొందిందని కాంగ్రెస్ ఇతర విపక్షాలు భారీ ఎత్తున నిరసన వ్యక్తంచేసాయి. ఎన్నికల కమిషన్‌ను కూడా కలిసి ఫిర్యాదులుచేయడంతో పాటు పార్లమెంటు సమావేశాల్లోకూడా ఈ అంశంపై చర్చ జరగాలని పట్టుబట్టాయి. వీటన్నింటినీ అధిగమించేందుకు తాజాగా ఎన్నికల సంఘం ఓటరు గుర్తింపుకార్డును ఆధార్‌తోఅనుసంధానంచేయడంద్వారా అన్ని అక్రమాలను అరికట్టవచ్చని భావిస్తోంది. ఈప్రక్రియకు ఇపుడు కేంద్రం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నికల సంఘం ఈప్రక్రియను చేపట్టింది.

## అమ్మాయితో మాట్లాడదామని పిలిపించి హత్య

### నిందితుల్ని అరెస్టు చేసిన పోలీసులు

**నెల్లూరు క్రైమ్, మార్చి 18, ప్రభాతవార్త :** నగరంలోని పొదలకూరు రోడ్డు ప్రాంతంలో ఈనెల 14వ తేదీ రాత్రి జరిగిన అరవ భూమి సుజన్ కృష్ణ అలియాస్ చింటూ హత్య కేసులో నిందితుల్ని వేదయపాలెం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను నగర డిఎస్పి సింధు ప్రియ మంగళవారం వేదయపాలెం స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు.. మృతుడు సుజన్ కృష్ణ (28) పై వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. మృతునికి అతను స్నేహితులైన ఇరా నగర్‌కు చెందిన శివకృష్ణ సాయి, షేక్ మహబూబ్ బాషా, రామకోటయ్య నగర్‌కు చెందిన సయ్యద్ కరీముల్లా, రావు నగర్‌కు చెందిన గొలగమూడి పవన్, మనుబోలుకు చెందిన కోసూరు సాయి తేజ, వెంగళరావు నగర్‌కు చెందిన అనిక్ రాజులతో ఇటీవల కాలంలో స్వల్ప వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో ఒకరోజు శివకృష్ణ సాయి ఇంటికి వెళ్లిన మృతుడు సృజన కృష్ణ అతనితోపాటు ఇతర స్నేహితులతో ఘర్షణ పడి వారి అంతు చూస్తానని బెదిరించి వచ్చాడు. తన ఇంటికి వచ్చి తన అంత చూస్తానని చెప్పడంతో సుజన కృష్ణని ఎలాగైనా అంతం అందించాలని నిందితులు నిర్ణయించుకుని ప్లాన్ ప్రకారం సుజన్ కృష్ణతో ఒక అమ్మాయి విషయం మాట్లాడాలని పొదలకూరు రోడ్డు వద్దకు పిలిపించారు. అక్కడికి ఒంటరిగా వచ్చిన సృజన్ కృష్ణపై నిందితుల ఆరుగురు కత్తులతో రాడ్డులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలు పాలైన సుజన్ కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న వేదయపాలెం సిఐ శ్రీనివాసరెడ్డి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వెంగళరావునగర్ సమీపంలో తచ్చాడుతున్న ఆరుగురు నిందితులను మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

## ఏప్రిల్ 1దాకా వల్లభనేనికి రిమాండ్

>> కొనుగోలు చేసేందుకు తాను మహిళతో అగ్రిమెంటు చేసుకున్నానని శ్రీధర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా రాము, వల్లభనేని వంశీ, రంగా మరొకరిపై ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వంశీ ఎ-2గా ఉన్నారు.గన్నవరం కోర్టులో ఆత్కూరు పోలీసులు ఇటీవల పిటి వారెంట్ దాఖలు చేశారు. కోర్టు అనుమతించడంతో మంగళవారం విజయవాడ నుండి గన్నవరం తీసుకెళ్ళి కోర్టులో హాజరుపర్చారు. తనకు జైలులో ఇనుసప మంచం ఇచ్చారని, పరుపు,ఫైబర్ కుర్చీ ఇచ్చేందుకు జైలు అధికారులను ఆదేశించాలని వంశీ న్యాయమూర్తిని కోరారు. ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక కోర్టులో ఈ అంశంపై విచారణ జరిగిన నేపథ్యంలో తాను వాటిపై ఆదేశాలివ్వలేనని గన్నవరం కోర్టు తెలిపింది. సంబంధిత కోర్టులోనే పరిష్కరించుకోవాలని వంశీకి సూచించింది. మెడికల్ రిపోర్టులు పొందుపరిస్తే వాటి ఆధారంగా ఫైబర్ కుర్చీ ఇచ్చే అంశంపై ఆదేశాలిస్తామని కోర్టు తెలిపింది. విచారణ అనంతరం వంశీని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

## స్టేడియంల నిర్మాణం

>> అడిగిన ప్రశ్నకు వ్యవసాయ శాఖమంత్రి కింజారపు అచ్చన్నాయుడు సమాధానం చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథాకల ద్వారా ఉద్యానవన రైతులకు ఉద్యానవన శాఖ ఆర్థిక సహాయం ద్వారా ప్రోత్సహకాలను అందిస్తుందన్నారు.క్రెడిట్ లింక్డ్ బ్యాంక్ ఎండెడ్ సబ్సిడీగా 5000 మెట్రిక్ టన్నుల గరిష్ట పరిమితితో శీతల స్టోరేజి నిర్మాణం నిమిత్తం రైతులకు రూ.1.40కోట్ల ఆర్థిక సహాయం అంటే ప్రాజెక్టు వ్యయంలో 35శాతం అందించడమవుతుందన్నారు.గత ప్రభుత్వం ఐదేళ్ళలో సూక్ష్మ సేద్య పరికరాలు అందించలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 8నెలల్లోనే లక్ష హెక్టార్లకు డ్రిప్ పరికరాలు అందచేశామన్నారు.

19-3Pg3exHMNWJQECPKLR.qxd:19-3Pg3exHMNWJQECPKLR.qxd 01/01/01 9:05 AM Page 1



# రైల్వే లోకో ఇన్‌స్పెక్టర్ల బదలీలు

### గుంతకల్లు సిసిసిగా మనీష్

### సిఎల్ఐ ఓపెన్ లైన్‌గా జె ప్రసాద్

**గుంతకల్లు రైల్వే,మార్చి 18,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ విద్యుత్ టిఆర్ఎస్ఓ విభాగం లోకో రన్నింగ్‌లో పని చేస్తున్న పలువురు చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ (సిఎల్ఐ)లను బదిలీలు చేస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుంతకల్లు డివిజనల్ కేంద్రంలో హెడ్‌క్వార్టర్స్ సిఎల్ఐగా పనిచేస్తున్న పి మనీష్‌ను గుంతకల్లు చీఫ్ క్ర్యూ కంట్రోలర్(సిసిసి)గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న జి నారాయణ స్వామిని ఆర్‌సిడి సిఎల్ఐగాను,స్థానిక ఆర్‌సిడిసిఎల్ఐగా పనిచేస్తున్న జె ప్రసాద్‌ను ఓపెన్ లైన్ సిఎల్ఐగా, స్థానిక ఓపెన్ లైన్ సిఎల్ఐగా పనిచేస్తున్న కె వెంకటేశ్వర్లును గుంతకల్లు హెడ్ క్వార్టర్ ్స సిఎల్ఐగా,ఇక్కడ సిఎల్ఐగా పనిచేస్తున్న డిల్లీబాబును ఓపెన్ లైన్ సిఎల్ఐగా,గుత్తి ఓపెన్ లైన్ సిఎల్ఐలుగా పనిచేస్తున్న యస్‌కె అబ్దుల్ ఘనీ,ఆర్ రాజశేఖర్‌లను గుంతకల్లు ఓపెన్ లైన్ సిఎల్ఐలుగా, గుంతకల్లు ఓపెన్ లైన్ సిఎల్ఐలుగా పనిచేస్తున్న బి నాగప్ప నాయక్,వెంకటేశ్వర్లులను గుత్తి ఓపెన్ లైన్ సిఎల్ఐలుగా బదలీ చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,మార్చి 18,ప్రభాతవార్త:** రానున్న వేసవి సీజన్‌లో తెలుగు రాష్ట్రాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తిరుపతి-అకోలా-తిరుపతి మధ్య తిరిగే నెంబర్ 07605/06 వీక్లీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఏప్రిల్ 4నుంచి జూన్ 29వరకు,పూర్ణ-తిరుపతి-పూర్ణ మధ్య తిరిగే నెంబర్ 07609/10 వీక్లీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఏప్రిల్ 7నుంచి జూలై 1వరకు,కాకినాడ టౌన్-లింగంపల్లి-కాకినాడ టౌన్ మధ్య తిరిగే నెంబర్ 07445/06 త్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను ఏప్రిల్ 2నుంచి జూలై 1వరకు, తిరుపతి-వికారాబాద్-తిరుపతి మధ్య తిరిగే నెంబర్ 07481/82 వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను ఏప్రిల్ 6నుంచి జూన్ 30వరకు నడుపుతున్నట్లు తెలిపారు.

# దివాన్ చెరువు సమీపంలో రాష్ట్ర ఫారెస్ట్ అకాడెమీ: డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** అటవీ శాఖ సిబ్బందికి సంబంధించిన శిక్షణను బలోపేతం చేసే దిశగా తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువు సమీపంలో రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీని నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర ్ణయించింది. దివాన్ చెరువు దగ్గర ఉన్న రక్షిత అటవీ ప్రాంతంలో అకాడమీని ఏర్పాటు చేస్తే సిబ్బందికి అవసరమైన శిక్షణ, అటవీ వాతావరణాన్ని కల్పించడంతోపాటు రవాణా, తత్సంబంధిత మోలిక సదుపాయాలూ ఉంటాయని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. రక్షిత అటవీ ప్రాంతాన్ని వినియోగించుకొనే విషయంలో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ నుంచి స్పష్టత తీసుకోవాలని రాష్ట్ర ప్రభు త్వం భావించింది. దీనిపై కేంద్రానికి లేఖ రా శారు. దివాన్ చెరువులోని రక్షిత అటవీ ప్రాం తంలో రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ ఏర్పాటు చేసుకో వచ్చంటూ స్పష్టత ఇచ్చింది. కేంద్రం స్పష్టత ఇచ్చిన క్రమంలో అకాడమీ ఏర్పాటుకు అవస రమైన చర్యలు వేగంగా చేపట్టాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు పవన్ దిశానిర్దేశం చేశారు.

# కృష్ణా ప్రాజెక్టులు కెఆర్ఎంబికి అప్పగించాలనే కేంద్రం నోటిఫికేషన్‌పై సుప్రీంలో విచారణ

**విజయవాడ మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కేఆర్ ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టులను అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 2021లో కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. మరోవైపు అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ నీటిని వాడుకుంటోందని ఏపీ ప్రభుత్వం సైతం సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. తెలంగాణ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషన్‌లో ఏపీ కోరింది. ఈ మేరకు ఏపీ తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. కేంద్రం ఇచ్చిన పిటిషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ మరో పిటిషన్ వేసింది. స్టేఇవ్వాలని తెలంగాణ వేసిన రిట్ పిటిషన్లపై 2 వారాల్లో కౌంటర్ వేయాలని కేంద్రం ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇరు ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేసిన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

# 30న ఉగాది ఆస్థానం

## 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వతేదీ ఆదివారం తెలుగు నూతన "విశ్వావసునా మ సంవత్సర"ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఈ సందర్భంగా 30వ తేదీవిఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. అలాగే 29వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.

**25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం:** తిరుమలేశుని ఆలయంలో ఉగాది పర్వదినానికి ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం 25వతేదీ మంగళవారం ఉదయం నిర్వహిస్తున్నారు. ఉదయం 6గంటల నుండి 11గంటల వరకు ఆనందనిలయంలోని మూలవిరాట్టు సన్నిధి నుండి మహద్వారం వరకు, ఉప ఆలయాలు



పూర్తిగా పవిత్ర జలంతో శుద్ధిచేస్తారు. పూజా సామాగ్రిని కూడా కడుగుతారు. అనంతరం స్వామివారికి అలంకరణ చేసి ప్రత్యేక నివేదనలు పూర్తయిన వెంటనే భక్తులను దర్శనానికి అనుమతినిస్తారు. ఈ సందర్భంగా మంగళవారం విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. 24వతేదీ సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు. ఆరోజు అష్టదళపాద పద్మారాధన సేవ కూడా రద్దు చేశారు. తిరుమలలో ఏటా నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతార. ఉగాది ఆస్థానం, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం ఈ మహాయజ్ఞం చేపట్టడం సాంప్రదాయం.

**30న బంగారు వాకిలిలో ఆస్థానం:** శ్రీనివాసుడు కొలువైన ఆనందనిలయంలో బంగారువాకిలిలో 30వతేదీ ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం అనంతరం ఆలయ శుద్ధి చేస్తారు. ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు ,ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. ఆ తరువాత పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం టిటిడి రద్దు చేసింది.

# అసెంబ్లీ ప్రాంగణంలో అరకు కాఫీ స్టాళ్లు

## ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పాల్గొన్న సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు



అరుకు కాఫీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**విజయవాడ.మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీ ప్రాంగణంలో 2 అరకు కాఫీ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రాం గణంలో అరకు కాఫీ స్టాల్‌ను స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు, ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి, గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌లు పాల్గొన్నారు. అరకు ప్రాంతం నుంచి సేంద్రీయ విధానంలో ఉత్పత్తి చేసిన ఈ కాఫీ ప్రత్యేకమైన రుచిని కలిగి ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని, ఇలాంటి ఉత్పత్తులను ప్రభుత్వ పరంగా మరింత ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అరకు కాఫీని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు.

శాసనమండలి ప్రాంగణంలో మరో అరకు కాఫీ స్టాల్ ను ఛైర్మన్ మోషన్ రాజు ప్రారంభించారు.ఇక అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు గిరిజన శాఖా మంత్రి సంధ్యా రాణి అరకు కాఫీ కిట్స్ అందజేసారు.

# బాలల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాలల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రశ్నా సంఖ్య 819 కింద జరిగిన చర్చలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. రాష్ట్రంలోని అంగన్వాడీ బాలల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.ప్రస్తుతానికి 55,607 అంగన్‌వాడీ కార్యకర్తలు,5,31,446 సహాయకులు సేవలందిస్తున్నారు. రాష్ట్రంలో 55,67 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తుండగా 5,31,446 గర్భవతి బాలింత తల్లులు, 13,03,384 మంది 3 సంవత్సరాల లోపు పిల్లలు, 7 లక్షల మంది 3 నుండి 6 సంవత్సరాల మధ్య వయసు పిల్లలకు అంగన్వాడి సిబ్బంది ఆరోగ్య పోషకాహారం సేవలు అందిస్తున్నారు.రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు.జీతాల పెంపు, విధుల భారం తగ్గింపు, పనిసమయాల అనిశ్చితి వంటి సమస్యలపై చర్యలు.201419 మధ్య 18,301 అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరిచారు.55,607 అంగన్‌వాడీ కేంద్రాలకు తగిన నిధుల కేటాయింపు. 17,984 నూతన అంగన్ వాడీ కేంద్రాలను నిర్మిస్తామన్న జగన్ రెడ్డి ఆర్భాటపు ప్రకటనలు కాగితాలకి పరిమితం అయ్యాయని మంత్రి విమర్శించారు. కోటము ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్ వాడీ కేంద్రాల్లో మోలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ ఐదు రకాల స్కీముల కింద ఒక్కో అంగన్వాడికి రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేసింది అని మంత్రి తెలిపారు.

# ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఒంటిమిట్ట

## టూరిజం మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రముఖ దేవాలయమైన ఒంటిమిట్ట రామాలయాన్ని అధ్యాత్మిక పర్యాటకం (టెంపుల్ టూరిజం) పరిధిలోకి తీసుకువచ్చే ప్రతిపాదన ఉందని, త్వరలోనే ఒంటిమిట్ట పుణ్యక్షేత్రాన్ని అధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు వి.రామచంద్రారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి దుర్గేష్ స్పష్టమైన వివరణ నిచ్చారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ టెంపుల్ టూరిజం క్రింద ఒంటిమిట్ట సీతారామ స్వామి దేవాలయాన్ని పూర్తిస్థాయిలో ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనను కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. ఆ దేవాలయం క్రింద చుట్టు ప్రక్కల ఉన్న దేవుని గడప లక్ష్మి వెంకటేశ్వర స్వామి టెంపుల్, పుష్పగిరి చెన్నకేశవ స్వామి టెంపుల్,



బ్రహ్మంగారి మఠం, ఒంటిమిట్ట కోదండరామాలయం టెంపుల్, గండి శ్రీవీరాంజనేయ స్వామి టెంపుల్, యాగంటి ఉమామహేశ్వర స్వామి టెంపుల్, నందవరం చౌడేశ్వరి మఠం, మహానందీశ్వర స్వామి టెంపుల్ లను కలుపుతూ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మార్చాలన్న ఆలోచనను చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఒంటిమిట్ట సీతారామ స్వామి వారి దేవాలయం తిరుపతి తిరుపతి దేవస్థానం ఆధీనంలో నడుస్తోందని తెలిపారు. ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన పాలసీ ద్వారా ఆధ్యాత్మిక టూరిజంకు కొన్ని టెంపుల్స్ ని, ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం, వెల్ నెస్ టూరిజం ఇలా వివిధ రకాల టూరిజం లతో పాటు విభిన్న సర్క్యూట్‌లను ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. గడిచిన ఐదేళ్లలో ఒంటిమిట్ట సమీపంలోని హరిత రిసార్ట్స్ నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం అక్కడ హరిత రిసార్ట్స్ లో కేవలం 4 గదులు మాత్రమే ఉన్నాయని, వాటిని శుభ్రపరిచి, వాటి సంఖ్యను పెంపొందించి మరిన్ని సౌకర్యవంతమైన రూమ్స్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ మధ్యనే రాష్ట్ర పర్యాటకాభివృద్ధి విషయమై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను ఢిల్లీలో కలిసి చర్చించానని గుర్తుచేశారు. రాష్ట్రంలో చాలా టూరిజం ప్రాజెక్టులకు ప్రతిపాదనలు రూపొందించామని, తమ ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారని, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి మంచి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తమతో అన్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ఏప్రిల్ తర్వాత ఒంటిమిట్ట క్షేత్రంపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి అధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఈ సందర్భంగా శాసనమండలిలో మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

# ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం: మంత్రి వాసంశెట్టి సుభాష్



జహ్నవి తండ్రికి రూ.50వేల సాయం అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

**విజయవాడ మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదలో ఉన్నవారు ఎవరైనా సరే వారిని ఆదుకొని సహకరించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంకి చెందిన పట్టణాల శివ కు మార్తె జాహ్నవి కిడ్నీల సమస్యతో బాధపడుతోంది. ఈమె డయాలసిస్ నిమిత్తం తిరుపతి ఆసుపత్రికి చేర్పించాల్సి ఉంది. ఇందుకు ఆమె వైద్య సేవలు దారి ఖర్చులు గురించి మంత్రి దృష్టికి తీసుకురావడంతో చలించి పోయిన మంత్రి వాసంశెట్టిసుభాష్ ఆమెకు 50 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని మంగళవారం జహ్నవి తండ్రికి తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేకమందికి ఇలాంటి సహకారం అందించడం జరిగిందని భవిష్యత్తులో యువకులు పేదరికంతో అనారోగ్య సమస్యల మూలంగా ఇబ్బంది పడకూడదన్న లక్ష్యం ప్రభుత్వాన్నిదన్నారు. ఎవరైనా పేదవారు అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు తీసుకుందని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇచ్చిన హామీలు నెరవేర్చే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు.

# నవతరానికి అన్నమాచార్యుల కీర్తనలను అందించాలి: టిటిడి ఇఒ శ్యామలరావు

**తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి:** నవతరానికి అందుబాటులో ఉండేలా, మరింతగా జనబాహుళ్యంలోనికి తాళ్ళపాక అన్నమాచార్య కీర్తనలను తీసుకెళ్ళేలా చర్యలు చేపట్టాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు ఆదేశించారు. ఎస్వీరికార్డింగ్ ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ ఆధ్వర్యంలో టిటిడి పరిపాలన భవనంలో మంగళవారం సాయంత్రం తెలుగురాష్ట్రాలతోబాటు బెంగళూరు, చెన్నైకి చెందిన గాయకులు, సంగీత దర్శకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ అన్నమయ్య 32వేల కీర్లనలలో ఇప్పటివరకు 14,932 కీర్తనలను టిటిడి అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ఇందులో 4,750 కీర్తనలను ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు రికార్డుచేసి 4,610 కీర్తనలను టిటిడి వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. మొదటి దశలో 290 కీర్తనలను 29సిడిలను పూర్తిచేయగా, రెండోదశలో 210 కీర్తనలను 21 సిడిలను రూపొందించారన్నారు. మరో 130 కీర్తనలతో 13 సిడిలను త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. మరింత నాణ్యతగా అన్నమయ్య కీర్తనలను అందించేలా ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.



# తిరుమల సమాచారం



# రేపు తిరుమలకు సిఎం చంద్రబాబు

## 21న మనవడు దేవాన్ష్ పుట్టినరోజున శ్రీవారి దర్శనం

## రూ.44లక్షలు అన్నప్రసాదానికి విరాళాలు


**తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబంతో కలసి 20వతేదీ గురువారం సాయంత్రం తిరుమలకు వస్తున్నారు. 21వతేదీ మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులు నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్రమంత్రి నారాలోకేశ్, కోడలు నారా బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌తో కులదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకుంటారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంకు చేరుకుని 44లక్షల రూపాయలు విరాళాలందిస్తారు. ఆ రోజంతా దేవాన్ష్ పేరున భక్తులకు అన్నదానం చేస్తారు. ఇందులో స్వయంగా సిఎం చంద్రబాబు కుటుంబం పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు తిరుమల పద్మావతి అతిథి గృహం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు, భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. 21వతేదీ తిరుమలలోనే సిఎం టిటిడి అభివృద్ధిపై, తిరుమల విజన్ 2047పై సమావేశమవుతారు. పిఎసి 5 కూడా ప్రారంభించే అవకాశం ఉంది. ఇంకా పలు అభివృద్ధి కార్యక్రమాలు, సామాన్యభక్తులకు తక్కువ సమయంలో దర్శనం, ఆలయ పవిత్రతను పరిరక్షించాల్సిన అంశాలపై సమీక్షించనున్నారు. 21వతేదీ మధ్యాహ్నం తిరుమల నుండి తిరుగుప్రయాణం కానున్నారు. సిఎం చంద్రబాబు కార్యక్రమాలపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధనరాజు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



# టిటిడికి కర్ణాటక భక్తుడు భూరివిరాళాలు

## రూ.1.23కోట్లు పలు పథకాలకు అందజేత

**తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో దాతలు తమవంతుగా పలు పథకాలు, ట్రస్టులకు విరాళాలు ఇస్తున్నారు. మంగళవారం ఉదయం కర్నాటక బళ్ళారికి చెంది ఓ దాత 1.23కోట్ల రూపాయలు విరాళాలను పలు పథకాలకు డిడిలను అందించారు. బళ్ళారిలోని శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు తిరుమలలో మంగళవారం ఉదయం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరిని కలసి 1,23,33,333 కోట్లరూపాయల డిడిలు అందజేశారు. ఇందులో ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు 1,01,11,111 కోట్ల రూపాయలు, ఎస్వీ ప్రాణదానంట్రస్ట్‌కు 11,11,111లక్షల రూపాయలు, ఎస్వీ విద్యాదానం ట్రస్ట్‌కు 11,11,111 లక్షల రూపాయలు ఆ సంస్థ ప్రతినిధులు అందజేయడంతో వారిని అదనపు ఇఒ చౌదరి అభినందించి సత్కరించారు.



# ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం

**తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా,శుచిగా నిరంతరాయంగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు ఓ దాత తనవంతుగా విరాళాలందించారు.

టిటిడి నిర్వహి స్తున్న ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు మంగళవారం ఉదయం దాత తిరుపతికి చెందిన కెవిస్వీటాకీస్ ఛైర్మన్ కేతన్ శివప్రీతమ్ 10లక్షలు రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెం కయ్యాచౌదరికి విరాళాలందజేశారు. టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

# సాధువులు 'గీత' దాటడం ధర్మమా!?

### ఆలయం ముందు నిరసన మహాపచారం

**తిరుపతి,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి:** సమాజంలో ధర్మం,నీతి,పవిత్రత విషయాలపై మాట్లాడే సాధువులు అధర్మంగా టిటిడి నిబంధనలు ధిక్కరించి శ్రీవారి ఆలయం ముందు నిరసనలు చేయడం ధర్మమా?అని బిజెపి నేత పి.నవీన్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. శాంతియుతంగా స్వామికి మొరవినిపిస్తామని హామీ ఇచ్చి సాధువులు ఆలయంముందు భక్తివిశ్వాసాలు దెబ్బతీసేలా వ్యవహరించడం ఎంతవరకు మంచిదని విమర్శించారు. హిందూ సనాతన ధర్మంలో కొంతమంది సాధువులకు సముచిత స్థానం, గౌరవం ఉంటుందన్నారు. భగవంతునికి భక్తునికి మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరించే సాధువులే తిరుమల ఆలయం వద్ద నిరసనలతో అపవిత్రం చేయడం భగవంతుడు కూడా క్షమించరన్నారు.



సాధువుల మధ్యలో అసాంఘిక శక్తులు, వ్యక్తులు జొరబడి జరగరానిది జరిగితే ఆలయం ముందు ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. సాధువులు శాంతియుతంగా సమస్యను విన్నవించడం తప్ప ఇలాంటి నిరసనలతో సాధించేదేమీ లేదన్నారు. టిటిడి పరిపాలనభవనం వద్ద నిరసనలు చేపడితే అభ్యంతరం ఉండదని, ఆలయం ముందు చేపడితే భక్తులు ఆందోళనకు గురవుతారన్నారు. ఇలాంటివి కొండపై పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, కఠినంగా చట్టం అమలుచేయాలని నవీన్ కుమార్‌రెడ్డి సూచించారు.

# బిసివై అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌పై కేసు

**తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆల య పవిత్రతను కాపాడటంలో భాగంగా రాజకీయ వ్యాఖ్యలు చేయడం నిషేధించిన సమయంలో పలు డిమాండ్లతో బిసివై అధ్యక్షుడు రామచంద్రయాదవ్, పెద్దసంఖ్యలో సాధువులతో కలసి ఆలయం ముందు నిరసన తెలియజేయడంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమల, తిరుపతి పవిత్రతను కాపాడాలని, ముంతాజ్ హోటల్ నిర్మాణాలను రద్దు చేసి, భవనాలను కూల్చివేయాలని నిరసన తెలియ జేసేందుకు అలిపిరి వద్దకు చేరారు. సోమవారం అక్కడే ఆయనకు తిరుమల పోలీసులు నోటీసులిచ్చారు. ఎలాంటి ధర్నాలు, నిరసనలు చేయరాదని సూచించారు. శాంతియుతంగా తిరుమలకు చేరుకుని, స్వామివారిని దర్శించుకుంటామని హామీ ఇచ్చారు. అయితే అందుకు నిబంధనలు విరుద్ధంగా



బిసివై రామచంద్రయాదవ్, హిందూ సాధుసంఘ సమితి శ్రీనివాసానందసరస్వతి స్వామి, సాధువులు ఆలయం ముందు నిరసనకు దిగడంతో పోలీసులు వారిని బల వంతంగా క్రిందకు తరలించారు. భక్తుల మనో భావా లు దెబ్బతీసేలా, ప్రశాంతతకు భంగం కలిగించేలా వ్యవహరించారనే విషయంపై రామచంద్ర యాదవ్ తోబాటు 19మందిపై తిరుమల 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వార్త

ఇతరులు మనకు ఇచ్చేది తాత్కాలికమైనది.
స్వయం కృషితో మనం సంపాదించుకున్నదే
శాశ్వతమైనది.

-జీన్ ఫ్రాముజాన్

# ప్రజారోగ్యాన్ని పీల్చుతున్నదెవరు?

జనారోగ్యమే జాతిమహాభాగ్యమనే లక్ష్యంతోదేశ ప్రజలను పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించాం, వెచ్చిస్తూనే ఉన్నాం. అటు కేంద్రప్రభుత్వం కానీ ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టారు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో స్పష్టంగా పొందుపరిచారు. అయినా నేటికీ అందరికీ ఆరోగ్య వసతులు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. పరిపూర్ణ ఆరోగ్యం సంగతి దేవుడెరుగు. కనీస ఆరోగ్య సౌకర్యాలు కల్పించడంలో కూడా పాలకులు సఫలీకృతం కాలేకపోతున్నారు. ప్రజారోగ్యంపై రోగాల దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా యేటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతుంటే అంతకు రెట్టింపు స్థాయిలో పలురోగాల బారినపడి ఆస్పత్రులపాలై అటు ఆరోగ్యపరంగా, ఇటు ఆర్థికంగా కృంగిపోతున్నారు. అయితే ప్రజారోగ్యంపై దాడి చేస్తున్న ఈ వ్యాధుల్లోకొన్ని కొందరు వ్యక్తులు తమకుతాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నట్లుగా చెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడులపరంపర కొనసాగిస్తున్నది. ఇందులో కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యంకావడం లేదు.ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూవీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తిముందు మానవుడు ఎప్పుడూ తలదించుకోవాలనే వాస్తవాన్నిచాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. కొత్త కొత్త మందులు చికిత్సలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నా అంతకురెట్టింపు స్థాయిలో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. కొన్ని వ్యాధులను గుర్తించడం కూడా డాక్టర్లకు సాధ్యం కావడం లేదు. మరికొన్నింటిని గుర్తించినా వాటికి చికిత్స అందించలేకపోతున్నారు. మొన్నటివరకు ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా బారిన పడినవారు ఆ మందుల ప్రభావం నుండి ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారు. ఇవికాక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీ ఇన్నీ కావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా,డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒక్కటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. మరోకపక్క కేన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండెజబ్బులు, విపరీతంగా పెరిగిపోయాయి. వయసుతో నిమిత్తంలేకుండా పదేళ్లవయసులో ఉన్న చిన్న పిల్లలను కూడా గుండెజబ్బులు కబళించి వేస్తున్నాయి. కేన్సర్‌కు మందులు ఉన్నా విస్తరణ ఆపలేకపోతున్నారు. రానురాను మానవాళి జీవనానికి సవాల్‌గా మారుతున్నది. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం తదితరవి పాటిస్తూ జీవనాన్ని సాగిస్తే ఈ వ్యాధులు దరిచేరకుండా కొంతవరకు కాపాడుకోవచ్చునని వైద్యనిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెప్తున్నారు. ప్రజలకు వాస్తవాలు కూడా తెలియనివి కావు. అయినా రోగనిరోధకశక్తిని ఎందుకు పెంచుకోలేకపోతున్నారు. కారణాలు ఏమిటి? కారకులెవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన తరుణమిది. రోగనిరోధక శక్తి ఒక్క రోజులోనో, వారంలోనో నెలరోజుల్లోనో పెరిగేది కాదు.బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పౌష్టికాహారం అందించాలి. ఏ మేరకు అందిస్తామో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్ధాకలితో అలమటిస్తున్నవారు కోట్ల సంఖ్యలోనే ఉన్నారు. అలాంటప్పుడు వారిలో రోగనిరోధక శక్తి ఎలా వస్తుంది. ఎక్కడి నుంచి వస్తుంది. మరొకపక్క కాలుష్యం ప్రజారోగ్యాన్ని కాటువేస్తున్నది. వాయుకాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాయు, నీటి కాలుష్యాలు అంతకంతకు పెరుగుతున్నాయి. వాయుకాలుష్యం అదుపుతప్పిపోవడంతో దేశ రాజధాని ఢిల్లీలో పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక్క ఢిల్లీయే కాదు భారతదేశంలో వందలాది నగరాలు వాయుకాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. మరొకపక్క ధూమపానం కూడా ప్రజారోగ్యానికి తూట్లుపొడుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా నూటముప్పైకోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నట్లు చెప్తున్నారు. భారతదేశంలో ఇరవైకోట్ల మందికిపైగా పొగాకుకు అలవాటుపడ్డారు. బీడీలు తాగేవారే ఎక్కువ. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారిపోతున్నది. మైనర్లు కూడా ఈ పొగాకుకు అలవాటుపడడం ఆందోళన కలిగిస్తున్నది. చుట్టా, బీడీ, సిగరెట్, హుక్కా, రూపురేఖల్లో విలాసాల్లో తేడాలే కానీ వాటన్నింటికి మూలం పొగాకే. ప్రపంచవ్యాప్తంగా అనారోగ్య కారణాల్లో ధూమపానం ఇప్పుడు రెండోస్థానానికి చేరుకున్నది. ధూమపానం చేసే వారికేకాదు. వారి చుట్టుపక్కల ఉన్నవారికి కూడా రకరకాల వ్యాధులు వ్యాపింప చేయగల శక్తి దానికి ఉంది. మద్యపానం కూడా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్నది. ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని చెప్పుకునే పాలకపెద్దలు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంతవరకు సమంజసమో విజ్ఞతతో ఆలోచించాలి. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యానికి కారణాలవుతున్నాయి. రోగనిరోధక శక్తి తగ్గిపోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తి ఎలా పెరుగుతుందో, ఎలా పెంచుకోవాలో పాలకపెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి.

విద్య అనేది శాస్త్రాలను వివరించేందుకే పరిమితం కారాదు. ఒక పరిపూర్ణమైన మానవుని తీర్చిదిద్దే అసలైన విద్య.



రవీంద్రనాథ్ ఠాగూర్

విధుల నిర్వహణ మార్గమే పేరు ప్రతిష్టల సంపాదనకు దారితీస్తుంది.



మహాత్మాగాంధీ

# దేశాల దౌత్యనీతిలో కొత్త పరిణామాలు!

**చైనా, ఇండియాలు దగ్గరకు రావటానికి ప్రయత్నించటం విస్మయం కలిగించే పరిణామమే. కానీ హర్షణీయ పరిణామంగా భావించాలి. పాక్ ఆక్యుపైడ్ కాశ్మీర్‌ను వదిలివెళ్లండి అని గట్టిగాఇండియా చెప్పటం, దాన్ని చైనా మాటవరసకైనా తప్పు పట్టకపోవడం, బెలూచిస్థాన్ సంపదను కొల్లగొట్టిన పాక్‌కు బెలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ట్రెయిన్ హైజాక్ ద్వారా కోలుకోలేని షాక్ ఇచ్చింది. పాకిస్థాన్ ప్రధాని, బెలూచిస్థాన్ అభివృద్ధి కాని ప్రాంతంగా చేసి అపారమైన సంపద కొల్లగొట్టిన విషయం ఒప్పుకోకపోయినా సరైన రీతిలో ఆ ప్రాంతం పట్ల ప్రవర్తించలేదని చెప్పినా, పాక్ ఆర్మీ ఎంతవరకు రాజకీయ నాయకుల స్వతంత్ర నిర్ణయాలను ఒప్పుకుంటుందో చూడాలి. అంతర్జాతీయంగా ఉత్కంఠ భరితమైన పరిణామాలు ఏ రూపుదిద్దుకుంటాయో వేచి చూడక తప్పదు.**



రావులపాటి సీతారాంరావు

ప్రధానమంత్రి మోడీ కుండ బద్దలు కొట్టినట్లుగా పాకిస్థాన్ మన దేశంతో సుస్థిర సంబంధాలు సాగించడానికి సిద్ధంగా లేదన్నది స్పష్టపరిచారు. అమెరికన్ సైంటిస్ట్, పోడ్‌కాస్టర్ లెక్స్‌ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన సుదీర్ఘ ఇంటర్వ్యూలో పాకిస్థాన్, చైనా, అమెరికా దేశాలను ప్రస్తావించి ప్రస్తుత సంబంధాలను తేటతెల్లం చేయడం విశేషం. వారి విజ్ఞత ముందు ముందు పరిణితి చెంది, పాకిస్థాన్ నాయకులు మనదేశంతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలన్న ఆశాభావాన్ని కూడా వ్యక్తపరిచారు. ఇంత స్పష్టంగా మన ప్రధానమంత్రి పాకిస్థాన్‌తో ఉన్న సంబంధాల గురించి చెప్పిన దాఖలాలు ఈ మధ్యకాలంలో లేవు. 2014 సంవత్సరంలో తన పదవీ స్వీకారం తర్వాత పాకిస్థాన్ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్‌ను ఆహ్వానించానని దీనికి కారణం రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయాన్ని సృష్టించే ఆశాభావంతోనేనని ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ దేశం నుంచి తగురీతిలో స్పందనరాకపోయినా ప్రపంచం మొత్తం మనదేశ నిబద్ధత, శాంతికి కట్టుబడి ఉన్న సంగతి గమనించిందన్నది కూడా తెలియచేశారు. అయితే శాంతి సద్భావనకు, ప్రోత్సహించలేకపోగా వైరివైఖరినే ప్రదర్శించడం నిరుత్సాహపరిచిందని ఇప్పటికైనా పాకిస్థాన్ శాంతి సామరస్యత కోరుకోవాలని అభిలషిస్తున్నట్లు ఆయనమాటల ద్వారా వ్యక్తమయింది. ఇంటర్వ్యూలో మరి రెండు ముఖ్యమైన విషయాలు ప్రస్తావించారు. ఒకటి చైనాతో మెరుగైన సంబంధాల దిశగా రెండు దేశాల ప్రయత్నం, రెండు ఇండియా–అమెరికా సంబంధాలు, ట్రంప్ తిరిగి అధ్యక్షుడిగా ఎన్నిక కావటంతో పటిష్టపడటం! చైనాతో గత కాలంలో ఆందోళన కలిగించే పరిస్థితులను ఎదుర్కొన్నా ఇప్పుడు వాటిని తొలగించేందుకు డైలాగ్ ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాని చెప్పటం ముదావహం! రెండుదేశాల మధ్య విభేదాలు ఉన్నాయి. కానీ ఈ విభేధాలు గొడవలుగా మారకుండా ఉండేందుకు కృషి చేయకతప్పదు. డిస్కార్ట్ కంటే డైలాగ్ కొనసాగింపుతోపాటు సహకారం దిశగా ప్రయత్నాలు జరుపుతేనే సుస్థిర సంబంధాలు రెండు దేశాల మధ్య ఏర్పడతాయి. ఇలాంటి సహకారం దేశాల అభివృద్ధికి అవసరం కూడా అన్నారు. ప్రధాన మంత్రి అక్టోబర్ 2024 లో చైనా ప్రసిడెంట్ జిన్‌పింగ్‌తో సంభాషణలు జరపటం వల్ల ఫలితాలు మెరుగవుతున్నాయి.సరిహద్దులలో నార్మలసీ ఏర్పడుతున్నది. 2020 ముందున్న వాతావరణం నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్నాం అని కూడా చెప్పారు. 2020లో ఇరుదేశాల మధ్య వాస్తవస్వాధీన రేఖ భూభాగంలో గొడవలు జరిగాయి. ప్రాణనష్టం కూడా జరిగింది. కానీ క్రమేపీ అన్నీ సర్దుబాటు అవుతున్నాయి. అయిదేళ్ల గ్యాప్ వల్ల సామరస్య ప్రయత్నాలు ఫలవంతం కావడానికి కొంత సమయం పడుతుంది అన్న ఆశాభావాన్ని ప్రధాని ఇంటర్వ్యూలో వ్యక్తపరిచారు. అమెరికా విషయంలో ప్రధాన మంత్రి మోడీ రెండు దేశాల మధ్య వున్న సుహృద్భావ, స్నేహ సంబంధాలను గురించి ట్రంప్ రోడ్‌మాప్ గురించీ, ఏవిధంగా రెండవసారి ఎన్నిక కారనే ట్రంప్ స్పష్టమైన ప్రణాళికతో పాలనా విధానాన్ని సాగిస్తున్న సంగతి విశదీకరించారు. ఇంటర్వ్యూ చేసేవారు అమెరికన్ సైంటిస్ట్, పోడ్‌కాస్టర్ కావటం వల్ల ప్రధాన మంత్రి ఎక్కువగానే ఇరుదేశాల



మధ్య నెలకొల్పబడిన మెరుగైన బాండేజిని గురించి ఉటంకించటం జరిగింది. ప్రధాన మంత్రి మాటల వెనుక పొగడ్తలు కన్పించాయి కానీ అసలు విషయాలు టారిఫ్ పెంపు, ట్రంప్ నిక్కచ్చితత్వం ప్రదర్శన, అమెరికాలోని ఇండియా దేశస్థుల ఇబ్బంది, పలుదేశాలపై బ్యాన్ విధింపు లాంటివి దాటేసారేమో అన్న భావన కొందరు విశ్లేషకులు పసికట్టే పరిస్థితిని కాదనలేము. ప్రధాన మంత్రి అవలంబిస్తున్న విదేశాంగ విధానం బయట నుంచి అంచనాలు వేసే విశ్లేషకుల ఊహలకు అందవు కూడా. అందుకే ఇప్పుడు ఈ రెండు దేశాల సంబంధాల అంశం ఊహాగానాలకు, తర్జన భర్జనలకు దూరంగా ఉంచటమే సముచితం. ఎప్పటికప్పుడు ఏర్పడే పరిణామాల నేపథ్యంలోనే నిర్ణయాలు చేయాలి. అమెరికా– ఇండియాలు స్నేహంగా ఉండటమే ఎప్పుడూ ప్రజలు కోరుకోవాలి. ఆ మాటకొస్తే అన్ని దేశాల మధ్య సద్భావనతో కూడుకున్న సామరస్య ధోరణినే ఏ నాయకుడైనా ప్రోత్సహించాలి. ఈ మధ్య చైనా, ఇండియాలు దగ్గరవుతున్నట్లు కన్పించడం విదేశాంగ నిపుణులకు ఊహాకందని విషయమే. ఇరుదేశాలు దగ్గరవుతున్నట్లు ప్రకటించే ముందు ఒకటి రెండు జరిగిన అంశాలు జ్ఞప్తికి తెచ్చుకోవాలి. భారతదేశం పాక్ ఆక్రమించుకున్న కాశ్మీర్ భూభాగాన్ని వెంబడే ఖాళీ చేయాలని లేకపోతే తీవ్ర పరిణామాలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించడం ఒక అంశమైతే అమెరికా రష్యాలు జెలెన్‌స్కీ విషయంలో దగ్గరవటం ఉక్రెయిన్, ఇజ్రాయిల్ దేశాలకు అమెరికా పూర్తి సహకారాన్ని ఎప్పటి మాదిరే ఇస్తున్నట్లు అనిపిస్తున్నా కొంత సందిగ్ధత క్షేత్ర స్థాయిలో కనపడటం, ఈ రెండూ లోతుగా ఆలోచించదగ్గ పరిణామాలుగా భావించకతప్పదు. అమెరికా, రష్యాలు దగ్గరవటం, అమెరికా, చైనా పట్ల అవలంబిస్తున్న టారిఫ్ విధానంతోపాటు ప్రపంచ నాయకత్వంలో తమదేశం వెనుకబడుతున్నదా అన్నఅనుమానంతో చైనా బలమైన దేశంఇండియాతో స్నేహాన్ని మెరుగుపర్చుకొనే దిశగా అడుగులు వేయడం, పాకిస్థాన్‌కు ఇదివరకటిలా నేనున్నాను అని ఇండియా పి.ఓ.కె హెచ్చరిక విషయంలో చైనా హామీ ఇవ్వకపోవడం దృష్టిపెట్టాల్సిన విషయాలుగా విదేశాంగ నిపుణులు భావిస్తుండొచ్చు. పాకిస్థాన్‌కు బెలూచిస్థాన్ కొరకరాని కొయ్యగా ఎన్నాళ్ల నుంచో ఉంటున్నది కానీ మొన్నటి బెలూచ్ లిబరేషన్ ఆర్మీ (బి.యల్.ఏ) ట్రెయిన్ హైజాక్ దెబ్బతో పాకిస్థాన్ దేశంగా మరింత బలహీనపడింది. ఈ హైజాక్‌లో ఇండియా భాగం ఉందని వాదించి 'రా' సంస్థ మీద బురద జల్లేందుకు సిద్ధపడిన పాక్ దేశానికి గట్టిగా త్రిప్పికొట్టి, అలాంటి చరిత్ర భారతదేశానికి లేదన్నట్లు సమాధానం ఇవ్వటం ప్రపంచ దేశాలకు నిజాన్ని బహిర్గతం చేసినట్లయింది. భవిష్యత్తులో అంతర్జాతీయ పరిణామాలు చాలా ఆశ్చర్యకరంగా ఉండొచ్చు. దేశదేశానికి స్నేహాలూ, బంధాలూ, మారిపోయే అవకాశం ఉంది. లేకపోతే అమెరికా, రష్యాలు ఒకే త్రాటి మీద నడవడం అనేది కొన్ని దశాబ్దాల క్రిందట ఎవ్వరూ నమ్మని మాట. అప్పుడూ సుదూరాన భవిష్యత్తులో కలవగలరని ఎవరైనా సరదాగా ప్రిడిక్ట్ చేసినా వాడిని తెలివి తక్కువ వాడిగా భావించేవారు. చైనా, ఇండియాలు దగ్గరకు రావటానికి ప్రయత్నించటం విస్మయం కలిగించే పరిణామమే. కానీ హర్షణీయ పరిణామంగా భావించాలి. పాక్ ఆక్యుపైడ్ కాశ్మీర్‌ను వదిలివెళ్లండి అని గట్టిగాఇండియా చెప్పటం, దాన్ని చైనా మాటవరసకైనా తప్పు పట్టకపోవడం, బెలూచిస్థాన్ సంపదను కొల్లగొట్టిన పాక్‌కు బెలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ట్రెయిన్ హైజాక్ ద్వారా కోలుకోలేని షాక్ ఇచ్చింది. పాకిస్థాన్ ప్రధాని, బెలూచిస్థాన్ అభివృద్ధి కాని ప్రాంతంగా చేసి అపారమైన సంపద కొల్లగొట్టిన విషయం ఒప్పుకోకపోయినా సరైన రీతిలో ఆ ప్రాంతం పట్ల ప్రవర్తించలేదని చెప్పినా, పాక్ ఆర్మీ ఎంతవరకు రాజకీయ నాయకుల స్వతంత్ర నిర్ణయాలను ఒప్పుకుంటుందోచూడాలి. అంతర్జాతీయంగా ఉత్కంఠ భరితమైన పరిణామాలు ఏ రూపుదిద్దుకుంటాయో వేచి చూడక తప్పదు. •

# సీనియారిటీ జాబితాలోని లోపాలు సరిచేయాలి

వాసిలి సురేష్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ డేటా ఆధారంగా సీనియారిటీ జాబితాలు విడుదల చేసింది. వాటిలో ఉన్న తప్పులను సరిచేసుకోవాలని ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో గ్రీవెన్స్ సెల్‌నందు సరైన ప్రూఫ్స్ జతపరచాలని కోరింది. కానీ టిఐఎస్ డేటాతో సినియారిటీ లిస్ట్ తయారు చేయడంతో టీచర్లలో ఆందోళన రేకెత్తుతున్నది. సర్వీస్‌లో చేరిన తేదీ, పుట్టిన తేదీల ఆధారంగా సీనియారిటి జాబితాలు తయారవడంతో టీచర్లు ఆందోళనకు గురవుతున్నారు. వీటిల్లో అనేకలోపాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ఇచ్చిన పదోన్నతి జాబితాలన్నీ ఒక్కసారిగా తారుమారైనట్లు కనిపిస్తున్నది. సీనియారిటీ నెంబరు స్థిరీకరించిన గత సీనియారిటీ జాబితాలను, డీఎస్సీ మెరిట్ కమ్ రోస్టర్ (కౌన్సిలింగ్ జాబితా) జాబి తాలు, పదోన్నతి రోస్టర్ జాబితాల వరుసను తారుమారు చెయ్యకుండా టిఐఎస్ డేటాతో నవీకరించిన సీనియారిటీ జాబితాలు తయారు చేయబడాలి. డీఎస్సీలలో మెరిట్ కమ్ రోస్టర్ లో ఎంపిక చేసిన జాబితా లేదా పదోన్నతి వరుసలో జాబితాలు ఉండాలి. సిఎస్సి వారు సీనియారిటీ జాబితాల తయారీపై 2022 లో విడుదల చేసిన తుది మార్గదర్శకాలు ఆధారంగానే సీనియారిటీ జాబితాలు తయారు చేయాల్సి ఉన్నది. టిఐఎస్ డేటాతో సీనియారిటీ నిర్ణయించలేము. ఇవి కేవలం సీనియారిటీ జాబితాలలో రిటైరయిన, మరణించిన, గల్లంతయిన వారని గుర్తించుటకు, టీచర్ల ప్రస్తుతం పనిచేస్తున్న స్కూల్ నిర్ణయించుటకు మాత్రమే ఉపయోగపడును. ఈ బేసిక్ డీటైల్స్ నందు తప్పులను సరిచేసే బాధ్యత డిడిఓలకు ఇవ్వాలి. ప్రతీ ఒక్కరూ జిల్లా కార్యాలయానికి వచ్చి తప్పులను సరిచేసుకోవడం కష్టతరం. తప్పులను గుర్తించి సరిచేయడం క్షేత్ర స్థాయిలో మండల విద్యాశాఖాధికారులు,ప్రధానోపాధ్యాయులు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం వెల్లడించిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు తప్పులతడకగా ఉన్నాయి. అవి డిఎస్సీ మెరిట్ లిస్టు ప్రమోషన్ల లిస్టుల ఆధారంగా ప్రకటించలేదు. బదిలీలలో సమాన పాయింట్లు వచ్చినప్పుడు ర్యాంకింగ్‌కు మొదటగా కేడర్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటామని బదిలీల డ్రాఫ్ట్ చట్టంలో ప్రభుత్వం వెల్లడించింది.జిల్లా విద్యాశాఖాధికారుల పరిధిలో ఉండే డీయస్సీ ఎంపిక జాబితాలు పదోన్నతుల జాబితాలను పరిశీలించి, వారి పరిధిలో ఉపాధ్యాయుల సీనియారిటీని నిర్ణయించాల్సి ఉంటుంది, కానీ ప్రస్తుతం కమీషనర్ కార్యాలయం కేంద్రంగా అన్నీ జరగాలనే ఉన్నతాధికారుల నిర్ణయం వల్ల ఉపా ధ్యాయులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టడం జరిగింది.డీయస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు వారి ర్యాంకుమీద అవగాహన ఉంటుంది. కాబట్టి జిల్లా విద్యా శాఖాధికారుల ద్వారా డీయస్సీ మెరిట్ లిస్టులు విడుదల చేసి, జిల్లా విద్యాశాఖాధికారుల ద్వారా సీనియారిటీ జాబితాలను సరిచేసి విడుదల చేసి, ఉపాధ్యాయులకు అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇవ్వడం ద్వారా మాత్రమే ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుంది. బదలీలు పదోన్నతులకు కీలకమైన సీనియారిటీ జాబితాలు సక్రమంగా విడుదల చేయకపోతే ఉపాధ్యాయులకున్యాయం చేయడం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించే పరిస్థితులు ఏర్పడతాయి. కాబట్టి ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, సరైన విధా నంలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు వెల్లడించేలా తగిన చర్యలు తీసుకోవాలి. •

# ప్రజావాక్కు



## పెరుగుతున్న ఆత్మహత్యలు

ఆర్థిక బాధలను తట్టుకోలేక ఈ మధ్య దంపతులు తమ పిల్లలతోసహా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరికొందరు పిల్లలను వదిలేసి భార్యాభర్తలు జీవితాలను అంతం చేసుకుంటున్నారు.ఆత్మహత్యలుచేసుకోవడం తప్పయితే, పిల్లలనుఅనాథలను చేయడం క్షమించరానినేరం. పాపం అభం, శుభం తెలియని పసివారి భవిష్యత్తు ఏమిటి? వారినెవరు పట్టించుకుంటారు? పిల్లల అనాధాశ్రమాలు ఇంకా పెరగాలి. ఇవి చూసుకుంటాయని ఆత్మహత్యలు మరింత ఉధృతం అయ్యేప్రమాదం కూడా ఉంది. ఆర్థికంగా చితికిపోయిన రైతులు,ఫలించని ప్రేమికులు, మన స్పర్ధలతోదంపతులు,పరీక్షలు తప్పామని విద్యార్థులు, కొత్తగా,విచిత్రంగా సెల్‌ఫోను కొనివ్వలేదని, చూడని వ్వడం లేదని, ఇలా అనేక కారణాలతో అర్థాంతర మరణాలకు పాల్పడుతున్నారు. ఈఅకృత్యాలనుఆపేమార్గంకనుగొనాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రపంచ దేశాలకు సవాల్

నిజమే పెద్దన్న పాత్రతికమకలో పడడంతో ప్రపంచ రాజకీయాలు స్థిరత్వమును కోల్పోతున్నాయి. ట్రంప్ టెంపరితనము వహించడం ఇప్పుడు గడిస్తే చాలు అనే వైఖరి యూరప్‌లోఅస్థిరత్వంనెలకొంటుంది. ఒక్కమాటలో చెప్పాలి అంటే మ్యాగీ రాజకీయాలు నడుస్తున్నాయి. ఎక్కడైతే ఖనిజ సంపద ఉంటుందో, ఎక్కడ అయితే సమృద్ధిగా నిక్షేపాలు ఉంటాయో, వాటిని భయం గుప్పిట్లోకి ముంచి తమ అవసరాలు తీర్చుకోవడం అనే జుగుప్సాకరమయిన రాజకీయాలునడుస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలి అంటే మూడో ప్రపంచ దేశాలు అన్ని అభివృద్ధి చెందిన దేశాల అవసరాలు తీర్చడానికి మాత్రమే అన్నట్టుగా ఉంది.

-భారత అవినాష్, జనగామ

## నైట్ స్టడీ విధానం ప్రవేశపెట్టాలి

నైట్ స్టడీవిధానంలో 2025–2026 విద్యా సంవత్సరంలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాలి. రాష్ట్రంలోని అన్ని గురుకులాల సెక్రటరీలతో సమావేశాలు నిర్వహించి గురుకులాలలో నైట్‌స్టడీ విధానంలో మార్పులు చేయాలి. రాత్రి7గంటల నుండి 9గంటల వరకు ప్రతి విద్యార్థి ప్రతి క్లాసులో అల్లరి చేయకుండా ఉండడానికి ప్రతి సబ్జెక్టు టీచర్ హోంవర్క్ ప్రతిరోజు ఇవ్వాలి.

- రాపాక రవీందర్, జనగాం

## పురాతన కట్టడాలను కాపాడాలి

దేశంలో పురాతన కట్టడాలు, కోటలు, దేవాలయాలు, ప్రాచీన కళలు,గ్రామీణ క్రీడలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసే భారత్ అంటే పాశ్చాత్యులకు కూడా ఎనలేని గౌరవం. స్వేచ్ఛ స్వతంత్రం కోసం సరిహద్దుల్లో హఠాత్తుగా ఎదురయ్యే కవ్వింపు చర్యలను తిప్పికొడుతూ,విభిన్నవాతావరణంలో కంటికిరెప్పలా భారతావని ఉగ్రవాదులు, శత్రుసైనికుల బారి నుంచి కాపాడే క్రమంలో అసువులు బాసిన ఎందరో అమరులకు హ్యాట్సాఫ్. మనదేశ ఇతిహాసం చాలాగొప్పది. శాంతికిమారుపేరు.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూర్లు

## పేర్ల మార్పు దేనికి సంకేతం

నిన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుతొలగించి సురవరం ప్రతాప్ రెడ్డిపేరు, అలాగే 55 సంవత్సరాల కిందట బల్కంపేటలో ఉన్నగాంధీ ప్రకృతి వైద్యశాలకుమాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పేరు పెట్టడానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు.వైశ్యులకు ప్రాధాన్యం తగ్గకుండా కొత్తగా చర్లపల్లిలో నిర్మించిన రైల్వే టెర్మినల్‌కు కేంద్ర సహకారంతో అమరజీవి పొట్టి శ్రీరాములు టెర్మినల్‌గా నామకరణం చేయాలని ప్రతిపాదన కేంద్రప్రభుత్వానికి పంపుతున్నట్టు ప్రకటించారు. ఒక సంస్థ ప్రపంచవ్యాప్తంగా వర్ధిల్లాలి అనుకుంటే దానికి ప్రేరణఇచ్చిన వ్యక్తి పేరు పెడితే బాగుంటుంది. గాంధీ పేరు విశ్వవ్యాపితం, జాతిపిత పేరు తీసి రోశయ్య గారి పేరు పెట్టడం సముచితం కాదు.

-డా.యం. అఖిలమిత్ర, హైదరాబాద్

## అభివృద్ధి పథంలో ఎస్సీ గురుకులాలు

ప్రభుత్వ ఆశయాలు నెరవేర్చడంలో ఎస్సీ గురుకుల సంస్థ సఫలీకృతమవుతున్నది. ఈవిద్యాసంవత్సరంలో సంస్థ చేపట్టిన ప్రక్షాళనా చర్యలు ఇతర విద్యాసంస్థలకు కూడా అనుసరణీయం.ముఖ్యంగా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఉన్నతాధికారులు తీసుకున్నచర్యలు అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టించే విధంగాఉన్నాయి. రిటైర్డ్ అధికారులు, ప్రైవేట్ వ్యక్తులతో నడిచే విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగాన్ని తొలగించి కోట్లాది రూపాయలు ఆదా చేశారు. మూడేళ్లపాటు అక్రమాలకు పాల్పడిన ఒక గ్రూప్–1సర్వీసు అధికారిని సాధారణ పరిపాలన శాఖకు సరెండర్ చేయడం ఒక సాహసోపేతమైన చర్య.

-మహ్మద్ రఫిమొద్దిన్, పోచారం, హైదరాబాద్

# జనసేన నేతల అతిశయోక్తి ప్రసంగాల అంతరార్థం!

అన్నవరపు బ్రహ్మయ్య

పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో ముఖ్యనేతలు చేసిన ప్రసంగాలు అతిశయోక్తిగా వున్నాయి. సభకు హాజరైన జనసమూహం, చేసిన ఏర్పాట్లు అద్భుతంగా వున్నాయి. కానీ వేదికపై నాయకులు చేసిన ప్రసంగాలు జనసేనపార్టీ స్థాయికి తగినట్టుగా లేవు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ సభలో ప్రధానంగా దేశ, రాష్ట్రాలకు సంబంధించిన రాజకీయ అంశాల కంటే పిఠాపురం రాజకీయాలకు పరిమితమైనట్టు కనిపించింది. సభలో మాట్లాడిన వక్తలు ప్రధానంగా పార్టీ కీలక నాయకులు చేసిన ప్రసంగాలు ఒక నియోజకవర్గ స్థాయి నాయకులు మాట్లాడినట్టుగా అనిపించింది. అంతేకాకుండా జనసేన పార్టీకి సంబంధం లేని సనాతన ధర్మం, తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం గురించి అప్రస్తుత ప్రస్తావన చేయడం చూస్తుంటే పవన్ కళ్యాన్ బిజెపి నేతల ప్రాపకం కోసం ప్రాకులాడుతున్నట్టుగా వుంది. ఎన్నికలకు ముందు సీట్ల కేటాయింపు, కూటమి పార్టీల మధ్య సీట్లసర్దుబాటు విషయాలు బహిరంగ రహస్యం.జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాన్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేయాలని నిర్ణయించినప్పుడు ఆనాడు జరిగిన పరిణామాలు నియోజకవర్గ ప్రజలే కాదు, రాష్ట్రంలోని ప్రజలందరికీ గుర్తుతుంది. పిఠాపురం తెలుగుదేశం పార్టీకి, పార్టీ సిట్టింగ్ శాసనసభ్యులు వర్మకు కంచుకోటగా వుంది. తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు మాటకు కట్టుబడి, కూటమి ఒప్పందం ప్రకారం పిఠాపురంనుంచి పోటీచేయాల్సిన వర్మ తనసీటును త్యాగం చేసి పవన్ కళ్యాణ్‌కు ఇచ్చారు. ఆనాడు ఎన్నికల సమయంలో పవన్ కళ్యాన్ స్వయంగా వర్మత్యాగం గురించి, నియోజక వర్గంలో వర్మకున్న ప్రజాబలం గురించి ఎంతో గొప్పగా చెబుతూ ఆయన చేసిన మేలును మరిచిపోలేనని ప్రకటించారు. కానీ ఆవిర్భావ సభలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు కె. నాగబాబు మాట్లాడుతూ పిఠాపురం పవన్ కళ్యాన్ విజయం సాధించడానికి ప్రధమ కారణం పవన్ కళ్యాన్ గొప్పతనం కాగా, రెండో కారణం నియోజకవర్గ ప్రజలకు పవన్‌కళ్యాన్ మీదవున్న అభిమానం కారణమని, కానీ ఇందుకు విరుద్ధంగా పవన్ కళ్యాన్ విజయానికి తామే కారణమని ఎవరైన భావిస్తే వారి కర్మ అని పరోక్షంగా తెలుగుదేశం పార్టీకి చెందిన వర్మను ఉద్దేశించి వ్యాఖ్యానించడం ఆశ్చర్యం కలిగింది. వర్మకు నియోజకవర్గ ప్రజలలో తిరుగులేని ప్రాబల్యం వుంది. ఈ నియోజవర్గం నుంచి స్వంతంత్ర అభ్యర్థిగాపోటీ చేసి విజయం సాధించిన చరిత్ర వుంది. జనసేన ఎటువంటి పొత్తులు లేకుండా పోటీచేసిన సమయంలో పవన్ కళ్యాన్ కనీసం ఒక్క నియోజకవర్గంలో కూడా గెలవలేకపోయిన విషయం నాగబాబు మరచిపోయినట్టుగా వుంది. పార్టీ ప్రధాన కార్యదర్శిగావున్న నాగబాబు కంటే తానేమి తక్కువ కాదన్నట్టుగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాన్ మాట్లాడుతూ నాలుగుదశాబ్దాల చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీని తానేనిలబెట్టానని వ్యాఖ్యానించడం చూస్తుంటే పిల్ల వచ్చి గుడ్డును వెక్కిరించినట్టుగా అనిపిస్తోంది. ఈనాటికి జనసేన పార్టీకి గ్రామస్థాయి, మండల స్థాయిలలోనే కాకుండా కనీసం జిల్లా స్థాయిలలో



కూడా సమ ర్థమైన కమిటీలు ఏ ర్పాటు చేసుకోలేని స్థితిలో జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా చివరకు బూత్ లెవల్ కమిటీలతో నిర్మాణాత్మకంగా ఎంతో పటిష్టంగా వున్న తెలుగుదేశం పార్టీని తానే నిలబెట్టానని ప్రకటించుకోవడాన్ని ప్రజలు వింతగా చెప్పుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ నిలపెట్టడానికిముందు తన అన్న చిరంజీవి ప్రారంభించిన ప్రజారాజ్యం పార్టీని నిలబెట్టివుంటే ఎంతో బాగుండేదంటూ ప్రజలు ఎద్దేవ చేస్తున్నారు. హిందీ సనాతన ధర్మం, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలను పవన్ అసందర్భ ప్రస్తావనచేశారు. నిజానికి తమిళనాడులో జరుగుతున్నహిందీ భాష వ్యతిరేక ఉద్యమంకాదు, ప్రజల అభిష్టానికి భిన్నంగా హిందీ భాషను బలవంతంగా నేర్పాలని చూసేవిధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. జనసేన పార్టీ ఆవి ర్భావం నేపథ్యంలో నిర్వహిస్తున్న సభలో మతపరమైన సనాతన ధర్మం గురించి ప్రస్తావించిన అవసరంలేదు. అయినా ప్రజలు ఎవరికి నచ్చిన ధర్మాన్నివారు ఆచరిస్తారు. బలవంతంగా మీరు ఫలానా విధంగానే జీవించాలని చెప్పడం ఎక్కడి ధర్మమో అర్థంకావడం లేదు. జనసేన ప్రారంభించిన తొలినాళ్లలో చేగువేరా తనకు ఆదర్శమని, గద్దర్ అంటే ఇష్టమని చెప్పడమే కాకుండా అసలు తమ కుటుంబమే కమ్యూనిస్టు కుటుంబమంటూ పవన్ కళ్యాన్ చేసిన ప్రకటనలు ప్రజలు మరచిపోకముందు కాషాయం ధరించి నేడు సనాతనధర్మం, ఆలయాల సందర్శన తీర్థయాత్రలు చేయడాన్ని ప్రజలు ఆశ్చర్యంగా గమనిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనపై వస్తున్న వార్తలపై తమిళనాడు ముఖ్యమంత్రిస్టాలిన్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ వంటివారు కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జనాభా ప్రాతిపదికన జరిగే పక్షంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన అయిదు దక్షిణాది రాష్ట్రాలతోపాటు పంజాబ్, పశ్చిమ బెంగాల్ వంటిరాష్ట్రాలలో లోక్‌సభస్థానాలసంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇట్టిసమయంలో జనాభా నియంత్రణ కార్యక్రమాలు అమలుచేయని ఉత్తరప్రదేశ్, బీహార్,రాజస్థాన్ వంటి బిజెపిపాలిత రాష్ట్రాలలో లోక్‌సభస్థానాలసంఖ్యపెరిగే అవకాశంవుంది. ఇప్పటికే కేంద్రంలో అధికారంలో వున్న నాయకులు దక్షిణాది రాష్ట్రాలపట్ల వివక్షత చూపిస్తు న్నారనే ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో జనాభా ప్రాతి పదికన పునర్విభజన జరిగితే లోక్‌సభలో అధిక లోక్‌సభ స్థానాలు కలిగిన రాష్ట్రాలకు చెందిన నాయకుల ప్రాబల్యం పెరిగి, జనాభా తక్కువవున్నరాష్ట్రాల నేతలప్రాబల్యం తగ్గిపోతుంది. దాంతో లోక్‌సభ స్థానాలు తక్కువగావున్న రాష్ట్రాలు అభివృద్ధిపనులు, నిధుల కేటాయింపువంటి అంశాలలో తీవ్ర వివక్షత ఎదుర్కొనే ప్రమాదం ఏర్పడుతుందని దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తంఅవుతుండగా జనసేన పార్టీనేత లు బిజెపి నేతల అడుగులకు మడుగులొత్తున్నారు. పిఠాపురం వేదికపై అన్నదమ్ములు మాట్లాడిన మాటలలో మొత్తంగా కొంత ఆవేశం, మరికొంత అతిశయంకనిపించింది. ఆవేశం కారణంగానే పవన్‌కళ్యాన్ తనప్రసంగంలో రాయప్రోలు సుబ్బారావుగారు రాసిన ఏ దేశమేగినా..ఎందుకాలిడిన, పొగడరా నీ తల్లి భూమి భారతిని' అనే గేయాన్ని గురజాడవారు రాసినట్టుగా ప్రస్తావించారు. అతిశయం కార ణంగానే నాలుగు దశాబ్దాల తెలుగుదేశంపార్టీని తానే నిలబెట్టానని చెప్పుకొన్నారు.పవన్ కళ్యాణ్ ఒకవైపు కూటిమి బంధం కనీసం 15ఏళ్లు కొనసాగాలని,చంద్రబాబు దార్శినికత రాష్ట్రానికి అవసరమని చెబుతూనే మరోవైపు తెలుగు దేశంపార్టీ తనదయతో అధికారంలోకి వచ్చిందనట్టుగా మాట్లాడటాన్ని తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు,అభిమానులు సహించలేకపో తున్నారు. జనసేన అగ్రనేతల మాటలు, వ్యవహారధోరణి భవిష్యత్తులో ఎటువంటి పరిణామాలకు దారితీస్తోందో వేచిచూడాల్సిందే. •

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# హెలిప్యాడ్ వద్ద వైఎస్ జగన్‌కు సాదర స్వాగతం

- ప్రజలకు ప్రత్యేక అభివాదం చేసిన జగన్

**కొరిశపాడు, మార్చి 18, ప్రభాతవార్త**



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హెలిక్యాప్టర్‌లో మేదరమెట్లకు చేరుకున్నారు. యర్రం పిచ్చిమ్మకు నివాళులర్పించేందుకు మేదరమెట్లకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద వైసిపి ముఖ్యనేతలు, అభిమానులు, సాదరంగా స్వాగతం పలికారు. అప్పటికే హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న వైసిపి అభిమానులు కేరింతలు కొడుతూ హెలిక్యాప్టర్ దిగిన వైఎస్ జగన్‌కు జేజేలు కొట్టారు. అక్కడ నుండి వైవి నివాసం వరకు అభిమానులు వందలాదిగా ద్విచక్ర వాహనాలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనుసరించారు. పిచ్చిమ్మకు నివాళులర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో వాహనంపై నుండి వందలాదిగా చేరిన అభిమానులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన వాహనం నుండి ప్రత్యేకంగా అభివాదం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డితోపాటు శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు, వైసిపి రాష్ట్ర నాయకులు, జిల్లా నేతలు, హెలిప్యాడ్ వద్ద స్వాగతంతోపాటు తిరుగు ప్రయాణంలో వీడ్కోలు పలికారు.

# సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

- ప్రమోషన్ ఛానెల్‌ను కల్పించాలని కలెక్టర్‌కు వినతి

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



న్యాయబద్ధ మైన మా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియాను సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సంఘం కోరింది. మంగళవారం ప్రకాశం భవనంలోని కలెక్టర్ ఛాంబర్లో మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి కలెక్టర్కు సమస్యలను వివరించారు. ప్రధానంగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఒకటి నాలుగు డిపార్ట్మెంట్లకు సంబంధించిన పనులు చేపిస్తున్నారని వివరించారు. అయినా కూడా మాకు తగిన ప్రమోషన్ ఛానెల్ లేదని వాపోయారు. తమతో పాటు రిక్రూట్ అయిన తోటి సచివాలయం ఉ ద్యోగులు చాలా మంది ప్రమోషన్ మీద వెళ్తున్నప్పటికి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కనీసం ప్రమోషన్ ఛానెల్ కూడా లేని దుస్థితిలో ఇంజనీర్లు ఉన్నారని ఆవేదన వ్యక్త పరిచారు. సచివాలయంలో అన్ని అభివృద్ధి పనులతో పాటు వివిధ సర్వేలు చేయడంలో ఇంజనీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారని. వివరించారు. ఒకే సారి 4 ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ పనులు చేయాల్సి రావడంతో ఎటు పాలు పోక పని ఒత్తిడితో సతమతం అవుతున్నారని ఇంజనీర్లు ఆవేదన వ్యక్త పరిచారు. ఇంజనీర్లను వారి మాతృశాఖలు అయిన పిఆర్, ఆర్ డబ్ల్యుఎస్, ఇరిగేషన్, హౌసింగ్ వంటి వివిధ ఇంజినీరింగ్ శాఖలలోకి తమను హేతుబద్ధత చేసి తమకు న్యాయం చేయాలని కలెక్టర్ను కోరారు. ఇంజనీర్లు సూచించిన పలు అంశాలు, సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ను కలిసిన వారిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవి శివ సూర్య తేజ, జిల్లా నాయకులు రామాంజనేయులు, వెంకట రమేష్, రాజేష్, పలువురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

# ఉన్నత పాఠశాల బాలికల పట్ల ఉపాధ్యాయునీ అసభ్య ప్రవర్తన

- పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు
- ఉపాధ్యాయుని శిక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన
- పోలీసు స్టేషన్ ముందు నమాజు, ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులు
- ఒంగోలు బస్టాండ్ లో ధర్నా చేసిన తల్లిదండ్రులు

**కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త**





కనిగిరి బాలికల ఉన్నత పాఠశాలలో బయాలజీ పాఠాలు బోధించే ఉపాధ్యాయుడు రంగారెడ్డి ముస్లిం బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మంగళవారం కలకలం రేపింది. ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని బాలికల తల్లిదండ్రులు వారి బంధువులు పెద్ద ఎత్తున పోలీసు స్టేషన్‌కు చేరుకొని నిరసన తెలిపారు. పాఠశాలలో 6,7,8 తరగతులలో చదివే కొంత మంది ముస్లిం బాలికలను ఉపాధ్యాయుడు తన పనితీరుతో వారికి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాడని, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, అనుచితంగా ముట్టుకుంటున్నాడని ప్రధానోపాధ్యాయురాలకు బాలికలు ఫిర్యాదు చేసినట్లు తెలిసిన సమాచారం. అయితే ప్రధానోపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో బాలికల తల్లిదండ్రులు ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేసి ఉపాధ్యాయుడి ఇంటికి వెళ్లి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులకు సమాచారం అందించడంతో రంగారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పామూరు సీఐ భీమా నాయక్ బాలికల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పోలీసు స్టేషన్ ముందు చేరుకొని ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలంటూ నిరసన తెలిపారు. నిరసన కారులు అక్కడే ఉపవాస దీక్ష చేసి, అనంతరం మతపరమైన ప్రార్ధనలు కూడా నిర్వహించారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించి, రంగారెడ్డిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే కోపోద్రిక్తులైన బాలిక తల్లిదండ్రులు కనిగిరి ఒంగోలు బస్టాండ్‌లో జాతీయ రహదారిపై కూర్చొని ట్రాఫిక్‌ని స్తంభింపచేశారు. పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చచెప్పి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని భరోసా ఇస్తున్నారు. స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడిపై కఠినమైన నిబంధనలు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

# మహిళలకు.. మరింత శక్తి

- ప్రత్యేక యాప్ అందుబాటులోకి
- ఆపదలో అండగా నిలవనున్న పోలీసులు

**ఒంగోలు, ప్రభాతవార్త**

AP POLICE SHAKTHI WOMEN & CHILD SAFETY

ఆపదలో ఉన్న బాలికలు లైంగిక వేదింపులకు గురై యువతులు కామాంధుల కోరల్లో చిక్కుకున్న మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్. మహిళా రక్షణే ప్రధాన బాధ్యతగా భావించిన ప్రభుత్వం మహిళా దినోత్స వం రోజు శక్తి యాప్ ప్రవేశపెట్టింది. యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్‌పై క్లిక్ చేసిన, షేక్ చేసిన సమాచారం కమాండ్ కంట్రోల్‌కు చేరుతుంది. అర్బన్ పరిధిలో 6 నుంచి 7 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 10 నిమిషాల్లోనే ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని రక్షణ కల్పిస్తారు. గుగూల్‌ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. వ్యక్తిగత వివరాలు నమోదు చేశాక ఓటీపీతో అనుసంధానం చేసుకోవాలి. కుటుంబ సభ్యులు సన్నిహితుల ఫోన్ నెంబర్లు జోడించాలి. ఆపదలో ఉన్న మహిళలు, యువతల రక్షణ కవచంగా శక్తి యాప్ పనిచేయనుంది.

**ఉపయోగం ఎలాః**

అత్యవసరం సమయం ఆపదలో ఉన్న మహిళలు, విద్యార్థుల సమాచారం పోలీసులకు చేరుతుంది. ఎస్ఓఎస్ క్లిక్ అలర్ట్‌తో పోలీసులు యాప్‌లో పొందుపరిచిన కుటుంబ, సన్నిహితుల ఫోన్‌నెంబర్లకు అలర్ట్ వస్తుంది. పోలీసు కంట్రోల్ రూమ్ జియో లోకేషన్ ట్రాకింగ్ ద్వారా మహిళ ఉన్న ప్రదేశాన్ని గుర్తించి సంబంధిత పోలీసులను అప్రమత్తం చేస్తుంది. సమాచార అవగాహన, మహిళా హక్కులు, రక్షణ, చట్టాలు, ప్రభుత్వ నిబంధనల వివరాలు తెలుసుకోవచ్చు. సమీప పోలీసు స్టేషన్ సమాచారం, హెల్ప్‌లైన్ వివరాలు యాప్‌లో ఉంటాయి. కౌన్సిలింగ్‌కు వీలుగా మెటర్నటి హాస్పిటల్‌లోని వన్‌స్టాప్ సెంటర్, షెల్టర్ హోమ్స్ అందుబాటులోకి తెచ్చారు.

**ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలిః ఎస్పీ దామోదర్**



జిల్లాలోని మహిళలు, బాలికలు, విద్యార్థినీలు, ఉద్యోగినీలు, గృహిణీలకు శక్తి యాప్ మరింత భద్రత ఇస్తుందని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. అత్యవసర సమయంలో పోలీసుల సాయం పొందవచ్చు. ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద కలిగితే వెంటనే యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే చాలు. పోలీసుల తక్షణ సాయం అందిస్తారని ఎస్పీ తెలిపారు.


# ప్రకాశం



వార్త

తెలుగు జాతీయ దినపత్రిక


# విద్యార్థులకు 23 లాప్‌టాప్‌లను పంపిణీచేసిన కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లాలో రెగ్యులర్‌గా చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన (ఐటీఐ, ప్రొఫెష నల్ కోర్సెస్, డిగ్రీ, పీజీ, ఆపైన) విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా 23 లాప్‌టాప్‌లను, జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు 14 కృత్రిమ కాలులను సోమవారం గ్రీవెన్స్ హాల్‌లో అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన్న ఓబులేషు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్దుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన పాల్గొన్నారు.

# విద్యార్ధులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందడమే లక్ష్యంతో పని చేస్తుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విద్యాశాఖాధికారులతో సమావేశమై జీవో 117, డ్రాప్ అవుట్స్ తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవో 117 ను ఉపసంహరించిన తర్వాత అందుకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించి ఇప్పటికే సన్నాహక మార్గదర్శకాలపై ఉత్తర్వులు కూడా విడుదల చేసిందన్నారు. అందుకనుగుణంగా క్షేత్రస్థాయిలో కూడా సంబంధిత విద్యాశాఖల అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో అధ్యయనం చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై పిల్లల తల్లిదండ్రులను సంప్రదించి వారికి వివరించి తరువాత వారి అభిప్రాయాలను తెలుసుకునేలా ఎంఈఓలు గ్రామ పంచాయతీ స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆ పంచాయతీ పరిధిలో ఉన్నత పాటశాల కమిటీల సమావేశంలో స్కూళ్ల వివరాలను వారికి అర్థమయ్యే విధంగా వివరించి నిర్ణయాలను లిఖితపూర్వకంగా ఆమోదం పొందే విధంగా అందరూ ఎంఈఓలు చూడాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ అమలు ప్రక్రియలో మండల, క్లస్టర్ కమిటీల ఏర్పాటు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీతో సంప్రదించి, తల్లిదండ్రుల అంగీకారంతో ఈ పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ ప్రక్రియ అమలు గురించి శాసనసభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. డ్రాప్ అవుట్ పిల్లలు ఎందుకు డ్రాపౌట్ అవుతున్నారో గుర్తించి వారిని బడిలో చేర్పించేలా విద్యా శాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్, జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యర్రం పిచ్చిమ్మకు ఘనంగా నివాళులర్పించిన వైఎస్ జగన్







**కొరిశపాడు, మార్చి 18 ప్రభాతవార్త**

ఆదర్శ రైతు స్వర్గీయ యర్రం చిన పోలిరెడ్డి సతీమణి, రాజ్యసభ సభ్యులు, వైసిపి రాష్ట్ర నాయకులు వైవి సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చిమ్మ సోమవారం మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం మేదరమెట్ల చేరుకుని యర్రం పిచ్చిమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. వైవి సుబ్బారెడ్డి స్వయాన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిన్నాన్న మంగళవారం యర్రం పిచ్చిమ్మ పార్థివ దేహానికి ఒంగోలులోని వైవి భద్రారెడ్డి స్వగృహం నుండి యర్రం చినపోలిరెడ్డి స్వగ్రామమైన మేదరమెట్లలోని వారి స్వగృహానికి తరలించి, బంధు మిత్రులు, గ్రామస్థులు, దర్శనార్థం మధ్యాహ్నం వరకు ఉంచారు. ఈ నేపద్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుండి మంగళవారం హెలికా ప్టర్‌లో మేదరమెట్లకు చేరుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కన్వాయ్‌తో వైవి వారి నివాసానికి చేరుకున్నారు. యర్రం పిచ్చిమ్మ పార్థివదేహానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడే వున్న వైవి సుబ్బారెడ్డి, వైవి భద్రారెడ్డిలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలను ప్రత్యేకంగా ఆలింగనం చేసుకుని పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యుల అందరితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూర్చుని మాట్లాడారు.

**పిచ్చిమ్మకు నివాళులర్పించిన విజయమ్మ..**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి, ప్రస్తుత తాజా మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ కూడ యర్రం పిచ్చిమ్మ పార్థివ దేహానికి నివాళులరి ్పంచారు. అమె సోమవారమే ఒంగోలుకు చేరుకున్నారు. మంగళవారం మేదరమెట్లకు కూడ వచ్చి పిచ్చిమ్మకు నివాళులర్పించి, కుటుంబసభ్యులందరినీ పరామర్శించారు.

**పిచ్చిమ్మకు పలువురు నేతల నివాళి..**

యర్రం పిచ్చిమ్మకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన వైసిపి నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపిలు, మాజీ ఎమ్మెల్యేలు నివాళులర్పించిన వారిలో వున్నారు. ప్రధానంగా ప్రకాశం జిల్లా జడ్‌పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, భూమన కరుణకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మేరుగ నాగార్జున, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, అన్నారాంబాబు, కె.నారాయణస్వామి, ఆదిమూలపు సురేష్, కరణం వెంకటేష్, చుండూరి రవిబాబు, రవీంద్రర్‌రెడ్డి, అంబటి రాంబాబు, టిజె సుధాకరర్‌బాబు, పానెం చినహనిమిరెడ్డి, జి.మధుసుధానరెడ్డి, వరికూటి ఆశోక్ బాబు, విడదల రజని, జంకె వెంకటరెడ్డి, రాంరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, కెవి రమణరెడ్డి, ఎస్ శ్రీనివాసరెడ్డి, ఎం. వెంకారెడ్డి, తూమాటి మాధవరావు, జోగి రమేష్, తోపాటు అద్దంకి నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, మాజ ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు వైవి కుటుంబ అభిమానులు వున్నారు.

**- కుటుంబసభ్యులకు పరామర్శ**

# దొడ్డవరం పంచాయతీ సర్పంచ్‌కి చెక్‌పవర్ ఎలా..?

- *గత కొన్ని నెలలుగా రికార్డులు పరిశీలన అంతా తప్పేనా..?*
- *దొంగలకు పట్టం కట్టొద్దు అంటున్న గ్రామస్తులు*
- *విచారణ, రికార్డులు పరిశీలన, ఎందుకు..? ఎవరి కోసం..?*
- *అధికారుల నిర్ణయాలతో పంచాయతీ నిర్వాహణ గాడి తప్పే పరిస్థితి*
- *ప్రస్తుతం టీడీపీ నాయకుల వ్యవహారంపై మండిపడుతున్న గ్రామస్తులు*

**మద్దిపాడు, మార్చి 18, ప్రభాతవార్త**

గత కొద్ది నెలల నుంచి మండలంలోని దొడ్డవరం పంచాయతీలో ఫిర్యాదులు, విచారణ, పంచాయతీ కార్యదర్శి సస్పెండ్, గ్రామ సర్పంచ్ చెక్ పవర్ తాత్కాలికంగా నిలిపివేత, పీఓపార్డీకే అధికారాలు, జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు, ప్రజా ప్రతినిధులు ఫిర్యాదులు తదితర అంశాలతో గత సంవత్సరం నుంచి ఆ పంచాయతీ కార్యాలయం వాతావరణ వేడెక్కిన పరిస్థితి. కొన్ని నెలల కిందట దొడ్డవరం సర్పంచ్ మీ కోసం ద్వారా కలెక్టర్ సమర్పించిన అర్జీపై ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారిణి ఆర్.పద్మ దొడ్డవరం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు విచారణ నిర్వహించారు. ఈ విచారణకు మద్దిపాడు మండల విస్తరణ అధికారి కొండపి రఘుబాబు, గ్రామ సర్పంచ్, గతంలో అవినీతి ఆరోపణలు కాలంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు, అప్పటి పంచాయతీ కార్యదర్శి అయిన ఎం.సుభాషిణి హాజరై విషయం విధితమే. విచారణలో భాగంగా దొడ్డవరం సర్పంచ్ సుబ్బారావు ఆరోపణపై మండల విస్తరణ అధికారి కే.రఘుబాబు వ్రాత పూర్వకంగా సంజాయిషీ సమర్పించారు. గతంలో తాను సదరు ఆరోపణపై 2024 జులై 31న రిజిస్టర్ పోస్టు ద్వారా జిల్లా పంచాయతీ అధికారి వారికి సవివరంగా వ్రాత పూర్వక వివరణ సమర్పించినట్లు అందులో వివరించి సదరు కాపీ నకలును విచారణాధికారికి సమర్పించారు. గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి అజయ్ కీర్తి గ్రామ పంచాయతీ నందు డిపాజిట్ చేసిన నగదు వివరాలు అందజేసి, గ్రామ సర్పంచ్ గత పంచాయతీ కార్యదర్శి అజయ్ కీర్తిపై చేసిన ఆరోపణలు నిరాధారములు, డీపీఓ, విచారణ అధికారి అయిన ఆర్.పద్మకు పీఓపీఆర్డీ కే.రఘుబాబు తెలిపారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ గ్రామ సర్పంచ్ ప్రభుత్వ అధికారుల పైనను, పాలకవర్గ సభ్యుల పైనను, పత్రికా విలేకర్ల పైనను, కూటమి ప్రభుత్వంలోనే ప్రజాప్రతినిధులపైన తెలుగుదేశం పార్టీ నాయకులు పైనను ఏ విధమైనటువంటి ఆధారాలు లేకుండానే అనేక ఆరోపణలు ఆరోపించినటువంటి సందర్భాలు లేకపోలేదు. దీంతో పాటుగా ప్రతి ఒక్కరి పైన ఆరోపణలు చేస్తూ మీ విధానం తప్పు అన్న వ్యక్తులపై కులం పేరుతో కేసులు పెడతామని అధికారులను ఇతర వ్యక్తులను బెదిరించిన సందర్భాలు లేకపోలేదు. ప్రస్తుతం పని చేస్తున్నటువంటి పంచాయతీ కార్యదర్శి కూడా ఇతను చేసిన ఆరోపణలకి నేను పని చేయను దొడ్డవరం పంచాయతీలో అంటూ అనేక సందర్భాలు మండల ఉన్నత స్థాయి అధికారులకు మొరపెట్టుకున్నా కూడా తమ గోడు వినే అదికారులు లేరని సెలవు పెట్టి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. గతంలో పని చేసినటువంటి పంచాయతీ కార్యదర్శి ఎం.సుభాషిణి ఆనాటి ఎంపీడీఓ వి.జ్యోతి సలహా సూచనలు మేరకు కొంత కాలం పని చేసిన అప్పటి ఎంపీడీఓ జ్యోతి రాష్ట్ర ప్రభుత్వ శిక్షణ కార్యక్రమం భాగంగా వెళ్లడంతో కార్యదర్శి సుబాషిణిని కూడా లాంగ్ లీవ్ పెట్టి వెళ్లిపోవడం జరిగింది. అధికారుల కొన్ని నెలల పాటు రికార్డులు పరిశీలించి సుమారుగా రూ.30లక్షల వరకు అవినీతి జరిగిందని నిర్ధారణ చేసిన జిల్లా ఉన్నత స్థాయి అదికారులకు నివేదికల సమర్పించిన తర్వాత పూర్తి స్థాయిలో పరిశీలించి అప్పటి అవినీతి కాలంలో పని చేసినటువంటి పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ భాషను, కొన్ని నెలల సమయం తరువాత సర్పంచ్ పూనూరు సుబ్బారావుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు చెక్ పవర్ ను నిలిపివేయడం జరిగింది. సోమవారం నాడు ఏ విధమైనటువంటి అవినీతి నగదును చెల్లించకుండానే, పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ భాషను విధుల్లోకి తీసుకుంటూ, పంచాయతీ సర్పంచ్‌కు చెక్ పవర్ ఇస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశాలు జారీ చేశారని ఆ విధంగా ఎలా చేస్తారని ఆ గ్రామానికి చెందినటువంటి పలువురు గ్రామస్తులు మండల ఉన్నత స్థాయి , జిల్లా ఉన్నత స్థాయి అధికారులకు వినతిపత్రాన్ని అందజేసినట్లు సమాచారం. గత సంవత్సరం నుంచి గ్రామస్తులు గ్రామంలో నీటి పన్ను ఇంటి పన్నులు చెల్లించకుండా పరిపాలన సౌలభ్యానికి ఆటంకం కలిగించే విధంగా నడుస్తున్నారని మండల ఉన్నత స్థాయి అధికారులు పన్నులు చెల్లింపు విధానంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. దీనిపై గ్రామస్తులు పన్నులు చెల్లించేందుకు కొంత మంది ముందుకు రావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఇది జరిగే లోపే జిల్లా ఉన్నత అధికారులు సర్పంచ్‌కి చెక్ పవర్ ఇస్తున్నారని తెలియటంతో గ్రామంలోని ప్రజలు పన్నులు చెల్లించమని పంచాయతీ అధికారులకు మొహమాటం లేకుండా చెబుతున్నారు. గతంలో పంచాయతీ నందు లక్ష రూపాయలు మింగేశారు. అవి సరిపోక మళ్లీ మా చేత పన్నులు కట్టించి దొంగలకే పట్టం కడతారా అంటూ అధికారులను ఎదురుగానే అడుగుతున్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో ప్రస్తుత సర్పంచ్ టీడీపీ మద్దతుదారులతో గెలిచినటువంటి పరిస్జితి. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఆర్థిక వనరులను సమకూర్చుకునే క్రమంలో కొంత కాలం వైసీపీ తరుపున తిరిగి, ఆ తర్వాత 2024 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరుపున సీటును సమకూర్చుకోవాలని క్రమంలో ఆనాటి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతోనూ ఇతర ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తిరిగి కాంగ్రెస్ సీటును సాధించి ప్రస్తుత ఎమ్మెల్యే అయినా బీఎన్ విజయ్‌కుమార్‌పై కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేయాలని ప్రయత్నించినటువంటి వ్యక్తి ఈ దొడ్డవరం సర్పంచ్. అయితే అలాంటి వ్యక్తికే ప్రస్తుతం టీడీపీలో ఉన్నటువంటి నాయకులు అండగా నిలిచి చెక్ పవర్‌ను ఇప్పించేందుకు జిల్లా ఉన్నత పంచాయతీ అధికారులకు సిఫార్సు చేశారని, ఏ విధంగా ప్రస్తుత ఎమ్మెల్యే, మండలంలోని టీడీపీ నాయకులు సహకరిస్తున్నారని ఆ గ్రామ టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదే విధంగా జరిగితే రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో టీడీపీకి ఎదురు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు టీడీపీ నాయకులే ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి నిజ నిర్ధారణ చేసి ఏ కారణం చేత చెక్ పవర్ ఇవ్వాలా.. వద్దా అనేది వాళ్ళ విధేయతకే వదిలేస్తున్నట్లు ఆ గ్రామస్తులు అంటున్నారు.






## ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మీటర్ రీడర్స్ ధర్నా

**మార్కాపురం, మార్చి 18, ప్రభాతవార్త**




దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని మీటర్ రీడర్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడరన్స యూనియన్, ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ గౌరవ నాయకులు అందే నాసరయ్య మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ మీటర్ రీడర్స్ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఉద్యోగ బద్రత లేక శ్రమకు తగ్గ వేతనం అందక దినదిన గండంలా వారు విధులను నిర్వహిస్తున్నారని అన్నారు. మీటర్ రీడర్స్ కు విద్యుత్ సంస్థలో ఉపాధి కల్పించాలని ఉద్యోగ భద్రతతో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మటర్ రీడర్స్ అధ్యక్షుడు పి.సతీష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని సంవత్సరాలుగా శాంతియుతమైన ఆందోళన చేస్తున్నామని అయినప్పటికి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు తగ్గట్టు వేతనాలు పెంచాలని, విద్యుత్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని, ఎస్కో ఆకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీడర్స్ నాయకులు సుబ్రహ్మణ్యం, ఉమర్, ఏఐటీయుసీ నాయకులు షేక్ కాశీం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

## జంట హత్య కేసులో ముద్దాయి కాశింవలి అరెస్టు

**పెద్దదోర్నాల, మార్చి 18, ప్రభాతవార్త**




పెద్దదోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం గ్రామంలో ఈనెల 7వ తేదీన జరిగిన జంట హత్యల కేసులో ముద్దాయి పెద్ద బొమ్మలాపురానికి చెందిన దూదేకుల కాశింవలిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, యర్రగొండపాలెం సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు, దోర్నాల ఎస్సై వి.మహేష్‌లు పెద్దదోర్నాల పోలీసు స్టేషన్‌లో నిందితుడు దూదేకుల కాశింవలిని విలేకర్ల ఎదుట హాజరు పరిచారు. మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపిన వివరాల మేరకు తూర్పు బొమ్మలాపురం గ్రామంలో దూదేకుల కాశింవలికి వారి ఇంటి పక్కన నివాసముంటే దూదేకుల సైదాబీ కుటుంబాల మధ్య ఒకటిన్నర సెంటు గ్రామ కంఠం స్థల వివాదంలో మనస్పర్ధలు ఉన్నాయి. స్థలం విషయంలో తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. అయితే దూదేకుల కాశింవలి, చిన్న హుస్సేన్, శాలిబ, మీరంబి, సిద్దయ్య, ముత్తు జాబి, బాబావలి, నూర్జహాన్‌లు కలిసి సైదాబీ కుటుంబీకులను చంపాలని పథకం అన్నారు. గుంటూరు నుండి బంధువులను కూడా పిలుచుకున్నారు. సైదాబీ కుటుంబం అడ్డు లేకుండా ఉంటే ఒకటిన్నర సెంటు స్థలం దూదేకుల కాశింవలికి వస్తుందని పథకం రచించారు. ఈ మేరకు ఈనెల 7వ తేదీ తెల్లవారుజామున 4గంటల సమయంలో పెట్రోల్ క్యాను వచ్చి దూదేకుల నూర్జహాన్ బి, దూదేకుల నాగూర్‌వలిలు ఇంటి బయట నిద్రపోతుండగా వారిపై పెట్రోల్ పోసి తగులబెట్టి పారిపోయారు. 90శాతం కాలిన గాయాలతో ఉన్న దూదేకుల నూర్జహాన్‌బి, దూదేకుల నాగూర్‌వలి ఆసుపత్రుల్లో చేర్పించగా వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు పెద్దదోర్నాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దూదేకుల కాశింవలిని సోమవారం చిన్న దోర్నాల అడ్డురోడ్డు వద్ద సాయంత్రం 6గంటల 15 నిమిషాలకు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. మంగళవారం రిమాండ్ నిమిత్తం మార్కాపురం కోర్టుకు పంపుతున్నట్లు మార్కాపురం డీఐవెస్పీయు నాగరాజు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు కాశింవలిని సకాలంలో అరెస్టు చేసి దోర్నాల ఎస్సై వి.మహేష్, పోలీసు సిబ్బందిని డీవైఎస్పీ యు.నాగరాజు అభినందించారు.

## మహిళల భద్రతకు బలమైన ఆయుధం శక్తి యాప్

**- మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు**

**పెద్దదోర్నాల, మార్చి 18, ప్రభాతవార్త**



నేరాలు ఘోరాలు జరగకుండా మహిళల రక్షణ, భద్రతకు బలమైన ఆయుధం శక్తి యాప్ అని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు అన్నారు. ఇటీవల మార్కాపురంకి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను ప్రారంభించారని, ఈ యాప్ ద్వారా మహిళలకు సత్వరమే రక్షణ న్యాయం జరుగుతుందన్నారు. అత్యవసర పరిస్తితుల్లో తమ లొకేషన్ షేర్ చేయడం ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని ఆ సమాచారం వెనువెంటనే సంబంధిత ఏరియా పోలీసులకు చేరి ఏడు నిమిషాల్లో పోలీసులు లొకేషన్‌లో ఉంటారని, తద్వారా మహిళలకు రక్షణ వెంటనే ఏర్పడుతుందని వివరించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లాలో మొత్తం ఆరు శక్తి యాప్ టీములు పని చేస్తున్నాయన్నారు. మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో రాజామోహన్, హ్యూమన్ టీములు ప్రత్యేకంగా సేవలందిస్తున్నారని, ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన సందర్భాల్లో అత్యవసరంగా వినియోగించుకోవాలని సూచించారు. శక్తి యాప్‌లో భద్రత రక్షణకు సంబంధించి ఎన్నో వివరాలు ఉన్నాయని, మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పని చేస్తుందని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు వివరించారు. ఈ సమావేశంలో యర్రగొండపాలెం సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై వెలమ మహేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## హంస వాహనంపై ఊరేగిన శ్రీవారు

**కొనకనమిట్ల, మార్చి 18, ప్రభాతవార్త**



మండలంలోని గార్లదిన్నె పంచాయతీ వెలుగొండ క్షేత్రంలో అలివేలు మంగా సమేత లక్ష్మీ శ్రీ వెంకటేశ్వరస్వామి(శ్రీవారు) బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం రాత్రి ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు హంస వాహనంపై వెలుగొండ మాడ వీధుల్లో ఊరేగారు. అర్చకులు నంద్యాల ప్రసాదాచార్యులు, కొడవటి గంటి వెంకటరమణాచార్యులు, భార్గవరమణ చార్యులు ఆధ్వర్యంలో తొలుత మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యన్విహణ అధికారి చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ కుందు కాశి రెడ్డిల పర్యవేక్షణలోమధ్యాహ్నం నగరోత్సవం జరిగింది. ఈ ఉత్సవంలో ఉభయదాతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

మద్దిపాడు, మార్చి 18, ప్రభాతవార్త

బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు గుండ్లపల్లి పారిశ్రామిక వాడ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిపాడు సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ మద్దిపాడు నార్త్ సబ్‌స్టేషన్ గుండ్పలి పారిశ్రామిక వాడ లెవెన్ కేవీ ఫీడర్ ఫోర్ పరిదిలో నూతనంగా విద్యుత్ లైన్ నిర్మాణం జరుగుతున్న కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. పారిశ్రామిక వాడలోని 11 కేవీ ఫీడర్ ఫోర్ పరిధిలో వినియోగదారులు సదరు విషయాన్ని గమణించి సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ చెన్నారెడ్డి కోరారు.

## ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి - ఈవోఆర్డీ

**టంగుటూరు, మార్చి 18, ప్రభాతవార్త**



టంగుటూరు మండలంలోని 18 పంచాయతీల ఇంటి పన్నులను కులాయి పూర్ణులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని మండల విస్తరణ అధికారి కేవీ రామ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 పంచాయతీల కార్యదర్శులు బిల్లులు విషయంలో తొందరగా పూర్తి చేయాలని కోరారు.

## వల్లూరులో రోడ్డు ప్రమాదం

**టంగుటూరు, మార్చి18, ప్రభాతవార్త**



టంగుటూరు మండలంలోని వల్లూరు గ్రామం 16నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక ఎస్సై నాగమల్లేశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం వల్లూరులోని ప్లైఓవర్ పైన హైవేలో



సాయంత్రం 5.20 గంటల సమయంలో ఒంగోలు వూపు నుంచి మడమనూరు వైపు వెళ్తున్న చల్లపల్లా వనజా యొక్క స్కూటీని వెనుక వైపు గుద్ది ఆ తర్వాత అదే దారిలో ముందు వెళ్తున్న తిరువం అని యొక్క ఇన్నోవా కారుని గుద్దటంతో కారు డ్యామేజీ అయింది. సదరు ప్రమాదంలో వనజాకి చిన్న చిన్న గాయాలయ్యాయి. సదరు ప్రమాదానికి కారనం అయినా గుర్తుతెలియని వాహనం గుర్తించడానికి ప్రయత్నాలు చేస్తూ ఉన్నాం.

## ఉల్లాస్ కార్యక్రమంపై సమీక్ష

**సంతనూతలపాడు, మార్చి 18, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ డి.సురేష్ బాబు అధ్యక్షతన ఉల్లాస్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమం ఈ ఉల్లాస్ యొక్క ముఖ్య ఉద్దేశం. రాత్రి వేళల్లో మహిళలకు వాలంటర్ ద్వారా గత రెండు నెలలు నుండి విద్య నేర్పిస్తున్నారు. విద్య నేర్చుకున్న మహిళలకు ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్ బాబు పేర్కొన్నారు. వెలుగు సీసీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు వీటిని ఇన్విజిలేటర్లుగా వ్యవహరించనున్నారు. ఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ కే.జ్యోతి, ఎంఈఓ డి.వెంకారెడ్డి, వెలుగు ఏటీఎం టి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## 170 పొగాకు బేళ్లకు విక్రయాలు

**సంతనూతలపాడు, మార్చి 18, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు- 1 వ పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 170 పొగాకు చెక్కులకు విక్రయాలు జరిగాయి. చిలంకూరు క్లస్టర్ పరిధిలో 226 పొగాకు బేళ్లను వేలానికి అనుమతించారు. వీటిలో 56 పొగాకు బేళ్లను వివిద కారణాలచే తిరస్కరించారు. పొగాకు కిలో ఒక్కొంటికి అత్యధిక ధర రూ.280 లభించాయి. కనిష్ట ధర రూ.260లు పలికాయి. సరాసరి ధర రూ.271.93 పైసలు లభించాయి. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

## క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

**సంతనూతలపాడు, ప్రభాతవార్త**



విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రికెట్ పోటీల్లో మంగళవారం నాడు సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## రూ.50వేలు విలువ చేసే సీసీ కెమెరాలు పంపిణీ చేసిన టీడీపీ నేతలు శేషయ్య, సుబ్బయ్యలు

**సంతనూతలపాడు, మార్చి 18, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కల్లూరి వెంకట శేషయ్య, గోగినేని సుబ్బయ్యలు 50 వేలు రూపాయలు విలువ చేసే ఐదు సీసీ కెమెరాలను, కేబుల్ వైర్, వీసీఆర్ సెట్టులను సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు సమక్షంలో మంగళవారం సాయంత్రం సంతనూతలపాడు పోలీసు స్టేషన్‌లో ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత బాబుకు అందజేశారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు శేషయ్య, సుబ్బయ్యలను ఆదర్శంగీ తీసుకొని మండలంలో ప్రతి గ్రామంలో నాయకులు, పలు రంగాల నేతలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా గ్రామాల అభ్యున్నతికి ఈ సీసీ కెమెరాలను అందజేయాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాస్టర్లకు అండగా ఉంటా : గూడూరి ఎరిక్షన్‌బాబు

**యర్రగొండపాలెం, మార్చి 18, ప్రభాతవార్త**



యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ నూతన పాస్టర్స్ వెలే ఫ్ర్ సొసైటి కమిటీ ఆత్మీమ సమావేశం నిర్వాహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పాస్టర్ల అభ్యున్నతికి కృషిచేస్తానని ఆయన అన్నారు. చర్చి నిర్మాణాలకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆనంతరం పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేశారు. ఎరిక్షన్‌బాబుకి నూతన కమిటి వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు పాల్గొన్నారు.

## జెబికె పురం, చెట్టిచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**బేస్తవారిపేట, మార్చి 18, ప్రభాతవార్త**



మండంలోని జగ్గంబొట్ల క్రిష్ణాపురం (జెబికె పురం), చెట్టిచెర్ల గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖాధికారిణి జక్కం మెర్సీ అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జక్కం మెర్సీ గ్రామాల రైతులతో కలిసి మిరప పంటను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంట నమోదు చేపించుకున్న రైతులు సామాజిక తనిఖీ కొరకు రైతు సేవా కేంద్రం నందు గ్రామ సభలు నిర్వహించి జాబితాను ఉంచడం జరిగిందని, పంట నమోదు చేయించుకున్న రైతులు జాబితాను చూసుకుని ఏమైనా సవరణలు ఉన్నట్లయితే ఈనెల 22వ తేదీ లోపుగా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద సరిచేయించుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. కందులు మద్దతు ధర రూ.7550లు, శనగ మద్దతు ధర రూ.5,650లతో కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగిందని కావునా కంది పంట సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి బాలాజీ నాయక్, మండల వ్యవసాయ విస్తరణాధికారి నారా ఆదిగణేష్, గ్రామ ఉద్యాన సహాయకులు జ్యోతి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్ కె జుబేర్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## యూట్యూబ్ జర్నలిష్టులకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలి

**జిల్లా వైజేఏఏపి నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో రాష్ట అధ్యక్షులు మల్లిఖార్జున రెడ్డి**

**కంభం రూరల్, మార్చి 18 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో యూట్యూబ్ జర్నలిస్టులకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలని యూట్యూబ్ న్యూస్ ఛానల్స్ ఆఫ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుండారెడ్డి మల్లిఖార్జున రెడ్డి అన్నారు. యూట్యూబ్ న్యూస్ ఛానల్స్ ఆఫ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (వైజేఏఏపి) ప్రకాశం జిల్లా నూతన కమిటీ సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర అధ్యక్షులు గుండారెడ్డి మల్లిఖార్జున రెడ్డి, జనరల్ సెక్రటరీ వల్లూరు మధుసూధన్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుల అనీల్ కుమార్, గౌరవాధ్యక్షులు పి సూర్య ప్రకాష్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్, బి ఎలిజెర్‌లు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర రిజిస్ట్రర్డ్ బాడీ చేతుల మీదుగా జిల్లా నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రకాశం జిల్లా నూతన అధ్యక్షులుగా పోలుబోయిన వెంకట శివకృష్ణ, ఉపాధ్యక్షులుగా వడ్డెంగుంట్ల కోటేశ్వరరావులతోపాటు నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టల సమస్యల పరిష్కారం కోసం యూట్యూబ్ జర్నలిస్ట్ అసోసియేషన్ కృషిచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో, జిల్లాలో నూతన సభ్యులను పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని



యూట్యూబ్ జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. పల్నాడు జిల్లాలో సభ్యుల చేరికతోపాటు అన్ని జిల్లాల్లో యూట్యూబ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని తెలిపారు. అనంతరం ప్రకాశం జిల్లా కమిటీని ప్రకటించారు. కార్యదర్శిగా ఐ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా పి శ్రీనివాసులు, కోశాధికారిగా గణేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వై రమేష్, కార్యవర్గ సభ్యులుగా బి వంశీ కృష్ణ, సిహెచ్ అనీల్ కుమార్, సభ్యులుగా ఎస్ సుబ్బారావు, ఎం సూర్య, వి సతీష్‌లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా నుండి దిలీప్, ప్రకాశం జిల్లాలో వైజేఏఏపి జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కనిగిరి ఎస్సీ హాస్టల్ తరలింపును ఉపసంహరించుకోవాలి

**- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కే.పాండురంగారావు**

**- అధికారులు స్పందించకపోతే ధర్నాలు చేపడతాం**

**కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త**




కనిగిరి సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కాకుల్ల పాండురంగారావు మాట్లాడుతూ కనిగిరి సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని కనిగిరి నుంచి వెలిగండ్ల మండలం పందువ నాగులవరం కు తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కనిగిరి నియోజకవర్గంలో ఉన్న ఈ సవతి గృహం 46 ఏళ్లుగా ఎంతో మంది పేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి విద్యాబుద్దులు నేర్చుకునేలా ప్రయోజకులు అయ్యేలా చేసిందని అటువంటి వసీతి గృహాన్ని తరలించాలనుకోవడం సరికాదన్నారు. రెగ్యులర్ సంక్షేమ అధికారిని నియమించి యధావిధిగా కనిగిరిలోనే వసతి గృహాన్ని నిర్వహించాలని కోరారు. రూ.20లక్షలతో మౌలిక వసతులు కల్పిస్తుండగా వసతి గృహాన్ని తరలించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. గతంలో ఒక వసతి గృహాన్ని కంచర్ల వారిపల్లికి తరలించారని ఇప్పుడు ఉన్న ఒక్కగానొక్క వసతి గృహాన్ని వెలిగండ్ల మండలానికి తరలించడం సరికాదన్నారు. కనిగిరిలో కాలేజీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని, వెలిగండ్ల మండలానికి నూతన వసతి గృహాన్ని మంజూరు చేయించాలని కోరారు. ఎస్సీ పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కనిగిరి వసతి గృహాన్ని తరలించకుండా ఇక్కడే కొనసాగించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే విద్యార్థులను భారీగా సమీకరించి ధర్నాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, అశోక్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి ఎస్సీ హాస్టల్‌ను మూసివేయవద్దు

**కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త**



కనిగిరిలోని ఎస్సీ హాస్టల్‌ను ప్రభుత్వం తరలించాలని చూస్తే సహించేది లేదని దళిత, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, టీడీపీ నాయకులు చీకటి వెంకట సుబ్బయ్య, ఏరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, ప్రజాశక్తి విలేకరి కటికల ఆగస్టీన్, బాల బాదుర్ల సుధాకర్, సింహాద్రి నరసయ్య తదితరులు పాల్గొన్నారు. 46 ఏళ్లుగా అనేక మంది విద్యార్థులకు వసతి కల్పించింది. గతంలో ఎస్సీల కోసం రెండు హాస్టళ్లు ఉండగా, ఒక దాన్ని కంచర్ల వారి పల్లకి తరలించారు. ఇప్పుడు మిగిలిన హాస్టల్‌ను కూడా మూసివేయడం అన్యాయమని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని, విద్యార్థులకు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం 20 లక్షల రూపాయలతో మరమ్మత్తులు చేస్తూ హాస్టల్‌ను మూసివేయడం బాధాకరమని దళిత నాయకులు మండిపడ్డారు. కనిగిరి ఆర్డీఓ కేంద్రం కనుక, ఇక్కడ ఎస్సీ హాస్టల్ లేకపోతే విద్యార్థులు ఎక్కడ చదువుకోవాలని ప్రశ్నించారు. హాస్టల్ భవిషయత్తుపై స్పష్టత ఇవ్వాలని కోరగా, ఏఎస్‌డబ్ల్యూని ఫోన్‌లో సంప్రదించగా డీడీని కలవండి అంటూ సమాధానం ఇచ్చారని నాయకులు తెలిపారు. ఆనంద నిలయంలో సీట్ల సంఖ్య ఎస్సీ విద్యారుధలకు ఎంత ఉందని అడిగితే స్పష్టమైన సమాధానం రాలేదని, హాస్టల్‌ను తరలించే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కనిగిరి నియోజకవర్గంలో దాదాపు 60 వేల మంది ఎస్సీ ప్రజలు ఉంటే, కనీసం ఒక్క హాస్టల్ కూడా లేకపోవడం ఎంతవరకు న్యాయమని నాయకులు ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ హాస్టల్‌ను ఇక్కడే కొనసాగించేందుకు తక్షణచర్యలు తీసుకోవాలని తళిత సంఘాలు కోరాయి.

## వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల

**కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త**



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బాపట్ల జిల్లా మెదరమెట్టలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్దివదేహానికి నివాళులర్పించేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నారాయణ బాగున్నావా' అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చింతలచెరువు

**కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త**



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బాపట్ల జిల్లా మేదరమెట్లకు విచ్చేసి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్దివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి హెలిప్యాడ్ వద్ద జగన్‌మోహన్‌ఱెడ్డిని మర్యాదపూర్వకంగా కరచాలనం చేసి ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పార్ధివ దేహానికి నివాళులర్పించిన దద్దాల

**కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ మంగళవారం మేదరమెట్ల గ్రామంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కే.నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వేమూరు వైసీపీ ఇన్‌ఛార్జీ వరికూటి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి - ఏవో కే.రాధ

**పామూరు, మార్చి 18, ప్రభాతవార్త**



మండలంలోని రైతాంగం ఆధునిక టెక్నాలజీతో కూడిన పీఎల్ఎస్, పీడీఎస్ఎస్ యాప్‌ల మీద అవగాహన కలిగి ఉండి తద్వారా సకాలంలో అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టి అన్నదాతలు లబ్ది పొందాలని వ్యవసాయాధికారి కంచెం రాధా తెలిపారు. మండలంలోని తూర్పుకట్టకిందపల్లి ఇనిమెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో సాగవుతున్న వివిధ పంటలను పరిశీలించి రైతాంగానికి తగు సూచనలు, పంటనూశించే పురుగు వాడాల్సిన మందుల గురించి వివరించారు. వ్యవసాయ యాంత్రికరణ, ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి వివరించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రైతు సేవాకేంద్రాన్ని తనిఖీ చేశారు. రబీ 2024-25 సీజన్‌కు సంబంధించిన పంట నమోదు జాబితాను ప్రదర్శించడం జరిగిందని, రైతులు జాబితాలను పరిశీలించి మార్పు చేసుకోవాలంటే చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు యామిని, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కటకానిపల్లి, రామచంద్రకోటలో పొలం పిలుస్తోంది

**పెద్దదోర్నాల, మార్చి 18, ప్రభాతవార్త**



పెద్దదోర్నాల మండలంలోని కటకానిపల్లి, రామచంద్రకోట గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్ నాయక్ గ్రామంలో సాగు చేసిన పొగాకు, జామ, మిరప పంటలను సందర్శించడం జరిగింది. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వ్యవసాయ యాంత్రికరణ పథకం, ఏపీఎఫ్ఆర్, ఈ పంట నమోదు పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ శ్వేత, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.






# మొబైల్ మోజులో నేటి యువత

- చిన్నా, పెద్దా తేడా లేకుండా కట్టిపడేస్తున్న వైనం
- మొబైల్ రేడియేషన్ పెరిగితే ప్రమాదమే
- మొబైల్ వినియోగంతో అంతుచిక్కని వ్యాధులకు గురవుతున్న ప్రజానీకం

**కంభం రూరల్, మార్చి 18, ప్రభాతవార్త**

ప్రస్తుత సమాజంలో యువత బాధ్యతలను గాలికొదిలేసి మొబైల్ మోజులోపడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు కూడా మారాల్సిన పరిస్థితి వచ్చింది. మార్పు రావడం వలన ఎంత మంచి జరుగుతుందో అంత కన్నా చెడు కూడా ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. నేటి కాలంలో మొబైల్ ఫోన్‌లలో నెట్ ఉంటే చాలు ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్స్, మరియు వివిధ రకాల ఆన్‌లైన్ యాప్‌లను వినియోగిస్తూ కుటుంబాలు సైతం రోడ్డున పడిన పరిస్థితి లేకపోలేదు. ఆన్‌లైన్ మోసాలతో సైబర్ నేరాలు సైతం ఎక్కువ అవుతూ అమాయక ప్రజలు మోసాలకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరు మొబైల్ ఫోన్‌లను వినియోగించడం సర్వసాధారణమైంది. ముందుందు మొబైల్ వాడకుండా ప్రజలను కట్టడి చేయడం సాధ్యపడడం కష్టతరమనే చెప్పాలి.

**మొబైల్ ఫోన్‌లో రేడియేషన్ పెరిగితే పెద్ద ప్రమాదమే :**

మొబైల్‌ను వినియోగించే సమయంలో ఫోన్‌లో రేడియేషన్ పెరిగితే చాలా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సెల్‌ఫోన్ తరంగాలు మానవ శరీరంలోని కణాలను వేడెక్కించేలా చేస్తాయి. ఎస్ఏఆర్ ప్రకారం రేడియేషన్ కిలోగ్రాముకు 1.6వాట్లకు మించితే ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేడియేషన్ ధాటికి పక్షులు, చెట్లపై కూడా ప్రభావం ఎక్కువగా చూపుతూ ఉండడం తరచూ మనం చూస్తున్న విషయమే. అలాంటి పరిస్థితుల్లో మానవ శరీరంపై ఎంతోగాను ప్రభావం చూపుతుంది. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడం వలన కాంతి కంటిలోకి ప్రవేశించి రెటీనాకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా మొబైల్ ఫోన్‌లు రేడియేషన్ పెరిగి రిపేర్‌కి గురికావడం, కొన్ని మొబైల్‌లు పేలడం వంటి సంఘటనలు సైతం జరుగుతుంటాయి.

**మొబైల్ వినియోగంతో అంతుచిక్కని వ్యాధులకు గురవుతున్న ప్రజానీకం :**

మొబైల్‌ను వినియోగించడం వలన రేడియేషన్ ధాటికి మనిషిలో చర్మ వాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సెల్‌ఫోన్ వినియోగించేవారు ఎంత తక్కువగా వాడితే అంత మేలు అని తెలుపుతున్నారు. ఎన్‌సిబిఐ సర్వే ప్రకారం రేడియేషన్ కారణంగా ముఖంపై మచ్చలు రావడం, కళ్ళ చుట్టూ వలయాల వంటివి వస్తాయి. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడం కారణంగా ఒత్తిడి, మానసిక ఆందోళన, నిద్రలేమి సమస్యలు ఎదురవుతాయని నిపుణులు తెలుపుతున్నారు. కాబట్టి మొబైల్ వలన కలిగే మంచి ప్రయోజనాల కన్నా చెడు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని ప్రజలు ఎంత తక్కువగా మొబైల్ ఫోన్ వినియోగిస్తే అంత ఆరోగ్యంగా జీవిస్తారని నిపుణులు తెలుపుతున్నారు.

**మొబైల్ వినియోగం తగ్గించడమెలా ?**

మొబైల్ వినియోగం తగ్గించేందుకు చాలావరకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటారు. మొబైల్ ఫోన్ వినియోగం తగ్గించేందుకు ఆ సమయంలో వేరే పనులపై దృష్టి మరల్చాలి. ఎక్కువగా పుస్తకాలను చదవడం, కుటుంబ సభ్యులతో గడపడం, వ్యాయామం చేయడం వంటి అలవాట్లను చేసుకోవాలి. ఇప్పటికైనా యువత బాధ్యతలను గుర్తెరిగి మొబైల్ వినియోగం తగ్గించి లక్ష్యాలవైపు అడుగువేయాలని ఆశిద్దాం.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**టంగుటూరు, మార్చి 18, ప్రభాతవార్త**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం టంగుటూరు మండలం మహిళా సమాఖ్య ఆద్వర్యంలో టంగుటూరు హార్టికల్చర్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టంగుటూరు మాజీ సర్పంచ్ బి.జయంతిబాబు, మాజీ ఎంపీపీ సీహెచ్ చంద్ర శేఖర్ రైతు సంఘ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు కామని విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ, మహిళా నాయకులు తోకల భారతి, ఎంపీడీఓ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ ఏసీ కళ్యాణి, ఏపీవో పాల్గొని ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, రాజకీయంగా అభివృద్ధి చెందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ అధ్యక్షురాలు జి.కవిత, ఏపీఎం సుబ్బారావు, సీసీలు వీఓఏలు, వీఓ అధ్యక్షులు పాల్గొన్న వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

## స్పోర్ట్స్ మీట్‌లో సరదాగా.. ఎమ్మెల్యే బిఎన్

**చీమకుర్తి, మార్చి 18, ప్రభాతవార్త**



ఏపీ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2025లో ఎమ్మెల్యే బి. ఎన్. విజయ్‌కుమార్ పాల్గొన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడా పోటీలలో సహచర ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలతో కలిసి సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బి.ఎన్. విజయ్‌కుమార్ సరదాగా ఆడుతూ గడిపారు.

## భవనాల నిర్మాణ పనులు పరిశీలించిన ఎంపి మాగుంట



**ఒంగోలు టౌన్, మార్చి 18, ప్రభాతవార్త**

ఢిల్లీలోని డికెఎస్ మార్గ్‌లో పార్లమెంట్ సభ్యుల కోసం నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ హోదాలో ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

## దూకుడు నిర్ణయాలు అవసరమా

### - చప్పిడి రవిశంకర్ సూటిప్రశ్న

**ఒంగోలు టౌన్, మార్చి 18, ప్రభాతవార్త**



పద్నాలుగు ఏళ్ల క్రితం నాటి జనాభా లెక్కల ఆధారంగా ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ అమలుకు రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించడాన్ని తప్పుబడుతున్నామని జై జనం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి రవిశంకర్ అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం ఒక్క ఉపకులానికి మా త్రమే మేలు చేకూర్చే విధంగా వుందని, దూకుడు నిర్ణయాలతో ఎస్‌సిల ప్రయోజనాలు దెబ్బతీస్తు న్నారన్నారు. ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ అమలులో తెలుగు రాష్ట్రాలలో భిన్న వైఖరులు కనిపిస్తు న్నాయని, ఎస్‌సిల సంక్షేమం కంటే ఎస్‌సిలను విడదీయడం పట్లనే ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నా యన్నారు. విలేకురుల సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిళ్లా వసంతరావు, చిట్టిమాల సంపత్, కృష్ణారావు, జయకుమార్, శ్రీను, ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ చెయిన్ టెక్నాలజీపై వర్క్‌షాప్

**ఒంగోలు టౌన్, మార్చి 18, ప్రభాతవార్త**

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ డెవలప్‌మెంట్‌పై ఐఇఇఇ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఇఇఇ బోర్డు మెంబర్ సాయిప్రశాంత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బ్లాక్ చెయిన్ టెక్నాలజీలో డేటా హ్యాండ్లింగ్ వివరించి విద్యార్థులు సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, హెచ్ఓడిలు డాక్టర్ హిమబిందు, డాక్టర్ సునీత, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ జిఎల్‌వి ప్రసాద్ పర్యవేక్షించారు.




## రాయితీపై వ్యవసాయ పనిముట్లు

**ముండ్లమూరు, మార్చి 18, ప్రభాతవార్త**

మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు వారిగా వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందించేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించిందని తెలిపారు. అందులో భాగంగా పవర్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, రొటోవేటరు, నాగలి, లెవలింగ్ బెడ్లు, విత్తనం ఎరువులు ఎదపెట్టే యంత్రం, గట్లు చెక్కే యంత్రం మొదలైన వస్తువులు రాయితీపై ఇవ్వడానికి ఉన్నాయని తెలిపారు. ముండ్లమూరు మండలానికి గాను 48 వ్యవసాయ పనిముట్లు 7.73 లక్షల రూపాయల రాయితీతో అందించాలని లక్ష్యాలను నిర్ధేశించడం జరిగిందని తెలియజేశారు.

## ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వానికి ప్రకాశం జిల్లా బేడ జంగం సంఘం అభినందనలు

**ఒంగోలు, మార్చి 18, ప్రభాతవార్త**



ఒంగోలు పట్టణంలో స్థానిక ఎంసీఏ భవనమందు బేడ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉద్దండి మల్లికార్జునరావు మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించడం జరిగింది. కూటమి ప్రభుత్వం బేడ జంగాలకు రాష్ట్ర క్యాబినెట్ నందు నిన్న సుదీర్ఘ చర్చలు జరిపి ఎస్సీ వర్గీకరణ నిమిత్తం కులాలను విభజించే ప్రక్రియలో భాగంగా గత కొన్ని సంవత్సరాల నుంచి బేడ జంగం సభ్యులు పడుతున్న ఇబ్బందులను కూడా పరిగణలోకి తీసుకొని వారిని రెల్లి ఉప కులాలుగా బెడజంగాలు చేర్చడం. అలాగే 20వ తేది అది నేషనల్ ఎస్సీ కమిషన్ పంపించడం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల బేడ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉద్దండి మల్లికార్జునరావు ధన్యవాదాలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా బేడజంగంలో చదువుకున్న విద్యార్థులకు కుల సర్టిఫికెట్ లేక ప్రభుత్వ తరఫున వచ్చే అనేక పథకాలను విద్యార్థులకు చేకూరే అనేక వసతులను లేక చాలా ఇబ్బందులు పడటాన్ని రంగరాజు మిశ్రా ఏక సభ్య కమిషన్ ముందల మా యొక్క సమస్యలు చెప్పుకోవటంతో వాటిని పరిగణలోకి తీసుకొని కుల వర్గీకరణలో ఎస్సీఏలో చేర్చటం మాకు ఎంతో మేలు చేసిన వారయ్యారని ప్రభుత్వాన్ని కొనియాడారు. ముందుగా బిఆర్ అంబేద్కర్, అలాగే నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏక సభ్య కమిషన్ చైర్మన్ మిశ్రాకి అలాగే ఎన్నో సంవత్సరాల నుంచి బేడ జంగం కులానికి అహర్నిశలు కష్టపడిన రాష్ట్ర అధ్యక్షుడు దూపం సత్యంకి పాలాభిషేకాన్ని నిర్వహించారు తదనంతరం మీడియా మిత్రులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కోటమి ప్రభుత్వం మా కులానికి చేసిన మేలుకు గుర్తుగా ఈ పాలాభిషేకం చేశామని రానున్న కాలాల్లో మా కులానికి తగు ప్రాతినిధ్యాన్ని కల్పిస్తూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని మేము స్వాగతించడంతోపాటు మా చిరకాల వాంఛ తీర్చినందుకు కూటమి ప్రభుత్వానికి మేం సదా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు 2008 నుండి ఇప్పటివరకు మా పిల్లల భవిష్యత్తు కి ఇబ్బందులు కలిగిస్తున్న ఈ కుల సర్టిఫికెట్లు లేకపోవడంతో చాలా వెనకబడుటతోపాటు ఆర్థికంగా సామాజికంగా చాలా ఇబ్బందులు పడ్డామని ఆ ఇబ్బందులు తొలగించిన కోటమికి ధన్యవాదాలు తెలిపారు మా ప్రాధాన్యత గుర్తించినందుకు ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఎనగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళ పోరాట ఫలితం మాకు దక్కిందని మమ్మల్ని గుర్తించిన ఈ ప్రభుత్వం కి మేము ఎన్నడూ విశ్వాసంగా ఉంటామని రాబోయే కాలాల్లో మా కులానికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా భరోసాగా ఉంటుందని ఈ ప్రభుత్వం మీద మాకు నమ్మకం ఉందని వెల్లడించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రెటరీ మరిపూడి భద్రయ్య, జిల్లా సెక్రెటరీ ఈయనగంటి ఆనందరావు గారు నాటకం శంకర్ రావు, తోట మల్లికార్జునరావు కాకుమాను రవి పడగల చిరంజీవి బూదూరి కిరణ్ కుమార్ మొదలగు వారు పాల్గొన్నారు

## ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి...

**ఒంగోలు, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కే సుమన్, రాష్ట్ర కార్యదర్శి ఈదులముడి మధుబాబు కోరారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో మంగళవారం వారు జిల్లా కమిటీ తో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పరాజు చిన రాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమన్, మధుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీస్ అయినప్పటికీ రాష్ట్రంలో మెప్మా, సెర్ప్ లలో పనిచేసే ఉద్యోగులకు అప్పటి ప్రభుత్వం హెచ్ ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించిందని ప్రస్తుతం అందరూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కీలక ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారని వీరికి భద్రత లేని కారణంగా అనేక ఇక్కట్లు పడుతున్నారని తెలుపుతూ అందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రతతో పాటు, భరోసా కల్పించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల మంత్రివర్గం సమావేశంలో ఆప్కాస్ రద్దు పై వస్తున్న ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుపుతూ ప్రభుత్వం మరల ప్రైవేటు ఏజెన్సీల దోపిడీకి గురి అయ్యేటట్లుగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులను బయటకు నెట్ట వద్దని తెలుపుతూ మెరుగైన విధానాన్ని తీసుకుని వచ్చి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, అలాగే ఆప్కాస్ రద్దు పై ఏర్పడిన అనిచితిని ప్రభుత్వం తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాఘవరావు, రాయుడు, నాగమల్లెస్వర రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యర్రం పిచ్చిమ్మకు ఘనంగా వీడ్కోలు

### - అంతిమ యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

**కొరిశపాడు, మార్చి 18, ప్రభాతవార్త**



స్వర్గీయ యర్రం చినపోలిరెడ్డి సతీమణి యర్రం పిచ్చిమ్మ అంతిమ యాత్ర మంగళవారం మేదర మెట్లలోని వారి స్వగృహం నుండి ప్రారంభమైయింది. అమె సంతానంతోపాటు బంధుమిత్రులు, గ్రామస్థులు ఈ అంతిమయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వర్గీయ యర్రం చినపోలిరెడ్డి సమాధిని వారి వ్యవసాయ కమతంలో ఏర్పాటు చేయగా ఆమె సతీమణి యర్రం పిచ్చిమ్మను కూడ ఆయన సమాధి సమీపంలోనే అంతిమ సంస్కారకార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పిచ్చిమ్మ పార్థివదేహాన్ని వుంచి, అమె కుమారులు అయిన వైవి సుబ్బారెడ్డి, వైవి భద్రారెడ్డి, హనుమారెడ్డిలతోపాటు వారి కుటుంబసభ్యులు కూడ వాహనంపై నుండి అంతిమ యాత్రను వారి వ్యవసాయ భూమి వరకు కొనసాగించి, కార్యక్రమాలను పూర్తి చేశారు.

## కొత్తపల్లి, రాజంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**దర్శి, మార్చి 18, ప్రభాతవార్త**



మండలంలోని కొత్తపల్లి, రాజంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దర్శి మండలం చందలూరు గ్రామ ఏఈఓ శోభారాణి హాజరై రైతులతో ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల గురించి చర్చించారు. క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, గ్రామాల రైతులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ అబ్దుల్ సత్తార్, పూసల శివ, సుధాకర్ పాల్గొన్నారు.

## వాగుపై చప్టాను పరిశీలించిన సీపీఎం బృందం

**ముండ్లమూరు, మార్చి 18, ప్రభాతవార్త**



మండలంలోని మారెళ్ళ గ్రామంలోని ఈదర వాగుపై నేలచప్టాను సీపీఎం బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఈదర వాగుపై బ్రిడ్జిని నిర్మించాలి, వర్షం పడితే రెండు మూడు రోజులు రాకపోకలు లేవు, ప్రమాదాలు జరిగినా రోగాలు వచ్చినా హైస్కూలన విద్యార్థులకు వాగువచ్చి రాకపోకలు అంతరాయం, సాగు చేసే రైతులకు పంట భూముల దగ్గరికి వెళ్ళలేని పరిస్థితి, ఏడు సంవత్సరాల క్రింత పరిశీలన చేసి ఎస్టిమేసన్ వేసి పంపించిన అధికారులు నిధులు కేటాయించని ప్రభుత్వం, ప్రజల ఇబ్బందులు తీర్చాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈదర వాగుపై బ్రిడ్జిని నిర్మించడానికి నిధులు కేటాయించి ప్రజల బాధలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీరావలి వెంకటేశ్వర్లు, శ్రీను, మల్లేశ్వరి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దర్శి ప్రజల ఆకాంక్షల అనుగుణంగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ కల సాకారం - సీఎం చంద్రబాబు హామీ

**దర్శి, మార్చి 18, ప్రభాతవార్త**



దర్శి నియోజకవర్గతెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మంగళవారం అసెంబ్లీ లాబీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలుసుకొని అసెంబ్లీలో ప్రజా సమస్యలపై జరిగిన చర్చలు బడ్జెట్ సమాఏవశాలపై ప్రజల నుండి సానుకూలత వ్యక్తం అవుతున్నట్లు ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ సీఎంకు కూటమి ప్రభుత్వానిక అభినందనలు తెలిపారు. ముఖ్యంగా దొనకొండ ప్రాంతంలో సోలార్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అసెంబ్లీలో ప్రకటన చేయటం పట్ల ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ముందుకు తీసుకెళ్లేందుకు ఆయా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మన ప్రభుత్వం దర్శిలో చేపట్టిన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనులు తిరిగి పునర్ ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో మనం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే దర్శి ప్రాంత అభివృద్ధిలో కీలకమైన అక్కడి ప్రజల ఆకాంక్షలు అనుగుణంగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ నిర్మాణానికి వెంటనే కార్యరూపం దాల్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సంబంధించిన నిధులు మంజూరుకు సిద్ధమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావాల్సి ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు లక్ష్మీ తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాల టైమింగ్స్ మార్పు

**దర్శి, మార్చి 18, ప్రభాతవార్త**



డారక్టర్ ఆదేశాల మేరకు నేటి నుండి అంగన్‌వాడీ కేంద్రాలను ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడుతుందని, ఉదయం స్నాక్స్, మధ్యాహ్నం భోజనం యధావిధిగా జరపాలని సీడీపీఓ సీహెచ్ భారతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## డీవైడర్లపై మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్

**దర్శి, మార్చి 18, ప్రభాతవార్త**



దర్శి పట్టణాన్ని సుందరీకరించే క్రమంలో పట్టణంలోని నాలుగు రోడ్ల డీవైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమం చేశారు. దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అద్దంకి రోడ్డులోని డీవైడర్‌పై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ స్టీఫెన్, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, టీడీపీ నాయకులు దినకర్, రంగా పాల్గొన్నారు.

## ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం

**దర్శి, మార్చి 18, ప్రభాతవార్త**




దర్శి నగర పంచాయతీలోని 2వ వార్డులో ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శి నగర పంచాయతీ చైర్మన్, దర్శి మండల తహశీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్, దర్శి నగర పచాయతీ వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు :ఏవో అబ్దుల్ రఫిక్

**రాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త :**



మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి (ఏవో) షేక్ అబ్దుల్ రఫిక్ తెలిపారు. మండలంలోని సత్యవోలు, గుడిమెట్ట గ్రామాల్లో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తుందని ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్వింటా కందుల ధర రూ.7550లుగా ప్రభుత్వం నిర్ణయించిందని అమ్మదలచు కున్న రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఒక కిలో కందులు శాంపిల్స్ కొరకు రైతు సేవా కేంద్రాలకు ఇవ్వాలని ఆయన తెలిపారు. శాంపిల్‌గా ఇచ్చిన కందులు రైతులు పరిశీలించి ఆ తరువాత ఎప్పుడు కొనుగోలు చేసేది రైతులకు తెలియజేయడం జరుగుతుం దని అన్నారు. కాబట్టి రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాలలో తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేయించి ఒక కిలో కందులు పరిశీలన నిమిత్తం రైతు సేవా కేంద్రాలలో ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ పనిముట్లు కూడా సబ్సిడీపై రైతులకు మంజూరు చేసేందుకు కల్పించిందని అందుకు సంబంధించిన వివరాలు కూడా రైతులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె శివయోగ నందిని, బి సాయి మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూమి సారవంతమవ్వాలంటే పచ్చిరొట్ట విత్తనాలు, జనుము, పిల్లిపెసర పైర్లు వేసుకోవాలి: ఏవో శ్రీనివాసులు

**మార్కాపురం రూరల్, మార్చి 18 ప్రభాతవార్త**



మండలంలోని జమ్మనపల్లి, కోలభీమునిపాడు గ్రామాల యందు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ శాఖాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఆయన రైతులతో కలిసి మిరప పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. జమ్మనపల్లి, కోలభీమునిపాడు గ్రామాల రైతు సేవా కేంద్రాల యందు గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభలలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మే నెల యందు రైతులు తమ పొలాల యందు లోతు దుక్కులు చేసుకోవాలని, భూమి సారవంతమవ్వాలంటే పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పైర్లు వేసుకోవాలని తెలిపారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలు కూడా ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మనపల్లి, కోలభీమునిపాడు రైతు సేవా కేంద్రం సిబ్బంది సంధ్యా, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత

**మార్కాపురం రూరల్, మార్చి 18 ప్రభాతవార్త :**



సబ్కామాలిక్ ఏక్ హై అందరి దేవుడు ఒక్కరే అనే నినాదంతో మానవసేవే మాధవ సేవగా భావించి నిరుపేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో మనం ఖర్చు చేసే ప్రతి రూపాయి పేదవారి చెంతకు చేరాలనే ఆశయంలో భాగంగా మంగళవారం మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ సైదాబీ ఇమామ్ కుటుంబానికి చెన్నుపల్లి కాశయ్య, మహమ్మద్ రసూల్‌లు ఆర్థిక సహాయం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. దురదృష్టవశాత్తు సైదాబీ క్రిందపడి నడుము దగ్గర కాలు విరిగి మంచానికి పరిమితమై వారి భర్త ఏ పని చేసుకోలేక భార్యను చూసుకుంటూ ఇంటి దగ్గరే ఉంటూ వచ్చే పింఛన్ మీద ఆధారపడి అద్దె కట్టుకుంటూ తినడానికి కూడా చాలా ఇబ్బందికరంగా మారడంతో వారి జీవన ఆర్థిక పరిస్థితి బ్రతుకు జట్కాబండిగా మారింది. సహాయం చేసేవారు లేక సతమతమవుతున్న తరుణంలో సహాయం చేయమని కోరగా వెంటనే స్పందించి రంజాన్ మాసం సందర్భంగా షేక్ మహమ్మద్ రసూల్ వారి ధర్మపత్ని నసీమాల ఆర్థిక సహాయం అందించారు. ఈ మహోన్నతమైన సేవా కార్యక్రమానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించిన మహమ్మద్ రసూల్, నసీమాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఎవరైనా దాతలు ఇటువంటి నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయాలన్నచో 9603580633నెంబర్‌ను సంప్రదించాలని హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య తెలియజేశారు. ఇటువంటి నిరుపేద పేద ప్రజలకోసం 24/7తనవంతుగా సహాయం చేస్తూ, చేపిస్తూ సిద్ధంగా ఉంటారని తెలియజేశారు. ఈ మహోన్నతమైన సేవా కార్యక్రమంలో మహమ్మద్ రసూల్, నసీమా మరియు హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు పిఎఫ్ డబ్బులు ఇప్పించాలి - సిఐటియు డిమాండ్

**ఒంగోలు టౌన్, మార్చి 18, ప్రభాతవార్త**



రాష్ట్ర పౌర సరఫరాల సంస్థలో హమాలీలుగా పనిచేసి రిటైర్ అయిన, మానుకున్న, మరణించిన వారికి పిఎఫ్ డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ పిఎఫ్ డబ్బులు కోసం తిప్పుకుంటూ ఇబ్బందులు పెడుతున్నారని, తక్షణమే చెల్లించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు.

## రాష్ట్ర ధర్నా జయప్రదం చేయాలి - తాళ్లూరి వెంకటేశ్వర్లు పిలుపు

**ఒంగోలు టౌన్, మార్చి 18, ప్రభాతవార్త**

సచివాలయ హెల్త్ సెక్రటరీల రాష్ట్ర ధర్నా జయప్రదం చేయాలని యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలకు వైద్య ఆరోగ్యశాఖ పనులు మాత్రమే, యాప్‌ల భారం, ఎఫ్ఆర్ఎస్ నుండి మినహాయింపు తదితర డిమాండ్‌లపై యునైటెడ్ విలేజ్, వార్డు హెల్త్ సెక్రటరీల ఆధ్వర్యంలో ఈ నెల 20న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా జరుగుతుందని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి న్యాయమైన డిమాండ్‌లు సాధించుకుంటామన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి - ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ డిమాండ్

**ఒంగోలు టౌన్, మార్చి 18, ప్రభాతవార్త**



సమస్యల పరిష్కారానికి ఉద్యమించేందుకు సిద్ధం కావాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, మధుబాబు పిలుపునిచ్చారు. స్థానిక రెవిన్యూ భవన్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పరాజు చినరాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సెర్ప్, మెప్మా మాదిరి హెచ్‌ఆర్ పాలసీ అమలు, ఆప్కాస్ రద్దుపై అనిశ్చితి తొలగించి ఉద్యోగ భద్రత అంశాలపై రాజీ పడేది లేదన్నారు.

## వెలుగొండలో తిరుణాల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్సై రాజ్‌కుమార్

**కొనకనమిట్ల, మార్చి 18, ప్రభాతవార్త**



మండలంలోని వెలుగొండ శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 21,22,23వ తేదీల్లో వరుసగా గరుడ, గజ, రథోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. తిరుణాల (గజోత్సవం) నాడు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎస్సై రాజ్ కుమార్ వెలుగొండ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రభలు ఏర్పాటు చేసే స్థలాలను, ఆలయ ప్రాంగణంలో క్యూలైన్ ఏర్పాట్లను ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కుందురు కాశిరెడ్డి కలిసి పరిశీలించారు. దూరంలో వాహనాలు నిలిపే స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వివిద సూచన లు చేశారు. తిరుణాల సందర్భంగా ట్రాఫిక్ విషయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో వెలుగొండ వెంకటేశ్వరస్వామి తిరుణాల జరుపుకోవాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సై చెప్పారు.

## మే10నుండి అంకమ్మ తల్లి కొలుపులు

**నాగులుప్పలపాడు, మార్చి 18, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు మండల కేంద్రంలో అనాదిగా వస్తున్న వడ్డి రాజుల ఆరాధ్య దైవం శ్రీ అంకమ్మ తల్లి కొలుపులు మే 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గుంజి కొండయ్య కమిటీ సభ్యులు తెలియజేశారు. ప్రతి మూడేళ్ళకు ఒక సారి అత్యంత వైభవోపేతంగా నిర్వహించే ఈ కొలుపులకు పొరుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాలలో ఉన్న భక్తులు, భాగస్వాములు హాజరై కొలుపులను నిర్వహించాలని కోరారు.

## గుళ్లాపల్లి హైస్కూల్‌లో 10 వేల నగదు దొంగతనం

**మద్దిపాడు, మార్చి 18, ప్రభాతవార్త**



గుర్తు తెలియని వ్యక్తులు బీరువా పగలగొట్టి పది వేల రూపాయల నగదును దొంగిలించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకార మండల పరిధిలోని గుళ్లాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలోని ప్రధానోపాధ్యాయులు నిర్వహణ కార్యాలయ ంనందు బీరువాను పగలగొట్టి గుర్తు తెలియనటువంటి వ్యక్తులు పాఠశాల నిర్వహన ఖర్చులు నిమిత్తం బీరువాలో ఉంచినటువంటి పది వేల రూపాయలను దొంగిలించినట్లు పాఠశాల సిబ్బంది గుర్తించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల నిర్వహణ కార్యాలయం నందు కంప్యూటర్లు, క్రీడా సామాగ్రి, తదితర ఇతర సామాగ్రి ఉన్న వారు వాటి జోలికి పోకుండా కేవలం బీరువాను పగలగొట్టి పది వేల రూపాయలు నగదును తీసుకొనిపోవటం ఏమిటని..? దొంగతనానికి వచ్చినటువంటి వ్యక్తులు కార్యాలయంలోని కంప్యూటర్లు ఇతర సామాగ్రిని కూడా ఎత్తుకెళ్లే పరిస్థితి ఉంది. కానీ కేవలం బీరువాలోని పది వేల నగదు దొంగిలించి పోవటం అనుమానాన్ని కలిగిస్తుంది. ఈ దొంగతనం కేవలం ఆ పరిసరాలను పరిశీలించినటువంటి వ్యక్తులే చేసి ఉండవచ్చునని అనుమానం.. దీనిపై స్థానిక గుళ్లాపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ ప్రభాకర్ స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై బి.శివరామయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దళిత పేట ధరిచేరని సాగర్ జలాలు

**హనుమంతునిపాడు, మార్చి 18, ప్రభాతవార్త**



హనుమంతునిపాడు మండలం వీరాంపురం గ్రామంలో దళిత పేటలో గుండా సాగర్ జలాలు పైపులైన్ పోతున్నప్పటికి దళితులకు మాత్రం నీరు దక్కడం లేదని మండల సీపీఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ రోజు వీరరామపురం గ్రామంలో పర్యటించి వీరు ప్రజా సమస్యల పరిశీలనలో భాగంగా సాగర్ జలాల సమస్య యొక్క తీవ్రతను మా దృష్టికి ప్రజలు తీసుకువచ్చారని తెలిపారు. సుమారు 50 కుటుంబాలు ఉండేటువంటి దళితపేటలో దళితుల నివాస ప్రాంతాల మధ్య గుండా సాగర్ పైపులైన్ గ్రామంలోకి పోతుంది గ్రామంలో ట్యాంకు ద్వారా నీటి సరఫరా పైపులైన్ ద్వారా జరుగుతుందని చెప్పారు. దళితులు మాత్రం సాగర్ జలాలలో వివక్షతను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుమారు ఏడు సంవత్సరాల నుండి అధికారుల దృష్టికి సమస్యని తీసుకుపోయినప్పటికి నేటికి పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తపరిచారు. గ్రామంలో పైపులైన్‌కు రెండు వీధి కుళాయిల కనెక్షన్ ఇచ్చినా సమస్య పరిష్కారం అవుతుందని పరిష్కారం చిన్నదైనప్పటికి దళితుల అభివృద్ధి పట్ల పాలకవర్గాలకు ఉన్న ప్రేమ ఇంత కఠినంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని సాగర్ జాలాలు దళితులకు అందేలాగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, కొండేపోగు రాబట్టు, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## కే.అగ్రహారంలో కిమ్స్ వైద్య శిబిరం విజయవంతం

**పొన్నలూరు, మార్చి 18, ప్రభాతవార్త**



మండలంలోని కే.అగ్రహారం గ్రామంలో రామాలయం ఆవరణలో మంగళవారం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి వివిధ వ్యాధులు సంబంధించి 121 ఓపీలు వచ్చినట్లు వారు తెలియజేశారు. కంటికి సంబంధించి, ఎముకలు, కీళ్ల నరములు, సాధారణ వ్యాధుల రోగులకు వివిద టెస్టులు చేసి అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ రామాంజనేయులు, హైందవి, కిరణ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ వెంకట నీలాద్రి, సర్పంచ్ చిన్న మస్తాన్, రమణయ్య గ్రామంలో నాయకులు, రోగులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రికరణ పథకానికి రూ.8.85 లక్షలు కేటాయింపు

**కొనకనమిట్ల, మార్చి 18, ప్రభాతవార్త**

మండలానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రూ.8,857 లక్షలు కేటాయించారని మండల వ్యవసాయాధికారి కే.ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. రైతులకు అవసరమైన నాలుగు రకాల పరికరాలని 50 శాతం లేదా ప్రభుత్వం నిర్ణయించిన రాయితీపై అందజేస్తారని ఇందులో 13 రకాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు కేటాయించడం జరిగింది. పరికరాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకానికి చిన్న, సన్న కారు రైతులు మాత్రమే అర్హులు. గత మూడు సంవత్సరాలలో ఏదో ఒక సీజన్‌లో పంట నమోదు చేసుకుని ఉండాలన్నారు.

## ఏపీజీబీ సీనియర్ మేనేజర్‌కు ప్రశంసా పత్రం

**బల్లికురవ,మార్చి 18, ప్రభాతవార్త**



స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్, కే.సీనానాయక్‌కు ప్రత్యేక ప్రశంసా పత్రం, ప్రత్యేక గుర్తింపు లభించింది. డీఆర్ఏ పీడీ విజయలక్ష్మి మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రం అందజేశారు. స్వయం సహాయక సంఘాలకు రూ.20కోట్ల రూపాయల మేర రుణాలు అందజేయడం, లిక్ పత్ డీది కింద రూ.20లక్షల రుణాలు అందజేయడంతో బాపట్ల జిల్లాలో అత్యధిక రుణాలు అందజేసిన బ్రాంచిగా బల్లికురవ రికార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా శీనా నాయక్‌ను బ్యాంకు సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

## 20న ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసనకు తరలి రావాలి

**సీఎస్‌పురం, మార్చి 18, ప్రభాతవార్త**



వెలుగొండ ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన కనిగిరిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని చెర్లోపల్లి, అరివేముల, ఉప్పలపాడు, నల్లమడుగుల, పుల్లగూరపల్లి, అనికాలపల్లి, కోవిలంపాడు, కంభంపాడు, పెద్దరాజుపాలెం, చింత పూడి, ఆర్కేపల్లి, కే.అగ్రహారం, పెద్దగోగులపల్లి, వెంగనగుంట తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాలలో మంగళవారం సీపీఎం పార్టీ జీపు తాజా కార్యక్రమం చేపట్టి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెలుగొండ ప్రజాఎక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని, త్రిబుల్ ఐటీ కాలేజీని పామూరు మండలం దూబగుంట్ల వద్ద నిర్మించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ కనిగిరి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మండలం సస్యశ్యామలం కావాలన్నా, వ్యవసాయానికి నీటి కొరత తీరాలన్నా, తాగునీటి సమస్య తీరాలన్న వెలుగొండ ప్రాజెక్టును సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టు పూర్తి చేయడంలో రాజకీయ నాయకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రజలు పోరాటాలు, ఆందోళనలు చేస్తే తప్ప ఈ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదన్నారు. కావున ఈనెల 20న కనిగిరి ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమంలో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, అంకేపల్లి వెంకటేశ్వరరెడ్డి, పొదిలి నరసింహులు, జి.ఏసుదాసు, బి.యేసురత్నం, పి.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## చుక్కల లోకం చూసొచ్చాన నాగంబొట్లపాలెం విద్యార్థిని

**తాళ్లూరు, మార్చి 18, ప్రభాతవార్త**

అంతరిక్ష విశేషాలు తెలుసుకుని అబ్బురపడ్డారు. రాకెట్ ప్రయోగశాల తీరుతెన్నులు గమనించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చుక్కల లోకపు వింతలు గుర్తింపు మంత్ర ముగ్ధులయ్యారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ ఆదేశాల మేరకు జిల్లాలోని 80 పాఠశాలలకు చెందిన 140 మంది విద్యార్థులు ఈనెల 14న శ్రీహరి కోటలోని షార్ కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు నింపింది. అంతరిక్ష ప్రయోగాలు, సాంకేతికత గురించి అవగాహన చేసుకున్నారు. శ్రీహరికోటలోని షార్ కేంద్రాన్ని సందర్శించడానికి జిల్లాలో 140 మంది విద్యార్థుల్లో నాగులుప్పలపాడు మండలంలో అమ్మనబ్రోలు గురుకుల పాఠశాలలో చదువుతున్న తాళ్లూరు మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామానికి



చెందిన రావినూతల పరిశుద్ధరావు కుమార్తె రావినూతల ఏలీ రాజ్య వర్షితకి అవకాశం దక్కింది. వర్షితను పలువురు అభినందించారు.

## ప్రకృతి విపత్తుల సమయంలో విద్యుత్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి

- బీసీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ సభలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

**బల్లికురవ, మార్చి 18, ప్రభాతవార్త**



ప్రకృతి విపత్తులు, ఆపత్కాల సమయాల్లో విద్యుత్ శాఖ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సచివాలయంలో ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను మాజీ విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావుతో కలిసి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో, సంస్థాగతంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావుఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విజయవాడ బుడమేరు వరదలు, తుఫానుల సమయంలో ప్రాణాలకు తెగించి విధి నిర్వహణలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని మంత్రి గొట్టిపాటి ప్రశంసించారు. వైసీపీ ప్రభుత్వ తప్పిదాలతో నిర్వీర్యమైన విద్యుత్ వ్యవస్థను ఉద్యోగుల సహాయంతోనే మరలా గాడిలో పెడుతున్నామని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తమ హక్కులను కూడా కోల్పోయారని కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తమ సమస్యలు పరిష్కారం అవుతాయనన్న నమ్మకం ఏర్పడిందని సంఘం నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నేత కేశవ శంకరరావు, ఉపాధ్యక్షులు జి.రాము, సెక్రటరీ ఫైనాన్స్ ఎస్.వెంకటేశ్వర్లుతో పాటు ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన సంఘం నేతలు పాల్గొన్నారు .

## అంగన్‌వాడీ బడి వేళలో మార్పు

**బల్లికురవ, మార్చి 18, ప్రభాతవార్త**

పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా పిల్లల భద్రత దృష్ట్యా మంగళవారం నుండి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒంటిపూట బడులు నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని సీడీపీఓ సుధా అన్నారు. ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు పిల్లలకు ప్రీ స్కూల్ నిర్వహించాలి. మధ్యాహ్నం భోజనంఖచ్చితంగా ఇవ్వాలి. ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మార్టూరు, మార్చి 18, ప్రభాతవార్త**



మార్టూరు మండలం ఇసుక దర్శి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కర్ బాలికలకు ఆరోగ్యం పౌష్టికాహారం శానిటేషన్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకుంటూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రక్తహీనత కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సబ్సిడీపై జింక్, జిప్సం

**మార్టూరు, మార్చి 18, ప్రభాతవార్త**




మార్టూరు మండల పరిధిలోని చిమ్మిరిబండ, ద్రోణాదుల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి అంజిరెడ్డి నిర్వహించారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. జింక్, జిప్సం సబ్సిడీపై సరఫరా చేయాలని రైతులు కోరారు. గ్రామాల్లో ఇంకా 300 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని, వారు త్వరగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి

**వెలిగండ్ల, మార్చి 18, ప్రభాతవార్త**




వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువు, కమ్మపాడు గ్రామాల్లో వ్యవసాయశాఖ వారి పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. రైతులు ఖరీఫ్ సీజన్లో పండించిన కంది పంటను ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పరిచిన కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్ముకోవాల్సిందిగా రైతులకు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర కంది క్వింటాలకు రూ.7550 నిర్ణయించింది. కనుక రైతులు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ స్కీమ్ నందు ఎవరికైనా 19 ఇన్స్టాల్మెంట్ నగదు జమ కానిచో వారు సంబంధిత రైతు సేవ కేంద్రంలో సమాచారం తెలిపి సమస్యను పరిష్కరించుకోవచ్చని వివరించారు. ప్రతి రైతు ఏపీ ఎఫ్ఆర్ పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేపించుకొని ఫార్మర్ సెంట్రల్ ఐడీను పొందాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు జరిగే అన్ని ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే రైతు నమోదు సంఖ్యను ఖచ్చితంగా అమలు చేస్తారని తెలిపరిచారు.

## పని ఒత్తిడి నుండి ఉపశమనం కల్పించమంటున్న పంచాయతీ కార్యదర్శులు

**చిన్నగంజాం, మార్చి 18, ప్రభాతవార్త**



ప్రస్తుతం రాష్ట్రం నందు గల పంచాయతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు అమలుపరుచు సెలవు దినాలు కానీ, పండుగ దినాలు కానీ వినియోగించుకోవడానికి ఏ మాత్రం అవకాశం లేక, కుటుంబ సభ్యులతో సమయం గడపలేక వివిధ రకాలైనటువంటి అనారోగ్యాలకు గురి అవుతూ తీవ్రమైనటువంటి పని ఒత్తిడి పని భారం/ పని ఒత్తిడికి గురి అవుతున్నారు. పంచాయతీ కార్యదర్శులపై పడుతున్న అధిక పని భారం వలన గ్రామ పంచాయతీ పరంగా నిర్వహించాల్సిన ముఖ్యమైన ప్రాధమిక విధులు, ఇంటి పన్ను వసూళ్లు, లైసెన్స్ వసూళ్లు, వేలం పాటలు, పారిశుధ్య నిర్వహణ ఇలాగ 26 రకాలైన ప్రాథమిక విధులతో పాటు గ్రామం పంచాయతీ, గ్రామ మీటింగ్‌లు, అధికారుల విజిట్స్, పాలకవర్గంతో రాజకీయ నాయకులతో సమన్వయం వంటి వివిధ రకాలైన విధులతో పాటు గ్రామ సచివాలయం ద్వారా నిర్మించే వివిధ రకాల సర్వేలు సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, హౌస్ వైఫ్ జియో టాకింగ్, పి ఫోర్ సర్వే ఇలాగ 14 సర్వేలు నిర్వహిస్తూ ఎటువంటి వెసులుబాటు లేక వ్యక్తిగతంగాను, అనారోగ్యపరంగాను పంచాయతీ కార్యదర్శులు ఎంతో నష్టపోతున్నందున పంచాయతీ కార్యదర్శిలపై నుండి అధిక పని ఒత్తిడి, పని భారం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కే.అంజిబాబు, కే.బాబురావు, నాగేంద్రబాబు, ఉషారాణి, సునీత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన ప్రపంచ సామాజిక సేవ దినోత్సవం

**చిన్నగంజాం, మార్చి 18, ప్రభాతవార్త**



ప్రపంచ సామాజిక సేవా దినోత్సవం సందర్భంగా చిన్నగంజాం మండలం మంగళవారం ఈ సామాజిక సేవా కర్త దివ్యాంగుడు ఈ గోవిందస్వామి హెల్త్ పరంగా పల్స్ పోలియోన జరిగిన ప్రోగ్రామ్స్‌లో పాల్గొని అందించిన సేవలను గుర్తించి స్టాఫ్ నర్సు అయినా మస్తాన్‌బి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు మస్తాన్‌బి, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

## చీమకుర్తి పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.124/2022/ఎ1 తేదీ:18.03.2025

**బహిరంగ వేలము నోటీసు**

చీమకుర్తి పురపాలక సంఘంకి చెందిన దినవారి మార్కెట్ మరియు జంతు వధవాల, రుసుములు 2025-26 సంవత్సరమునకు అనగా పాట ఖరారు అయిన తేది నుండి తేది 31.03.2026 వరకు వసూలు చేసుకునే హక్కు తేది.24.03.2025 సోమవారం ఉదయం 11.00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయము నందు బహిరంగ వేలము నిర్వహించబడను.

| వ.నెం. | మార్కెట్లు మరియు జంతు వధవాల పేర్లు | దాఖలు చేయవలసిన సాల్వేన్సి మొత్తము | ధరావత్తు |
|---|---|---|---|
| 1 | దినవారి మార్కెట్ | 2,00,000/- | 50,000/- |
| 2 | జంతు వధవాల (కభేళ) మరియు మాంసము, చేపల మార్కెట్ల రుసుము వసూలు చేసుకొనే హక్కు | 1,00,000/- | 25,000/- |

పై నమోదు పరచిన మార్కెట్లు యొక్క బహిరంగ వేలము పాటలు మునిసిపల్ కమీషనరు గారిచే గాని, వారి అనుమతి పొందిన అధికారిచే గాని నిర్వహించబడును. వేలం పాటను రద్దుచేయుటకు మరియు తిరిగి వేలము నిర్వహించుటకు కమీషనరు వారికి అధికారము కలదు. ఇతర వివరములు ఈ కార్యాలయపు పనివేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

**కమీషనరు, చీమకుర్తి పురపాలక సంఘం**

19-3Pg5.qxd:19-3Pg5.qxd 01/01/01 7:07 AM Page 1



# గాజాపై మళ్లీ ఇజ్రాయెల్ భీకర దాడులు

## 300 దాటిన మృతుల సంఖ్య



**టెల్ అవీవ్, మార్చి 18:** ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవడంతో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఓవైపు కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపుపై చర్చలకు సిద్ధమవుతుండగా.. గాజాపై టెల్అవీవ్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. సోమవారం రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో జరిపిన ఈ భీకర దాడుల్లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటి వరకు కనీసం 330 మంది మృతి చెందినట్లు గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ వెల్లడించింది. మృతుల్లో అత్యధికంగా మహిళలు, చిన్నారులే ఉన్నట్లు ఏజెన్సీ పేర్కొంది. ఈ దాడుల కారణంగా మరో 150 మందికిపైగా గాయపడినట్లు తెలిపింది. ఖాన్‌యూనిస్, రఫా, ఉత్తర గాజా, గాజాసిటీ ప్రాంతాల్లో ఈ వైమానిక దాడులు చోటుచేసుకున్నాయి. గాజా స్ట్రిప్‌లో జరిగిన దాడుల్లో హమాస్ పోలీసు, ఇంటర్నల్ సెక్యూరిటీ హెడ్ మహ్మద్ అబు వత్ఫా కూడా మరణించినట్లు తెలిసింది.

**ఒప్పందాన్ని అంగీకరించకపోవడం వల్లే..**

దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులకు ఆదేశించినట్లు తెలిపారు. 'మా బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోంది. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రతిపాదించిన కాల్పుల ఒప్పందం కొనసాగింపును తిరస్కరించింది. ఈ నేపథ్యంలోనే దాడులకు ఆదేశించాం. యుద్ధం లక్ష్యాలను సాధించడానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటి నుంచి హమాస్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**తూర్పు గాజాను ఖాళీ చేయండి..**

అటు ఐడీఎఫ్ కూడా దీనిపై ప్రకటన చేసింది. హమాస్ ఉగ్ర ముఠాకు చెందిన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే భీకర దాడులకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. మరోవైపు, హమాస్ నుంచి ప్రతీకర దాడుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గాజా సరిహద్దు ప్రాంతాల్లోని స్కూళ్లను మూసివేయాలని ఇజ్రాయెల్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ దాడుల దృష్ట్యా తూర్పు గాజాలోని ప్రజలు తక్షణమే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ మిలిటరీ ఆదేశించింది. ఆ ప్రాంతంలో మరిన్నిదాడులు చేపడుతామని హెచ్చరించింది.

తాజా పరిణామలను హమాస్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులతో ఇజ్రాయెల్ తమ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి బందీల ప్రాణాలను ప్రమాదంలో పడేసిందని పేర్కొంది. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఇటీవల ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. దాదాపు 30 మందికిపైగా తమ చెరలోని బందీలను మిలిటెంట్ సంస్థ విడుదల చేయగా.. ప్రతిగా 2 వేల మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఈ క్రమంలోనే రెండో దశ కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరగాల్సి ఉంది. అయితే, అవి అమలు దిశగా అడుగులు పడలేదు. మరోవైపు రంజాన్ నేపథ్యంలో తొలి దశ ఒప్పందాన్ని ఏప్రిల్ 20 వరకు కొనసాగించాలని అమెరికా ప్రత్యేక రాయబారి ప్రతిపాదించారు. దీనికి టెల్అవీవ్ అంగీకరించగా.. హమాస్ నిరాకరించింది.

ఈ నేపథ్యంలో హమాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు నెతన్యాహు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా గాజాకు వెళ్లే మానవతా సాయాన్ని అడ్డుకోవడంతో పాటు కరెంటు సరఫరాను ఇజ్రాయెల్ నిలిపివేసింది.



# బలోచ్ వేర్పాటువాదుల అణచివేతకు చైనా బలగాలు?

**బీజింగ్, మార్చి 18:** పాకిస్థాన్‌లో బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులు పెరుగుతున్న వేళ చైనా కీలక చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. బీజింగ్‌కు చెందిన ప్రైవేటు భద్రతా దళాలను పాక్‌కు మద్దతుగా మోహరించాలన్నది దీని సారాంశం. ఇటీవల సీపెక్ ప్రాజెక్టులోని వర్కర్లను, ఇంజినీర్లను కాపాడేందుకు తమ దేశానికి చెందిన ప్రైవేటు భద్రతా బృందాలు, మిలిటరీ సిబ్బందిని నియమించేందుకు వీలుగా ఓ ఒప్పందంపై సంతకం చేసింది. దీని కింద డెవ్వె సెక్యూరిటీ ఫ్రాంటియర్ గ్రూప్, చైనా ఓవర్సీస్ సెక్యూరిటీ గ్రూప్, హుయాక్సిన్ ఝూంగ్‌షాన్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థలు పాక్‌లోని చైనా జాతీయుల భద్రతను పర్యవేక్షించనున్నాయి. బలోచ్ తిరుగుబాటుదారుల దాడుల నేపథ్యంలో చైనా జాతీయుల భద్రత ప్రధానంగా మారింది. గత ఏడాది ఇద్దరు చైనా జాతీయులపై ఆత్మాహుతి దాడి జరిగిన విషయం తెలిసిందే. తాజాగా బిఎల్ఎ కార్యకలాపాలు ఊపందుకున్న నేపథ్యంలో పాక్‌లో బీజింగ్ దళాలను మోహరించే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రాంతంలో చైనా బలగాల మోహరింపులో ఇది కీలక అడుగుగా మారనుంది.

మరోవైపు పాక్-చైనా సంయుక్త సెక్యూరిటీ కంపెనీ ఏర్పాటు చేయాలని బీజింగ్ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. సీపెక్‌లోని ప్రాజెక్టులు, ఉద్యోగుల రక్షణ బాధ్యతల కోసం దీనిని వినియోగించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో యాంటీ టెర్రరిజం కోఆపరేషన్ అగ్రిమెంట్‌పై సంతకం చేయాలని చైనా కోరుతోంది. ఇదే జరిగితే డ్రాగన్ సైన్యం అధికారికంగా అడుగుపెట్టేందుకు అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్‌లో దాదాపు 30 వేల చైనా జాతీయులు పనిచేస్తున్నారు. వారి భద్రతే ప్రధానఅంశంగా మారింది. ముఖ్యంగా బలోచిస్థాన్, గ్వదార్ ప్రాంతాల్లో ముప్పు మరింత తీవ్రంగా ఉంది.



## దిహులి మారణకాండలో ముగ్గురు నిందితులకు మరణశిక్ష

### ప్రయాగరాజ్ సెషన్స్‌కోర్టు సంచలన తీర్పు

**ఫిరోజాబాద్(యూపి), మార్చి 18:** దాదాపు 44 ఏళ్లనాటి దళితుల సామూహిక హత్యల కేసులో ప్రత్యేక కోర్టు ముగ్గురు దోషులకు కోర్టు మరణశిక్ష విధించింది. ఇద్దరు దోషులకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు, మరో దోషికి రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. ఫిరోజాబాద్‌లోని జస్రానాలోని దిహులి గ్రామంలో 1981 నవంబర్ 24న జరిగిన 24మంది దళితుల ఊచకోత కేసులో కోర్టు తీర్పును వెల్లడించింది. ఆ తర్వాత నిందితులను మైన్‌పురి జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసులో నిందితులైన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంప్‌లను భారీ భద్రత మధ్య మెయిన్‌పురి జిల్లా నుంచి పోలీసులు ఉదయం 11.30 గంటలకు ఏడీజే స్పెషల్ రాబరీ ఇందిరా సింగ్ కోర్టులో హాజరు పరిచారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున రోహిత్ శుక్లా కోర్టు ఎదుట వాదనలు వినిపించారు. మారణ హోమం కేసులో సాక్ష్యాలను పరిశీలించి.. నిందితులకు మరణశిక్ష విధించాలని కోర్టును కోరారు. కేసులో వాదనలు విన్న కోర్టు దోషులుగా తేలిన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంపాల్‌కు మరణశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. న్యాయమూర్తి తీర్పును ప్రకటించిన తర్వాత ముగ్గురు దోషులు కోర్టులోనే విలపించారు. వారి బంధువులు సైతం కంటతడిపెట్టారు. కోర్టు నిందితులకు 30 రోజుల్లోగా మరణశిక్షకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. కోర్టుతీర్పు నేపథ్యంలో 14 రోజుల పాటు దోషులు జైలులోని క్వారంటైన్ బ్యారక్‌లో ఉండనున్నారు.

## పిస్టల్‌తో వైష్ణోదేవి ఆలయంలోకి భక్తురాలు

**జమ్ము, మార్చి 18:** ఢిల్లీనుంచి వచ్చిన ఒక భక్తురాలు లోడెడ్ పిస్టల్‌తో వైష్ణోదేవి ఆలయంలోకి ప్రవేశించడం వివాదాస్పదం అయింది. ఆలయంలో భద్రత కొరవడిందని భక్తులు మండిపడుతున్నారు. జమ్ములోని రైజీజిల్లా త్రికూట పర్వతంపై నెలకొన్న మాతా వైష్ణోదేవి ఆలయాన్ని లక్షలాదిగా భక్తులు దర్శనానికి వస్తుంటారు. జ్యోతి గుప్తా అనే రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ ఆరు రౌండ్ల గుళ్లతో ఉన్న పిస్టల్‌ను తీసుకుని వచ్చింది. ఈనెల 14-15 తేదీల్లో తెల్లవారు జామున గుప్తా ప్రధాన మందిరం చెక్‌పాయింట్ వద్ద తనిఖీల్లో బయటపడింది. అధికారుల వివరాలప్రకారం గుప్తాకు ఉన్న తుపాకి లైసెన్స్ రెండేళ్లక్రితమే కాలంచెల్లిందని అధికారులు తెలిపారు. ఈ మహిళ ఢిల్లీ పోలీస్ శాఖలో పనిచేస్తున్నట్లు చెప్పిందని భద్రతా అధికారులు చెప్పారు. ఎస్పీ పరమీందర్‌సింగ్ మాట్లాడుతూ ఢిల్లీ మహిళను అరెస్టు చేసామని, అయితే విచారణలో ఆమె ఢిల్లీపోలీస్‌శాఖలో పనిచేయడం లేదని తేలిందన్నారు. ఆమె తుపాకీకి లైసెన్స్ ముగిసిపోయిందని, రైజీ పోలీసులు ఆమెను అరెస్టు చేసి తుపాకిని స్వాధీనంచేసుకున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి ఖాత్రాలోని భావన్‌పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించి కేసునమోదయిందన్నారు. ఆయుధచట్టం కింద కూడా మరో కేసునమోదు చేసినట్లు ఎస్ఎస్‌పీ చెప్పారు.

# ప్రభుత్వ సిబ్బంది ఖాతాల్లోకి ప్రకృతి వైపరీత్యాల నిధులు

## రూ.23.81 కోట్ల నిధులు మళ్లింపు జరిగిందని కాగ్ చురకలు

**భోపాల్, మార్చి 18:** ప్రకృతి వైపరీత్యాల్లో బాధిత కుటుంబాలకు సాయం అందించేందుకు కేటాయించిన 23.81 కోట్ల సొమ్ములు ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాల్లోకి మళ్లించారని నిబంధనలకు విరుద్ధమని కమ్‌ట్రోలర్ ఆడిటర్‌జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ప్రభుత్వ ఉద్యోగులు, వారి బంధువులు, ఇతర అనధికారిక, అర్హతలేని వ్యక్తులకు 13 జిల్లాల్లో ఈ పంపిణీజరిగిందని కాగ్ తన నివేదికలో పొందుపరిచింది. మధ్యప్రదేశ్‌లోని 13జిల్లాలు అంటే సియోని, షియోపూర్, సేహోర్, శివ్‌పురి, దేవాస్, ఛతార్‌పూర్; ఖాండ్వా, మంద్‌సౌర్, రైసెన్, దామోహ్, సాత్నా, అగర్ మాల్వా, విదిశా జిల్లాల్లో ఈ అక్రమ పంపిణీలు జరిగినట్లు కాగ్ వెల్లడించింది. మొత్తంలో 238.81 కోట్లు, 21.14 కోట్లు సొమ్ములను అనధికారిక, అనర్హుల ఖాతాల్లోకి మళ్లించారని, 2.67 కోట్లు మాత్రం ప్రభుత్వ ఉద్యోగులు, వారి బంధువుల ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది. వాస్తవానికి ఈ సొమ్ము ప్రకృతి వైపరీత్యాల్లో సర్వం కోల్పోయిన బాధితులు, ఉరుములు, పిడుగుపాటుకు మృతిచెందినవారు. తుపానులు, కరవు కాటకాల్లో బాధితులు, వర్షాలు, వరదలు, ప్రమాదాలకు గురయిన బాధిత కుటుంబాలతో పాటు పాముకరిచి మృతిచెందిన కుటుంబాలకు అందించాల్సిన సాయం నిధులు అని కాగ్ తేల్చింది. ప్రభుత్వ సిబ్బంది గ్లోబల్ బడ్జెట్ వ్యవస్థలో ఉన్న అవకతవకలను ఆసరాగా చేసుకుని సమీకృత ఆర్థిక పర్యవేక్షణ సమాచార వ్యవస్థలోని లొసుగుల ఆధారంగా సొమ్ముచేసుకున్నట్లు తేలింది. బోగస్ మంజూరు ఉత్తర్వులను సిద్ధంచేసి బోగస్ లబ్దిదారులను కూడా ఎంపికచేసి వారికి ఈపేమెంట్‌చేసేందుకుగాను ఉద్యోగులు, వారి బంధుల ఖాతాల్లోకి ఈ సొమ్మును బదలాయించారు. ఒక్క సియోని జిల్లాలోనే 11.79 కోట్లు ఇలా బదలాయింపు జరిగింది. 59 ఖాతాల్లోకి 291 నకలీ ఉత్తర్వులు 201 పిడుగుపాటు మృతులు, 90 పాముకరిచి మృతిచెందిన కుటుంబాలకు అన్నట్లుగా పంపిణీ చేసారు. షియోపూర్‌లో కూడా 3.36 కోట్ల మేర ఇలా అనర్హులకు, బోగస్ లబ్దిదారులకు పంపిణీ చేసారు. డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు కుమ్మక్కయితేనే ఈ వ్యవస్థనడుస్తుందని ట్రెజరీ అధికారుల హస్తం లేకుండా ఇలా జరగదని కూడా కాగ్ తేల్చింది. నివేదిక వెల్లడికాగానే నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఒక తహసీల్దార్, మరో నాయిబ్ తహసీల్దార్‌లనున సియోని జిల్లాలో సస్పెండ్‌చేసారు. ఒక ఉద్యోగిపై కేసు కూడా నమోదయింది. శాఖాపరంగా ఈ మొత్తం సిబ్బందిపై దర్యాప్తునుప్రారంభించాడు. అలాగే మరోక కేసుపరంగా మెజిస్టీరియల్ విచారణ కూడా ప్రారంభించారు. షియోపూర్ జిల్లాలో పునరావాసం సొమ్ము ప్రభుత్వ సిబ్బందికి బదలాయించారు. 2021లో వరదబాధితులకు ఇవ్వాల్సిన ఈ సొమ్ము మొత్తం ఇతరులకు లాభపడింది. జిల్లాస్థాయిలో ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి ఈమొత్తం భాగోతంపై దర్యాప్తునకు ఆదేశించారు. ఇప్పటికే 11 లక్షలు రికవరీచేసారు. పొరుగుననే ఉన్న శివపురి జిల్లాలోకూడా కరువుబాధితులకు ఇవ్వాల్సిన నిధులు బదలీ చేసారు. ప్రభుత్వ ఉద్యోగి సస్పెండ్ కాగా మరో ముగ్గురిని కేసులో నమోదుచేసారు.

# ఎంఎన్‌జీరేగా నిధులకోతపై సోనియా మండిపాటు

## యుపిఎ ప్రభుత్వం తెచ్చిందని కోతలు పెడుతున్న సర్కార్




**న్యూఢిల్లీ, మార్చి 18:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజిఎన్‌రేగాకు బడ్జెట్‌లో నిధుల కోతపై రాజ్యసభ ఎంపి సోనియాగాంధీ తీవ్రనిరసన తెలిపారు. బడ్జెట్ అనంతర చర్చలోభాగంగా మంగళవారం రాజ్యసభలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత యంత్రాంగం ఈపథకాన్ని నిర్వీర్యంచేయాలని చూస్తోందని యుపిఎ ప్రభుత్వంలో డా.మన్మోహన్‌సింగ్ హయాంలో ఈ పథకం ప్రారంభించిన అంశాన్ని ఆమె గుర్తుచేసారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఈపథకాన్ని కనుమరుగు చేయాలని చూస్తోందని, బడ్జెట్‌కేటాయింపులు 86 వేల కోట్ల వద్దనే నిలిచిపోయాయని ఆమె ప్రశ్నించారు. వాస్తవానికి కేటాయింపులు నాలుగువేల కోట్లు తగ్గించారని, అంచనాలు మాత్రం కేటాయించిన నిధులకంటే 20శాతం ఎక్కువ ఉన్నాయని ఈ నిధులు పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు మాత్రమే సరిపోతాయని ఆమె అన్నారు.

ఎంఎన్జీరేగా పథకంలో అనేక సమస్యలు, సవాళ్లు ఎదురవుతున్నాయని, ఆధార్‌సహిత చెల్లింపుల వ్యవస్థ తప్పనిసరి చేసారని నేషనల్ మొబైల్ మానిటరింగ్ వ్యవస్థలో చెల్లింపుల్లో ఎక్కువ జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ఈపథకం మరింత విస్తరించేందుకు వీలుగా రోజువారి భృతిని రూ.400కు పెంచాలని సోనియా విజ్ఞప్తిచేసారు. అంతేకాకుండా ప్రభుత్వం తప్పనిసరి నిబంధనలను తొలగించాలని, ఆధార్ చెల్లింపులు, ఎన్బీఎంఎస్ వ్యవస్థలను తొలగించాలని కోరారు. ఎంఎన్జీరేగాలో పనిదినాలు 100 నుంచి 150 రోజులకు పెంచాలనికోరారు. గ్రామీణప్రాంతంలో ఉన్న లక్షలాది మంది నిరుపేద కూలీలకు ఈ పొడిగింపు ఎంతో మేలు చేస్తుందని ఆమె కోరారు. ఆర్థికభద్రతను ఇస్తుందన్నారు.

# లెబనీస్ వైద్యురాలిపై అమెరికా బహిష్కరణ వేటు

## ట్రంప్ ఫొటోతో బైబై



**వాషింగ్టన్, మార్చి 18:** రోడ్ ఐలాండ్‌లో కిడ్నీ మార్పిడి స్పెషలిస్టుగా పనిచేస్తున్న లెబనీస్ డాక్టర్ రాషా అలవీకి హెజ్‌బొల్లాతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించింది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్ చేసిన పోస్టు వైరల్‌గా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బై చెప్తున్నట్లుగా ఉన్న ఫొటోను షేర్ చేస్తూ.. బైబై రాషా అంటూ రాసుకొచ్చింది. గతవారం బోస్టన్ లోగాన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాషాను అమెరికా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల లెబనాన్ పర్యటనకు వెళ్లిన రాషా ఫిబ్రవరి 23న జరిగిన 'హెజ్‌బొల్లా' మాజీ అధినేత హసన్ నస్రల్లా (64) అంత్యక్రియలకు హాజరయినట్లు దర్యాప్తులో అంగీకరించిందని అన్నారు. అంతేకాకుండా ఆమె ఫోన్‌లో నస్రల్లా, ఇతర హెజ్‌బొల్లా నేతల ఫొటోలు ఉన్నాయని.. కాగా బోస్టన్ చేరుకునే ముందు రాషా వాటిని తొలగించారని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రశ్నించగా వారి రాజకీయ కార్యకలాపాల గురించి కాకుండా.. మతపరమైన, ఆధ్యాత్మిక బోధనల విషయంలో తాను హెజ్‌బొల్లా నేతలను అనుసరిస్తానని పేర్కొన్నట్లు తెలిపారు. తీవ్రవాద సంబంధాలు ఉన్న వీసాదారులపై విస్తృత చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఆమెకు హెజ్‌బొల్లాతో సంబంధాలు ఉన్నాయని తెలియడంతో దేశం నుంచి బహిష్కరించినట్లు వెల్లడించారు.

వీసా అనేది ఒక ప్రత్యేక హక్కు అని.. కానీ అమెరికన్లను హతమార్చే ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడం వల్ల రాషా వీసా జారీని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. ఇదేవిధంగా ఇటీవల కొలంబియా విశ్వవిద్యాలయంలో ఒక పాలస్తీనా కార్యకర్తను అరెస్టు చేశామని, మరొక విద్యార్థి వీసా రద్దు చేశామన్నారు. 34 యేళ్ల రాషా బ్రౌన్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్‌గా పనిచేయడానికి హెచ్-1బి వీసా ద్వారా అమెరికాకు వెళ్లింది. ఆమెను హెజ్‌బొల్లా మద్దతుదారుగా గుర్తించిన యుఎస్ అధికారులు వెంటనే దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు చేపట్టారు. అయితే హఠాత్తుగా ఆమెను దేశం నుంచి బహిష్కరించడాన్ని రాషా తరఫు లాయర్లు వ్యతిరేకించారు. ఈ విషయంపై చట్టపరమైన పోరాటాన్ని కొనసాగిస్తామని రాషా తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

# లోక్‌సభ విపక్షనేతను కూడా మాట్లాడేందుకు అనుమతించలేదు

### ఎల్వోపీ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, మార్చి 18:** మహాకుంభ్‌పై మోడీ ప్రకటన తర్వాత నిరసనల మధ్య వాయిదా పడిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు అవకాశం కూడా ఇవ్వకుండా వాయిదా పడుతోందని లోక్‌సభ ఎల్వోపీ రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. విపక్షనాయకుడికి మాట్లాడే అవకాశం ఉంటుందని ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉందని, నవీనభారతావనిలో ఎల్వోపీకి అవకాశం మాత్రం రాదని ఆయన ఎద్దేవాచేసారు. వాయిదాపడిన తర్వాత పార్లమెంటు బయట మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ ప్రధాని మహాకుంభ్‌ప్రస్తావన తెచ్చేముందు జనవరి 29న జరిగిన తొక్కిసలాటలో మరణించిన 30 మందికి కనీసం సంతాపంఅయినా ప్రకటించాల్సి ఉందని పేర్కొన్నారు. అవేమీలేకుండా మహాకుంభ్ ఐక్యత తెచ్చిందని, ప్రపంచాన్ని మొత్తం ఏకంచేసిందంటూ ప్రసంగించారని ఆయన అన్నారు. మహాకుంభ్ విజయవంతంగా నిర్వహించామని మోడీచేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో విపక్షం మండిపడిన సంగతి తెలిసిందే. తీవ్రనిరసనల మధ్య లోక్‌సభ బుధవారానికి వాయిదాపడింది. ప్రధాని వ్యాఖ్యలకు నిరసన తెలుపుతూ అనేకమంది ప్రతిపక్ష ఎంపిలు తమ సీట్లవద్దనుంచే నిరసన తెలిపారు. కకుంభ్ అనేది మన సంస్కృతి సాంప్రదాయానికి నిదర్శనమని, చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబిస్తుందని రాహుల్ పేర్కొంటూ అలాంటి భారీ ఎత్తున నిర్వహించినట్లు చెపుతున్న ప్రధానిమోడీ మహాకుంభ్ తొక్కిసలాటలో మృతులకు కనీసం సభలో సంతాపం కూడా తెలియజేయకపోవడం విచారకరమని రాహుల్ అన్నారు. మహాకుంభ్‌కు వెళ్లిన యువతకు ఉపాధి ప్రస్తావన కూడా తీసుకురాలేదని, మహాకుంభ్‌తోపాటు నిరుద్యోగంపైనా ప్రధాని స్పందించాలని కాంగ్రెస్‌నేత రాహుల్ అన్నారు. మమ్మల్ని మాట్లాడేందుకు కూడా అనుమతించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ ప్రతిపక్షాన్ని మాట్లాడేందుకు అనుమతించాలని కోరారు. మహాకుంభ్‌లాంటి అత్యంత భారీ కార్యక్రమం భారత్‌నిర్వహించే సామర్థ్యం ఉందా అని ప్రశ్నించినవారికి సమాధానంగా మహాకుంభ్ విజయవంతం అయిందని మోడీ తన ప్రసంగంలోపేర్కొన్నారు. వికసితభారత్ స్ఫూర్తిని మహాకుంభ్ చాటిచెప్పిందన్నారు.

## చిన్నకేసుల్లోకూడా బెయిల్ తిరస్కృతి మంచిదికాదు

### దిగువ కోర్టులకు సుప్రీం బెంచ్ చురకలు

**న్యూఢిల్లీ, మార్చి 18:** దిగువకోర్టుల్లో బెయిల్ పిటిషన్లను లెక్కకు మించి తిరస్కరణకు గురవుతుండటంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. తీవ్రస్థాయి కేసులు కాకపోయినప్పటికీ బెయిల్ అభ్యర్థనలను తిరస్కరించడంపై సుప్రీం కోర్టు తీవ్రంగాపరిగణించింది. జస్టిస్ అభయ్ ఎస్ ఒకా, ఉజ్జల్‌బూయాన్‌లతోకూడిన బెంచ్ ప్రజాస్వామ్య దేశం ఎంతమాత్రం పోలీస్ ప్రభుత్వంగా కొనసాగకూడదని, చట్టం అమలుచేసే సంస్థలు ఏకపక్షంగా అధికారాలను ప్రయోగించి వ్యక్తులను ఎలాంటి సహేతుకమైన కారణం లేకుండా అదుపులోకి తీసుకోవడం ఎంతమాత్రం మంచి సాంప్రదాయం కాదన్నారు. రెండు దశాబ్దాల క్రితం బెయిల్ అభ్యర్థనలు చిన్న కేసుల్లో అత్యంత అరుదుగా హైకోర్టువరకూ వచ్చేవని, ఇపుడు నేరుగా సుప్రీం కోర్టు వరకూ వస్తున్నాయని, దీనిపై ట్రయల్ కోర్టుల పని తీరును సందేహించాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసారు. బెయిల్ అభ్యర్థనలను ట్రయల్ కోర్టు స్థాయిలోనే పరిష్కరించాలని, బెయిల్ అభ్యర్థనల్లో అనవసర భారం పెంచుతున్నారని జస్టిస్ ఓఖా చురకలువేసారు. బెయిల్ అభ్యర్థనలపై సుప్రీంకోర్టు మండిపడటం ఇదేమీ కొత్త కాదు. పదేపదే దిగువకోర్టులు, హైకోర్టులకు బెయిల్‌మంజూరులో సడలింపుల వైఖరితో ఉండాలని సూచించింది. మైనర్ తీవ్రతలేని కేసుల్లో బెయిల్ ఎందుకు మంజూరుచేయడం లేదని మండిపడ్డారు. ఒక మోసం కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తిని రెండేళ్లుగా కస్టడీలోనే కొనసాగించడంపై సుప్రీంకోర్టు మండిపడింది. నిందితుడి బెయిల్ అభ్యర్థన దిగువకోర్టు, గుజరాత్ హైకోర్టులు రెండూ తిరస్కరించాయని, దర్యాప్తు పూర్తి అయి ఛార్జిషీటు దాఖలయినా కూడా నిందితుడికి ట్రయల్‌కోర్టు బెయిల్ అభ్యర్థన పరిగణనలోనికి తీసుకోలేదని తిరస్కరించారు. శిక్షార్హమైన నేరాల్లో అరెస్టుచేసిన నిందితులు ఏడేళ్ల జైలుశిక్ష పడే తీవ్రస్థాయి కేసులున్నవారికి కూడా నిరంతర కస్టడీ అనేది వీలుకాదన్నారు. వ్యక్తులస్వేచ్ఛను కూడా పరిగణనలోనికి తీసుకుని బెయిల్ మంజూరు అభ్యర్థనలు పరిశీలించాలని సూచించింది. నిందితుడు దర్యాప్తునకు పూర్తిసహకారం అందించిన పక్షంలోను, దర్యాప్తుసమయంలో అరెస్టుచేయకపోయినా ఛార్జిషీటు దాఖలుచేసిన తర్వాత కస్టడీలో కొనసాగించడం మంచి సాంప్రదాయం కాదని బెంచ్ స్పష్టంచేసింది.

## మోడీ మహాకుంభ్ వ్యాఖ్యలపై విపక్షం నిరసన

### వాయిదా పడిన లోక్‌సభ



**న్యూఢిల్లీ, మార్చి 18:** మహాకుంభ్‌పై నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యలపై విపక్ష సభ్యుల ప్రశ్నలకు జవాబివ్వాలనికోరుతూ ప్రతిపక్షం నిరసనలమధ్య మంగలవారం లోక్‌సభ వాయిదా పడింది. అంతకు ముందుకూడా మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సభా కార్యక్రమాలు వాయిదాపడ్డాయి. మహాకుంభ్‌పై ప్రధానిమోడీ చేసిన ప్రకటనపై వివరణ ఇవ్వాలని కోరుతూ విపక్ష సభ్యులు తమ సీట్లనుంచే లేచి నిరసన తెలిపారు. ప్రధాని మోడీ ప్రకటనలో తొక్కిసలాట, మరణాలను కూడా ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. 30 మందిచనిపోయారని ప్రపంచం మొత్తానికి తెలుసునని విపక్షం ఆరోపించింది. వాయిదా తర్వాత మళ్లీ ప్రారంభం అయిన సభలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తన మంత్రిత్వశాఖ డిమాండ్స్ ఫర్‌గ్రాంట్స్‌పై చర్చను లేవనెత్తారు. జలశక్తి మంత్రిత్వశాఖ గ్రాంట్లపై చర్చనుప్రారంభించగా విపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నిరసన తెలిపారు. వెంటనే ఈచర్చను వాయిదా వేయాలనికోరారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం మళ్లీ సమావేశం అయిన లోక్‌సభలోప్రధాని సభను తప్పుదోవ పట్టించేందుకు మహాకుంభ్ ప్రకటనచేసారని, మోడీ ప్రకటనలో మృతుల వివరాలు, తొక్కిసలాట సమాచారమే లేదని ఆరోపిస్తూ పెద్ద పెట్టున నినాదాలుచేసారు. దీనితో స్పీకర్‌ఓంబిర్లా సభను వాయిదావేసారు.

19-3Pg6exHMNWJQE.qxd:19-3Pg6exHMNWJQE.qxd 01/01/01 9:03 AM Page 1



# ఇక 16కాళ్ల మండపంలో నిత్యకల్యాణం సంకల్పం స్థలం మార్పునకు అభ్యంతరం

## వేసవిలో భక్తులకు సకల సదుపాయాలు: బదలీలకు కసరత్తు: ఇఒ బాపిరెడ్డి


ఇఓ బాపిరెడ్డి

**శ్రీకాళహస్తి,మార్చి 18 ప్రభాతవార్త:** ఎంతో కాలం గా మూకతీర్థం పక్కన నిర్వహిస్తున్న స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణం వేదికను ఇక మీదట 16కాళ్ళ మండపంలో నిర్వహించుటకు నిర్ణయించినట్లు సమాచారం. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఒ డి.బాపిరెడ్డి అధ్యక్షతన ఆలయ అర్చకులు, అధికారులు,సిబ్బంది,వేదపండితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మార్పులు చేర్పులకు సంబంధించి ఇఒ బాపిరెడ్డి తన సిబ్బందితో సమీక్షించారు. ముఖ్యంగా విఐపిలు వచ్చినపుడు 'సంకల్పంతో' కొంత ఇబ్బంది ఏర్పడుతుందని కాబట్టి సంకల్పంను ఇక మీదట 'శిఖరదర్శనం'కు వెళ్లే మార్గం కుడి వైపు ఏర్పాటుకు ప్రతిపాదించారు.అయితే ఇందుకు అభిషేక ప్రధాన గురుకుల్, అలంకార, అభిషేక గురుకుల్స్ అభ్యంతరం చెప్పటంతో ఈ ప్రతిపాదన తాత్కాలికంగా వాయిదా పడినట్లు సమాచారం. అయితే స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణం ఎంతో కాలంగా పాత వాహనాల మండపం ఎదురుగా నిర్వహించే వారు. అయితే దానిని ఆలయం ప్రాకారంలో గల 16కాళ్ల మండపంలో నిర్వహించుటకు నిర్ణయించారు.ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రతిపాదన అమలు జరగనున్నట్లు తెలిసింది. అర్చకులు,సిబ్బంది సమావేశంలో ఇఒ మాట్లాడుతూ అదుపు తప్పుతున్న వారి మీద చర్యలు తీసుకోలేక కాదు. అయితే మీలో మార్పు పరివర్తన వస్తుందనుకుంటున్నారు. ఆలయంలో ఏం జరుగుతుందో తాను ఇంటి వద్ద ఉన్నా చూస్తున్నానన్నారు. కానీ కొందరు ఇప్పటికి దళారుల దందా మానటం లేదు. పైగా ఓ ఉద్యోగిని నడిబజారులో దాడి చేసిన సంఘటనపై ద్వితీయశ్రేణి అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.తాను ఒక్కడు మారితే సరిపోదు పరిపాలనలో అందరిలోనూ పరివర్తన రావాలి! మనం స్వామి దయతో బతుకుతున్నాము. ఆయన దర్శనానికి వచ్చే భక్తుల్ని మనం భగవంతులుగా చూడాలన్నారు. అలాకాకుండా వ్యవహారిస్తే కఠిన చర్యలు ఉంటాయని సునిశితంగా హెచ్చరించారు.

**వేసవిలో సకల సదుపాయాలు:** క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా క్యూలైన్లలో ప్రవేశించిన తరువాత కనీసం ఒక గంట పాటు అయినా ఉండాల్సి వస్తుంది. కాబట్టి వారికి చల్లటి గాలికి ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అలాగే మంచినీటి సదుపాయాలు చల్లటి నీటి కోసం కూలర్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఇక అంతరాలయానికి వచ్చే అతిధులను ఎక్కువ సమయం నలపకూడదు. పేరు, సంకల్పం అంటూ నిలబెట్టవద్దు. ఎవ్వరైనా సరే ఒకే ఒక నిముషం మాత్రమే లోపల ఉండాలని ఇఒ ఆదేశించారు. లోపలకు వస్తానే హారతి ఇచ్చి బయటకుపంపాలని సూచించారు. ఇక అంతర్గత బదిలీలకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.


సర్వేయర్లు, రీసర్వే డిటిలు, తహశీల్దార్‌లు, సచివాలయ సర్వేయర్లుకు సూచనలిస్తున్న ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి

# అన్నదాతలకు నష్టం లేకుండా రీ సర్వే

## శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి

**తొట్టంబేడు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఆర్డీవో కార్యాలయంలో రీ సర్వేపై అన్నదాతలకు ఎలాంటి నష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందని శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ పరిధిలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కెవిబిపురం, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, ఏర్పేడు, రేణిగుంట మండలాల పరిధిలోని 8 మండలాల తహశీల్దార్‌లు, మండల సర్వేయర్లు, రీసర్వేడిటిలు, సచివాలయ సర్వేయర్లతో సుదీర్ఘంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ డిఐ రాఘవయ్యతో పాటు మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు హాజరయ్యారు. అనంతరం ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రీ సర్వే ఫైల్ గ్రామాలు, ఎఫ్‌పోలార్, బిఎస్ఎల్‌ఏ ఇన్ ఏపి సేవ సర్వీసెస్, రెవెన్యూ సదస్సులల్లో వచ్చిన వినతుల పెండింగ్, జివో ఎంఎస్ నం.30, ఆర్ఓఆర్ కేసులు, ల్యాండ్ అక్విజేషన్, ఇంటి స్థలాల లబ్దిదారులు గుర్తింపు, మండలంలో ఉన్న సమస్యలు, రీ సర్వేపైలట్ ప్రాజెక్టుల్లో భాగంగా ఎంచుకున్న గ్రామాలు, అక్కడ జరుగుతున్న పనుల వేగవంతంపై చర్చించారు. తొట్టంబేడు మండలంలో కొన్నలి గ్రామం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనందని తెలిపారు. ఇక్కడ సత్వరం భూములు రీసర్వేను సక్రమంగా అమలు జరిగేలా చర్యలుతీసుకోవాలన్నారు. పాతపద్ధతిలో చైన్ల లింకులతో కొలిచే వారని కానీ నేడు రోవర్‌తో రైతులకు ఖచ్చితమైన పొలాన్ని చూపించవచ్చన్నారు. తహశీల్దాలు కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని రీసర్వే గ్రామాల్లో క్షేత్రస్థాయిలోపర్యటించాలని ఆదేశించారు. ఏపి రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలం ఎంత, డికెటి పట్టాలు ఎంత, ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయో సమగ్రంగా పరిశీలించాలన్నారు. ఇటీవలే నాలుగు రోజుల క్రితం బోనుపల్లిలో రీసర్వే సమస్యలు ఉన్నాయని జిల్లా కలెక్టర్‌వచ్చిన విషయం గుర్తించుకోవాలన్నారు. ప్రతి మండలంలోని గ్రామంలో ఎంతెంత ప్రభుత్వ, పట్టా భూములు, ప్రభుత్వ భూములు, డికెటి భూమలు ఉన్నాయో సమగ్రంగా వివరించాలని ఆదేశించారు. రీసర్వేలో పొరపాట్లు చోటులేకుండా చూడాలన్నారు. బోనుపల్లిలో ఎందుకు రీసర్వేలో సమస్యలు వచ్చాయో తెలుసుకున్నారు. రీసర్వేలో ఒకవేళ ఏదైనా సమస్యవస్తే వెంటనే తమకు తెలియజేయాలని వివరించారు.

రీసర్వేలో కొందరు సమస్యలు ఉన్నాయని బోనుపల్లిలో సమస్యలు వెల్లువెత్తడంతో గుర్తించిన ఆర్డీవో ఇలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. ఇటీవల కలెక్టర్ బోనుపల్లి పర్యటనకు వచ్చినప్పుడు రీసర్వేలో కొందరి భూములు ఎక్కువరావడం, తక్కువగా రావడంతో బ్యాంకు లోన్లకు ఇబ్బందులు ఎదుర్కొన్నామని అన్నదాతలు కలెక్టర్‌కు విన్నవించిన సంగతి తెలిసిందే. అయితే ఇవేమీ తలెత్తకుండా చర్యలుతీసుకోవాలని మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లను ఆదేశించారు. తహశీల్దార్‌లు, రీ సర్వే డిటిలు కూడా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఉండాలన్నారు. రోవర్‌తో సమావేశంలో డిఐ రాఘవయ్య, కార్యక్రమంలో 8మండలాలకు చెందిన తహశీల్దార్‌లు, రీసర్వే డిటిలు, మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు, పాల్గొన్నారు.


మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, పార్థసారథి, ఎమ్మెల్సీ బి టి నాయుడు

# వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చండి

## సిఎంని కలిసిన ప్రజాప్రతినిధుల బృందం

**అనంతపురం, మార్చి 18,ప్రభాతవార్త బ్యూరో :** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వాల్మీకి, బోయలను షెడ్యూల్ తెగల్లో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వాల్మీకి సామాజికవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ల బృందం విన్నవించింది. భావితరాల భవిషత్‌ను దృష్టిలో ఉంచుకొని కేంద్రానికి త్వరగా సానుకూల నివేదిక అందించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు గుమ్మనురు జయరాం, పార్థసారథి, ఎమ్మెల్సీ బిటి నాయుడులు మంగళవారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబరులో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని వాల్మీకి, బోయలు సామాజికంగా, ఆర్థికంగా చాలా వెనుకపడ్డారని గుర్తు చేశారు. ఆరు దశాబ్దాలకు పైగా తమ న్యాయమైన సమస్యకు పరిష్కారం లభించలేదని తెలియచేశారు. ఎన్డీయే కూటమి బలపర్చుతున్న ప్రభుత్వమే కేంద్రంలోనూ అధికారంలో ఉన్నందున మీ మీదే సామాజికవర్గ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చంద్రబాబుకు వివరించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఈ అంశంపై రాష్ట్ర శాసనసభ, శాసన మండలిలో సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీ.లుగా గుర్తించాలని ఏకగ్రీవ తీర్మానాన్ని కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. ప్రొఫెసర్ సత్యపాల్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని నియమించారని వివరించారు.

# అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్టు

## రూ.35 లక్షల విలువైన బంగారం, 3 కేజీల వెండి, 2 ద్విచక్రవాహనాలు స్వాధీనం: ఎస్పీ మణికంఠ చందోలు


మంగళవారం మీడియా సమావేశంలో వరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, మార్చి 18 ప్రభాతవార్త: పూతలపట్టు పోలీసులు మంగళవారం ఒక అంతర్‌జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుండి 35 లక్షల రూపాయల విలువైన 316 గ్రాముల బంగారం, 3.150 కేజీల వెండి, రెండు ద్విచక్రవాహనాలు, ఒక టివిని స్వాధీనం చేసుకొని ఐదు మంది సభ్యులు గల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఎస్పీ మణికంఠ చందోలు వివరాలను వెల్లడించారు. మార్చి 6న పూతలపట్టు మండల పరిధిలో జరిగిన ఒక ద్విచక్ర వాహనం దొంగతనం జరుగడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఈ మేరకు నిందితులు పూతలపట్టు మండలం పి.కొత్తకోట పాత రోడ్డులో వున్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందడంతో ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ సిబ్బందితో కలిసి వెళ్ళి ఐదు మంది అంతర్ జిల్లా దొంగల ముఠాను వలపన్ని పట్టుకున్నారు. ఈ మేరకు వారి నుండి పోలీసులు 2.30 లక్షల రూపాయల విలువైన రెండు ద్విచక్ర వాహనాలు, 25.28 లక్షల రూపాయల విలువైన 316 గ్రాముల బంగారు ఆభరణాలు, 3.50 లక్షల రూపాయల విలువైన 3,1050 కేజీల వెండి అభరణాలు, ఒక ఎల్ఇడి టివిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన వారిలో తవణంపల్లి మండలం పల్లెచెరువు పంచాయతీ జెట్టిపల్లి గ్రామంకు చెందిన గల్లా హేమచంద్ర(27), ప్రకాశం జిల్లా సిఎస్ పురం మండలం కొండరాజుపల్లి ఉప్పలపాడు దళితవాడుకు చెందిన కొండరాజు సురేష్(27), తిరుపతి జిల్లా పుత్తూరు టౌన్ కామ రాజనగర్‌కు చెందిన షేక్ మస్తాన్(24), సత్య సాయిజిల్లా ఓడిసి మండలం ఇంగటూరు పంచాయతీ మిట్టపల్లి గ్రామంకు చెందిన పోలి వరప్రసాద్(20),చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు హరిజనవాడకు చెందిన సంజయ్‌కుమార్(23)లు వున్నారు.మొదటి నిందితుడు హేమచంద్రపై సుమారు 60కేసులు వుండగా 20కి పైగా వారెంట్లు పెండింగ్‌లో వున్నాయి. సురేష్‌పై 27 కేసులు వుండగా హేమచంద్ర, సురేష్‌లు ఇద్దరిపై గాజులమాండ్యం పోలీస్ స్టేషన్‌లో 2022 సంవత్సరం పిడియాక్ట్ కేసు నమోదు అయ్యింది. అలాగే షేక్ మస్తాన్‌పై 57 కేసులు వున్నాయి. వీరిపై కడప, కావలి, కర్నూలు, బద్వేలు, ఇతర పోలీస్ స్టేషన్లలో సైతం పలు కేసులు వున్నాయి. ఫిర్యాదు అందిన పది రోజుల్లో నిందితులను అరెస్టు చేసి 35 లక్షల రూపాయల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్న పూతలపట్టు పోలీసులకు ఎస్పీ మణికంఠ చందోలు ప్రసంశాపత్రాలు అందజేశారు.

# ఐక్యరాజ్యసమితిలో హిందీకి మరింత ప్రాధాన్యం

## విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు యార్లగడ్డ


భారత రాయబారి కార్యాలయ ప్రధాన అధికారి పర్వతనేని హరీష్‌తో యార్లగడ్డ

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** ఐక్యరాజ్యసమితిలో హిందీ భాష వినియోగాన్ని ప్రోత్సహించే ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నదని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఐక్యరాజ్యసమితిలో శాశ్వత భారత రాయబారి కార్యాలయ ప్రధాన అధికారి పర్వతనేని హరీష్‌తో న్యూయార్క్‌లోని ఆయన కార్యాలయంలో సమావేశయ్యారు. హిందీ వినియోగానికి సంబంధించిన అనేక అంశాలను వీరిరువురు చర్చించారు. ఐక్యరాజ్యసమితి నుంచి హిందీలో వార్తలను ప్రసారం చేయడంతో పాటు హిందీ భాషను మరింత మందికి చేరువ చేసే ప్రాజెక్టును మరో 5 సంవత్సరాల పాటు పొడిగించేందుకు ఒప్పందం కుదిరిందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి భారత్ ప్రతి ఏడాది ..13 కోట్లు అందజేస్తుందని, ప్రస్తుతం వెబ్‌సైట్ ద్వారా కొనసాగుతోన్న ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో ఒక ప్రత్యేక యాప్ ద్వారా మరింత బలోపేతం చేయాలని యోచన జరుగుతోందని తెలిపారు.ఆచార్య యార్లగడ్డ మాట్లాడుతూ, విదేశాంగమంత్రిగా అటల్ బిహారీ వాజ్‌పేయి ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించిన తొలి నేత అని, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు కూడా హిందీలో ప్రసంగించారని గుర్తుచేశారు. అలాగే, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ పర్యటనల సమయంలో వివిధ దేశాధినేతలతో హిందీలోనే చర్చలు జరుపుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితిలో అరబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్ భాషలు అధికార భాషలుగా ఉన్నాయని, హిందీని కూడా అధికార భాషగా గుర్తింపు పొందేలా చేయడం అటల్ బిహారీ వాజ్‌పేయి కలగా ఉందని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ ద్వారా చిరుధాన్యపు ఉత్పత్తుల విక్రయాలకు అవకాశం

## రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు డిల్లీ రావు

**విజయవాడ,మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో జాతీయ ఆహార, పోషక భద్రతా పథకంలో చిరుధాన్యపంటల సాగు,ఉత్తమ యాజమాన్యం పద్ధతులు,నూతన ఆవిష్కరణలు అనే అంశం పై కార్యశాల నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయశాఖ సంచాలకులు డిల్లీ రావు ప్రారంభోపన్యాసం చేస్తూ మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు సరైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించటానికి మధ్యాహ్నం భోజన పథకంలో రాగి జావను తప్పనిసరి చేసిందన్నారు.అందువలన రాగి పంట విస్తీర్ణం ,ఉత్పత్తి పెంచే దిశగా పరిశోధన , విస్తరణ విభాగాలు కార్యచరణ చేపట్టాలి అని తెలిపారు. చిరుధాన్యాలు సాగు చేసిన రైతులు వారి పంట ఉత్పత్తులను ప్రభుత్వపు ఆన్లైన్ వేదిక ఓయన్‌డిసి యాప్ ద్వారా నమోదు చేసుకో వాలన్నారు.ఇందు వలన వారి ఉత్పత్తులు ఆ ఆప్ ద్వారా అందరి దృష్టిలో వుండటం జరుగు తుందన్నారు. తద్వారా సరియైన ప్రచారం జరిగి మంచి ధర పొందే అవకాశం వుందని తెలిపారు. తిరుపతి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కరీముల్లా మాట్లాడుతూ మెషీన్‌కోత వల్ల పంటకోత వ్యర్ధముల మిశ్రమాలు,మట్టి ,ఇసుక ,కలుపు గింజలు మొదలగునవి పంట ఉత్పత్తులలో కలిసి మార్కెట్ ధర రైతులుసరిగా పొందడం లేదన్నారు.

వాటిని అరికట్టడానికి మెషీన్ హార్వెస్ట్ యంత్రములతో కోతకు ముందే పంటలో కలుపు తీయటం ద్వారా ఈసమస్యను అదిగమించవచ్చుని తెలిపారు. రైతునేస్తం సంస్థ ప్రతినిధి కొర్రపాటి శ్రవణ్ వారి సంస్థ యొక్క చిరుధాన్యాలుతో తయారుచేసిన విలువ ఆధారిత ఉత్పత్తులైన కొర్ర బిస్కట్లు ,చిరు ధాన్యాలు మురుకులు ,పొడులు ప్రదర్శించారు .ప్యాకింగ్‌లో చేబట్టాల్సిన జాగ్రత్తలు తెలియ చేశారు. శాస్త్రవేత్త మాధవీలత మాట్లాడుతూ రాగి పంటలో తిరుమల 1096 రకము కంటే వకుళ రకానికిపంట దిగుబడికి ఎక్కువగా వస్తుం దని , మెడ విరుపు తెగులును తట్టుకుంటుందని తెలిపారు.శాస్త్ర వేత్తలు ప్రతిభశ్రీ కలుపు యాజమాన్యంపై, నాగ మణి తెగుళ్ల యాజమాన్యం పై ప్రసంగించారు.

ఏపీ సీడ్స్ జనరల్ మేనేజర్ డాక్టర్ జలంధర్ రామ్,తమ కేంద్రం వద్ద రాగులు లలో ఇంద్రవతి ,వేగవతి రకాలు 1000 క్వింటాళ్ల వరకు,కొర్రలలో యస్ఐఎ 3156,3159 రకాలు 90క్వింటాళ్లవరకు పూర్తిస్థాయిలో అందుబాటులో వున్నాయని తెలిపారు.

# గత ప్రభుత్వంలో రైతులకు అన్యాయం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఐదేళ్లు రైతులకు అన్నివిధాలా అన్యాయం చేశారని యాంత్రీకరణ పరికరాలు ఇవ్వలేదని కేంద్ర సాయంతో నిర్వహించే అనేక పథకాలను నిలిపేశారని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణపై శాసనసభలో మంత్రి మాట్లాడారు. 2014-19లో తెదేపా ప్రభుత్వం 3.27 లక్షల మంది రైతులకు రూ.1227 కోట్లతో యాంత్రీకరణ సాయం చేసింది. వైకాపా ప్రభుత్వం చివరి మూడేళ్లలో రూ.360 కోట్లే వెచ్చించింది. కమ్యూనిటీ హైర్ సెంటర్లు పేరిట వైకాపా నాయకులకు , కార్యకర్తలకు ట్రాక్టర్లను ఇచ్చారు. ట్రాక్టర్లు సరఫరా చేసిన కంపెనీలకు బకాయిలు పెట్టారు. డ్రిప్‌ను పూర్తిగా మూసేశారు. చివరి ఏడాది డ్రిప్ పరికరాలకు చెందిన రూ.1114 కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.417 కోట్లు చెల్లించాం. లక్షహెక్టార్లలో 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పెట్టాం. గత ఐదేళ్లలో వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన 80 పథకాలకు కేంద్రం నిధులిస్తే పైసా ఖర్చు చేయలేదు. కేంద్రం ఇచ్చిన 60 శాతం వాటా నిధులను మళ్లించడంతో ఆ పథకాలు మూతపడ్డాయి. ఈ పథకాలను మళ్లీ పునరుద్ధరించాం.ఈ నెలాఖరులోపు రూ.80కోట్లతో 42 వేల మంది రైతులకు యంత్ర పరికరాలు ఇవ్వనున్నాం. వైకాపా ప్రభుత్వం ఒక్క భూసార పరీక్షనూ చేయలేదు. మేం 3 లక్షల పరీక్షలు చేసి, కార్డులు ఇచ్చాం. రూ.70 కోట్లతో 875 కిసాన్ డ్రోన్ వ్యవసాయ యాంత్రీకరణ బ్యాంకులను స్థాపించేందుకు ప్రణాళిక రూపొం దించాం అని అచ్చెన్నాయుడు వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర రావడంలేదు అని కథనం వచ్చింది. మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంది. మార్క్ ఫెడ్‌కు బకాయిలు ఉన్నాయి. దానికి డబ్బులు ఇవ్వాలంటే కష్టంగా ఉంది. అయినా సరే కేంద్రంతో కలిసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం అని చెప్పారు. అంతకుముందు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో తెదేపా హయాంలో అమలుచేసిన పథకాలన్నీ మళ్లీ అమలు చేస్తారని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. వైకాపా ప్రభుత్వం డ్రిప్‌ని నిలిపేసి రాయలసీమకు తీరని అన్యాయం చేసిందన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డ్రోన్ల నిబంధనలు కఠినతరంగా ఉన్నాయని, సులభతరం చేయాలని కోరారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రైతులు బర్లీ పొగాకును ఎక్కువగా సాగుచేశారని ధర పడిపోయి ఇబ్బందులు పడుతున్నారని పొగాకు బోర్డు పట్టించుకోవడంలేదని న్యాయం చేయాలని కోరారు . కొందరు సభ్యులు నేరుగా సభలో ఫోన్లు మాట్లాడుతున్నారని, అత్యవసరం అయితే బయటకు వెళ్లి మాట్లాడాలని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సూచించారు. వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో సహకార కేంద్ర బ్యాంకుల్లో భారీస్థాయిలో అవినీతి చోటుచేసుకుందని దీనిపై విచారణ సాగుతోందని దోషులు ఎంతటివారైనా చర్యలు తప్పవని మంత్రి చెప్పారు.

# పిచ్చిమ్మకు నివాళులర్పించిన వైఎస్ జగన్

## కుటుంబసభ్యులకు పరామర్శ

**కొరిశపాడు, మార్చి 18, ప్రభాతవార్త:** ఆదర్శ రైతు స్వర్గీయ యర్రం చినపోలిరెడ్డి సతీమణి, రాజ్యసభ సభ్యులు, వైసిపి రాష్ట్ర నాయకులు వైవి సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చిమ్మ సోమవారం మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం మేదరమెట్ల చేరుకుని యర్రం పిచ్చిమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. వైవి సుబ్బారెడ్డి స్వయాన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిన్నాన్న మంగళవారం యర్రం పిచ్చిమ్మ పార్థివ దేహానికి ఒంగోలులోని వైవి భద్రారెడ్డి స్వగ్రహం నుండి యర్రం చినపోలిరెడ్డి స్వగ్రామమైన మేదరమెట్లలోని వారి స్వగృహానికి తరలించి, బంధు మిత్రులు, గ్రామస్థులు, దర్శనార్థం మధ్యాహ్నం వరకు వుంచారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుండి మంగళవారం హెలికాప్టర్‌లో మేదరమెట్లకు చేరుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కన్వాయ్‌తో వైవి వారి నివాసానికి చేరుకున్నారు. యర్రం పిచ్చిమ్మ పార్థివదేహానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడే వున్న వైవి సుబ్బారెడ్డి, వైవి భద్రారెడ్డిలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలను ప్రత్యేకంగా ఆలింగనం చేసుకుని పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యుల అందరితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూర్చుని మాట్లాడారు.

**పిచ్చిమ్మకు నివాళులర్పించిన విజయమ్మ:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి, ప్రస్తుత తాజా మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ కూడ యర్రం పిచ్చిమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అమె సోమవారమే ఒంగోలుకు చేరుకున్నారు. మంగళవారం మేదరమెట్లకు కూడ వచ్చి పిచ్చిమ్మకు నివాళులర్పించి, కుటుంబసభ్యులందరినీ పరామర్శించారు.

**పిచ్చిమ్మకు పలువురు నేతల నివాళి:** యర్రం పిచ్చిమ్మకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన వైసిపి నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపిలు, మాజీ ఎమ్మెల్యేలు నివాళులర్పించిన వారిలో వున్నారు. ప్రధానంగా ప్రకాశంజిల్లా జడ్‌పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, భూమన కరుణకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మేరగ నాగార్జున, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, అన్నారాంబాబు, కె,నారాయణ స్వామి, ఆదిమూలపు సురేష్, కరణం వెంకటేష్, చుండూరి రవిబాబు, రవీంద్రర్‌రెడ్డి, అంబటి రాంబాబు, టిజె సుధాకరర్ బాబు, పానెం చిన హనిమిరెడ్డి, జి.మధుసుధానరెడ్డి, వరికూటి ఆశోక్ బాబు, విడదల రజని, జంకె వెంకటరెడ్డి, రాంరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, కెవి రమణరెడ్డి, ఎస్ శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకారెడ్డి, తూమాటి మాధవరావు, జోగి రమేష్, తోపాటు అద్దంకి నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతి నిధులు, మాజ ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు ,అభిమానులు వున్నారు.


యర్రం పిచ్చిమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వై.ఎస్.జగన్, విజయమ్మ

# జిల్లా గెజిట్‌లో గ్రామపంచాయతీల ఆస్తుల వివరాలు

**విజయవాడ మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ పంచాయతీల ఆస్తుల వివరాలను జిల్లా గెజిట్‌లో ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. చర్యల వివరాలను తదుపరి విచారణనాటికి న్యాయస్థానికి చెప్పాలని స్పష్టం చేసింది. పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్ కమిషనర్, భూపరిపాలన ప్రధాన కమిషనర్, జిల్లా కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు తదితరులకు ఈ మేరకు నోటీసులిచ్చింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. పిటిషనర్ తరపు న్యాయవాది ఏలూరు శేష మహేష్‌బాబు వాదనలు వినిపిస్తూ ఏపీ గ్రామ పంచాయతీ నిబంధనలు-2011 ప్రకారం గ్రామ పంచాయతీకి సంబంధించిన భూముల జాబితాను సిద్ధం చేసి గెజిట్‌లో ప్రచురించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, తహసీల్దార్, జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్లపై ఉందని పేర్కొన్నారు. గెజిట్ ప్రచురిస్తే ఆస్తుల రక్షణతోపాటు ఆక్రమణలపై చర్యలకు అవకాశముంటుందని తెలిపారు. వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పంచాయతీ ఆస్తులను గుర్తించి జిల్లా గెజిట్‌లో ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేసింది.

# ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల సస్పెన్షన్

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇరిగేషన్ శాఖ.జారీ చేసింది. బదిలీలలో భాగంగా శ్రీశైలం ప్రాజెక్ట్ కు ఎగిజ్క్యూటివ్ ఇంజనీర్లు గా ఎస్. మల్లిఖార్జున రావు, ఎస్. లక్ష్మీనాయక్‌లు బదిలీ అయ్యారు. అయినప్పటికి వారు విధుల్లో చేరలేదు.దాంతో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుకు ఇరిగేషన్ శాఖ ఉన్నతా ధికారులు సంజాయిషీ నోటీసులు జారీ చేసారు.అయినప్పటికి వారు ఇంక విధులలో చేరనందున ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్. మల్లిఖార్జునరావు, ఎస్. లక్ష్మీనాయక్ లను క్రమశిక్షణా చర్యల కింద సస్పెండ్ చేసారు.

# అత్త మీద కోపం దుత్త మీద చూపిస్తారా

## సిఎంగారు: వైఎస్ షర్మిల

**విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:** అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టుంది ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు ఉందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆరోపించారు. అనాడు జగన్ చేసిన తప్పే నేడు చంద్రబాబు చేస్తున్నారు. ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అధికారంలో ఉండగా స్వర్గీయ ఎన్టీర్ పేరు మార్చి వైకాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొందన్నారు. జగన్ అప్పుడు ఎన్టీఆర్ అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా చేస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం మహానేత వైఎస్సార్ పేరు చెరిపి ప్రతీకారం తీర్చుకుంటుందన్నారు. కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాలను గాయపరిచింది. వైఎస్సాఆర్ జిల్లాను తిరిగి వైఎస్సార్ కడప జిల్లా పేరుతో సవరించడంలో అభ్యంతరం లేకపోయినప్పటికి, కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తీసెయ్యడాన్ని ఖండిస్తున్నామన్నారు. వైఎస్సాఆర్ అంటే చంద్రబాబుకు ఎందుకింత కక్ష అని అడుగుతున్నామన్నారు.వైఎస్సార్ జిల్లాలో తిరిగి కడప పేరు చేర్చినప్పుడు విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు ఎన్టీఆర్ విజయవాడ అనో లేక పాత కృష్ణ జిల్లాకు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాగా పేరు ఎందుకు మార్చలేదు అని ప్రశ్నిస్తున్నామన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి.దేశంలోనే సంక్షేమ పథకాలకు ఆద్యుడు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నేత.ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు , పెన్షన్లు లాంటి ప్రజాకర్షక పథకాలకు రూపశిల్పి మహానేత. ఇంట్లో దేవుడి ఫోటోల పక్కన వైఎస్సార్ ఫోటో పెట్టుకొని.. పూజిస్తున్న గొప్ప నేతకు రాజకీయాలు ఆపాదించడం సరైంది కాదన్నారు.ఇది ఆయనకు ఇచ్చే గౌరవం అంతకన్నా కాదు. ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదు. తెలుగు వారందరి సొత్తు అన్నారు.

19-3P□g7exHMNWJQE.qxd:19-3P□g7exHMNWJQE.qxd 01/01/01 9:34 AM Page 1




# ధర నివేదిక కేంద్రాలు 26 జిల్లాలకు విస్తరణ

## సచివాలయంలో మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల బృందం సమావేశం

**విజయవాడ,మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 13 జిల్లాలకు ఉన్న ధర నివేదిక కేంద్రాలను 26 జిల్లాలకు పెంచేలా ఏప్రిల్ నుంచి చర్యలు తీసుకోవాలని మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల బృందం సమావేశం నిర్ణయించింది.ఏపీ సచివాలయంలో మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల బృందం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాల వినియోగదారుల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షత వహించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్.ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.


సచివాలయంలో మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల బృందం సమావేశ దృశ్యం

జాతీయ సగటు 3.61 కంటే ఆంధ్రప్రదేశ్ ద్రవ్యోల్బణం రేటు 2.44 తక్కువగా నమోదు అయినట్లు సమావేశం స్పష్టం చేసింది.,దేశవ్యాప్తంగా తక్కువగా ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రాల లో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానం వరుసగా 3 నెలలు జాతీయ సగటు కన్నా రాష్ట్ర ద్రవ్యోల్బణం తక్కువగా నమోదుఅయినట్లు సమావేశం పేర్కొంది రాష్ట్రవ్యాప్తంగా 154మండల కేంద్రాలు మరియు 151 రైతు బజార్ లో నుంచి సీపీ యాప్ ద్వారా ధరలను సేకరించి వాటిపై విశ్లేషణ చేస్తున్నట్లు అధికారులు మంత్రులకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13 జిల్లాలకు ఉన్న ధర నివేదిక కేంద్రాలను 26 జిల్లాలకు పెంచేలా ఏప్రిల్ నుంచి చర్యలు చేపట్టినట్టు తెలిపారు నిత్యావసర వస్తువుల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షించి, వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. వస్తు రవాణా చార్జీలలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు రవాణా శాఖ వారు తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారుబియ్యం, కందిపప్పు, వంట నూనె, టమోటా, ఉల్లిపాయల ధరల స్థిరీకరణపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ధాన్యంపై మార్కెట్ రుసుము ( రెండు శాతం నుంచి ఒక శాతం తగ్గించేందుకు క్యాబినెట్ ఆమోదానికి నివేదిక తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు తృణధాన్యాల ఉత్పత్తి పెంచేందుకు, రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కమిటీ అభిప్రాయపడింది.


మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మెమొరాండం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

# సమస్యలు పరిష్కరిస్తాం

## విద్యుత్‌శాఖ బిసి ఉద్యోగులకు మంత్రి గొట్టిపాటి హామీ

**అమరావతి, మార్చి 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న బిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టి రవికుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం సెక్రటేరియేట్ లో విద్యుత్ శాఖ ఉద్యోగుల కాలండర్, డైరీలను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ముఖ్య అతిథి కళావేంకట్రావ్‌తో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న బిసి ఉద్యోగుల సమస్యల పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలాకీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెమొరాండం సమర్పించారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ కేశన శంకరరావు, యస్‌పిడిసిఎల్ కార్యదర్శి వై వి సునీల్, సంఘ అసోసియేట్ అధ్యక్షుడు జి రాము, కె ఉమామహేశ్వరరావు, యన్ వీరాంజనేయులు, ఆర్ అప్పలనాయుడు, ఆర్ చంద్రశేఖర్, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్‌శాఖ బిసి ఉద్యోగులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో వైభవంగా గణపతి హోమం

## నేడు హుండీ లెక్కింపులు

**ఇంద్రకీలాద్రి, మార్చి 18, ప్రభాతవార్త:** దుర్గమ్మ వారి ఆలయంలో మంగళవారం మహా గణపతి హోమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా గణపతిని ఆరాధించడం వల్ల సకలలోకాలు సుభిక్షంగా వర్ధిల్లాలనే సుసంకల్పంతో జరిగిన ఈహోమ క్రతువులో ఋుత్విక్కులు వేదమంత్రాల పఠనోచ్చారణ గావిస్తూ హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతులు గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

**నేడు హుండీ లెక్కింపులు:** దుర్గమ్మవారి ఆలయం మహామండపంలో నేడు హుండీ లెక్కింపులు జరుగుతాయని ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. ఉదయం 8 గంటలకు శ్రీ మల్లేశ్వర మహామండపంలో ఈ హుండీ లెక్కింపులు జరుగుతాయన్నారు.

**నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కనమర్లపూడి రామకృష్ణ,



సౌమిత్రిలు రు.1,00,116ల విరాళాన్ని ఆలయాధికారులకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మ వారి ప్రసాదం,శేషవస్త్రం,మెమెంటోలను అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు.

# విద్యుత్ ఒప్పందాలను పునఃసమీక్షించాల్సిందే..

## ఆదాని కేసు విషయంలో మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**అనంతపురం, మార్చి 18, ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ ఒప్పందాలు రైతులకు నష్టం చేకూర్చే విధంగా ఉండటమే కాకుండా వినియోగదారుడిపైనా భారం మోపే విధంగానున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా చెతన్య యాత్రలో భాగంగా మంగళవారం అనంతపురం జిల్లాలో ఆయన పర్యటించారు.తాడిపత్రి ప్రాంతంలోని తలారిచెరువు వద్దనున్న ఎపి జెన్‌కో పవర్ ప్లాంట్‌ను ఉదయం పరిశీలిం చారు. అనంతరం అనంతపురం నగరంలోని గణేనాయక్ భవనంలో



ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెన్యూబుల్ ఎనర్జీ పేరుతో వేలాది ఎకరాల భూములను ప్రయివేటు సంస్థలకు కట్టబెడుతున్నారని తెలిపారు. ఇందులో రైతుకు భద్రత కల్పించే చర్యలేవి ఉండటం లేదని పేర్కొన్నారు. లీజుకు తీసుకున్న భూములను ఆ సంస్థలు బ్యాంకుల్లో తనఖా పెట్టి ఎగ్గొడి నష్టాన్ని రైతులు భరించే విధంగా ఒప్పందాలున్నాయని తెలిపారు. కౌలు కార్డు ఇచ్చే సమయంలో 11 మాసాలకు మాత్రమే ఇస్తూ యజమానికి భద్రతనిచ్చే ప్రభుత్వం కంపెనీలకు ఇచ్చే విషయంలో మాత్రం ఏకంగా 25 సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు అంగీకరించడం ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా ఎకరం భూమికి నెలకు ఐదారు లక్షల రూపాయలు సంపాదించుకునే కంపెనీలు రైతుకు మాత్రం ఏడాదికి రూ.30 వేలు పరిహారం లీజు ఇస్తామనడం సరైంది కాదని అన్నారు. నెలకు రూ.30 వేలు లీజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అధిక ధరలకు ఒప్పందాలు చేసుకుని అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలున్న ఆదాని ఒప్పందంపై మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉండగా కోర్టులో కేసు వేసిన ఆయన ఇప్పుడు దీనిపై మోనంగా ఎందుకున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప .కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య ,వి.రామిరెడ్డి, నాగేంద్ర కుమార్, ఆర్ . చంద్రశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు

## మంగళగిరి వంద పడకల ఆసుపత్రి నిర్మాణంపై మంత్రి లోకేష్ సమీక్ష

**మంగళగిరి (గుంటూరుజిల్లా), మార్చి18, ప్రభాత వార్త:** మంగళగిరి సమీపంలోని చినకాకానివద్ద ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన వందపడకల ఆసుపత్రిని భవిష్యత్తులో జి ప్లస్ 3కి విస్తరించేలా నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. వందపడకల ఆసుపత్రి నిర్మాణంపై ఆసుపత్రి సాధన కమిటీ సభ్యులు, అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లా డుతూ డాక్టర్లు, నర్సులు, పేషెంట్ల బంధువులు, , రోగులకు వేర్వేరు నడకదారులు ఉండేవిధంగా డిజైన్‌లో మార్పులు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది ప్రశాంత వాతావరణం ఉంటేనే మెరుగైన వైద్యం అందించగలరని చెప్పారు. మంగళగిరి వంద పడకల ప్రభుత్వ హాస్పటల్ ట్రెడిషనల్‌గా కాకుండా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా ఉండాలని అన్నారు. మంగళగిరి హాస్పటల్ నిర్మాణం ఈ ప్రాంత వాసుల దశాబ్దాల కల అని, ఎట్టి పరిస్థితుల్లో నాణ్యత విషయంలో రాజీపడవద్దని అన్నారు. ఇటీవల కాలంలో డ్రగ్ అడిక్షన్ కేసులు ఎక్కువగా వస్తున్నందున ఆసుపత్రిలో ప్రత్యేకంగా డిఅడిక్షన్ సెంటర్ ను కూడా ఏర్పాటుచేయాలని సూచించారు. ఫ్యామిలీ మెడిసిన్, ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాలను కూడా ఏర్పాటుచేసేందుకు ప్రత్యేక గదులు నిర్మించాలన్నారు. సాధన కమిటీ సూచనల మేరకు డిజైన్ లో పలు మార్పులు, చేర్పులు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌ఎంఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి మున్సిపల్ కమిషనర్ హలీమ్ బాషా, ఎస్ఇ చిట్టిబాబు, మంగళగిరి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ స్నేహరాజ్, హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు మాజేటి వంశీకృష్ణ, మాగంటి ప్రసాద్, రాజు నాయుడు, భారతీదేవి, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల నిఘంటువు యనమల

## గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర

## శాసన మండలిలో ఏడుగురు సభ్యుల వీడ్కోలులో పలువురు మంత్రుల ప్రశంసలు

**సచివాలయం,మార్చి 18,ప్రభాతవార్త:** శాసనమండలిలో ఈనెల 19తో ఏడుగురు సభ్యుల పదవీకాలం ముగియడంతో వారికి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా శాసనమండలి ఛైర్మన్ కె.మోషెన్‌రాజు అధ్యక్షతన సభ్యులను ఉద్దేశించి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నిబంధన నిఘంటువుగా యనమల రామకృష్ణుడు పేరు తెలిసిపోతుందన్నారు.మండలి ప్రతిపక్ష పార్టీ నేత బొత ్స సత్యనారాయణ మాట్ల ాడారు.ముందుగా సీనియర్ సభ్యులు యనమల గురించి మాట్లాడుతూ శాసనసభ వ్యవహారాల సంబధించి రూల్స్ బుక్ అవసరం లేకుండానే రామకృష్ణుడు ఉంటే చాలు అనే విధంగా అవగాహన ఉన్న యనమల రామకృష్ణుడు పదవిని కోల్పోవడం బాధగా ఉన్నప్పటికీ ఆయన


శాసనమండలిలో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

సేవలను శాసనసభ స్థాయి నుండి రాజ్యసభల దాకా వినియో గించుకోవాల్సిన అవసరం ఉందని బొత ్స సత్యనారాయణ తెలిపారు. కార్మికులు, విద్యార్థులు,ఉపాధ్యాయుల కోసం నిరంతరం పోరాడే కె.ఎస్.లక్ష్మణరావు 14సంవత్సరాలుగా పెద్దల సభలో ఉనా ్నరని ఆయన ఐదుగురు ముఖ్యమంత్రులతో మండల సభల్లో పాల్గొన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఇల్లా వేంకటేశ్వరరావు పెద్దల సభలో ఎన్నో సమస్యల పై చర్చించి పరిష్కారంచూపారని మండల ఛైర్మన్ తెలిపారు.టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు ప్రత్యేకంగా ఉద్యమంలోనూ ఉద్యోగుల సమస్యలపై పోరాటంలోనూ ఉన్నారన్నారు.టిడిపి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధికారిగా పనిచేసినట్లు చిత్తశుద్ధితో ఉన్నారని అందువలన టిడిపి పెద్దల సభకు పంపగా బీసీల సమస్యలను నిరంతరం మండలిలో లేవనెత్తుతూ పరిష్కారదిశగా కృషిచేశారని ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.టిడిపి ఎమ్మెల్సీ డిటి నాయుడు పదవికాలం ముగిసినప్పటికీ తిరిగి పెద్దల సభకు వచ ్చ అవకాశాన్ని పార్టీ కల్పించిందని మంత్రి తెలిపారు.పిడిఎఫ్ ఎమ్మెల్సీ రఘు వర్మ గురించి మాట్లాడుతూ మూడు రాజధాని సమయంలో కూడా అప్పుడు అధికారంలో ఉన్న వైఎస్సార్‌పార్టీకి వ్యతిరేకంగా ఏకైక రాజధానికి అమరావతిగా మద్దతు వారి నిబద్ధతకు సూచనని పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.చివరిగా శాసనమండలి ఛైర్మన మోషెన్ రాజు మాట్లాడుతూ ఇలాంటి సాంప్రదాయం కొనసాగించడం హరి ్షంచదగ్గ విషయమని సహకరించిన ప్రతి సభ్యునికి అభినందనలు తెలుపుతూ వారు రాజకీయాల నుండి వెళ్ళడం లేదని, కేవలం సభనుంచి మాత్రమే వెళ్లినప్పటికీ ఇలాంటి వ్యక్తులు నిరంతరం ప్రజాక్షేత్రంలో కొనసాగాలని కోరుకుంటున్నట్లు వివరించారు.

# నేడు అశోక్‌లేల్యాండ్ ప్రారంభోత్సవం

**గన్నవరం(కృష్ణా), మార్చి 18, ప్రభాతవార్త :** గత టిడిపి ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన అశోక్‌లేల్యాండ్ పరిశ్రమ తిరిగి మళ్ళీ టిడిపి ప్రభుత్వంలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం అయ్యింది. గత ప్రభుత్వ వేధింపులు తట్టుకోలేక పారిపోయిన పారిశ్రామికవేత్తలు కూటమి ప్రభుత్వం రాకతో ఒక్కొక్కరుగా మళ్ళీ తిరిగి వస్తున్నారు. ఇదే రీతిలో కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం మల్లవల్లి పారిశ్రామికవాడలోని అశోక్‌లేల్యాండ్ పరిశ్రమను రాష్ట్ర ఐటిశాఖామంత్రి నారా లోకేష్ బుధవారం సాయంత్రం ప్రారంభించనున్నారు.ఈకార్యక్రమంలో మంత్రులు టిజి



భరత్, యం.రాంప్రసాద్‌రెడ్డి, బందరు యంపి వల్లభనేని బాలశౌరి, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, హిందూజా గ్రూప్ ఛైర్మన్ పి.అశోక్, అశోక్‌లేల్యాండ్ సిఈఓ షేను అగర్వాల్ తదితరులు పాల్గొంటారని లేల్యాండ్ ప్రతినిధులు తెలిపారు.

# హైడ్రా పేరిట లావాదేవీలు చేస్తే చర్యలు

## అవకతవకలపై ఫిర్యాదు

## చేయాలన్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** హైడ్రా పేరు చెప్పి లావాదేవీలకు, అవకతవకలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలుంటాయని హైడ్రా హెచ్చ రించింది. ఈ మేరకు మంగళవారం కమిషనర్ రంగనాథ్ ఒప్రకటన విడుదల చేశారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్టు ఆధారాలుంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని లేని పక్షంలో ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగానికి, స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అవకతవకలు నిజమైన పక్షంలో హైడ్రా ఉద్యోగులైతే సస్పెండ్ చేయడంతో పాటు.. కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రత్యక్షంగా కాని.. పరోక్షంగా కాని హైడ్రా పేరును వినియోగించుకుని వసూళ్లకు పాల్పడినా, అవకతవకలు చేసినా వారిపైనా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఇప్పటికే పలువురిపై కేసులు కూడా పెట్టామన్నారు. నోటీసులు ఇచ్చి హైడ్రా లావాదేవీలు చేస్తున్నట్టు ఏవైనా ఫిర్యాదులుంటే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తమ దృష్టికి కాని, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. గతంలో ఎమ్మెల్యే వాట్సా ప్‌లో సమస్యను చెబితే స్పందించామని ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఫోన్‌లు వస్తే వెంటనే మాట్లాడి సమస్య తెలుసుకోవడం.. ఫిర్యాదుదారులు మెసేజ్ పెట్టినా స్పందించడం సర్వసాధరణంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వ హించే ప్రజావాణిలోనే కాకుండా.. పని దినాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు కమిషనర్ పేర్కొన్నారు.

# తెలంగాణఅసెంబ్లీ ముట్టడికి బిజెవైఎం యత్నం

## బిజెఎల్‌పి నేత ఏలేటి సహా నేతల అరెస్టు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూములను సర్కారు వేలం వేయాలను కోవడంపై నిరసన గా బిజెవైఎం నేతలు మంగళవారం నాడు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో బిజెవైఎం కార్యకర్తలు అసెంబ్లీ వైపు దూసుకువచ్చారు. అయితే దీనిపై ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు వారిని అసెంబ్లీ వద్ద రోడ్డుపైనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులతో బిజెవెఎం నేతలకు కొద్దిసేపు తోపులాట జరిగింది.

సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను సర్కారు వేలం వేయడం సరైంది



కాదని ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి తెలిపారు. యూనివర్సిటీలకు చెందిన భూములను సర్కారు తన ఆర్థిక అవసరాల కోసం వే లం వేయాలని చూడడం దారుణమని ఆయన విమర్శించారు. ఇలా అమ్ముకుంటూ పోతే యూనివర్సిటీల వద్ద భూములు వుండవని, విద్యార్థులు ఎలా చదువుకుంటారని ఆయన ప్రశ్నించారు. కాగా అసెంబ్లీ వద్ద ఆందోళనకు దిగిన మహేశ్వర్ రెడ్డితో పాటు ఇతర బిజెవెఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని నేరుగా బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసు స్టేషన్ వద్ద పోలీసులతో మహేశ్వర్ రెడ్డి వాగ్వివాదానికి దిగారు. తనను రెండు గంటల పాటు రోడ్లపైన ఎందుకు తిప్పారని అడిగారు. అయితే పోలీసులు మాత్రం తమ విధులు తాము నిర్వర్తించామని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని అన్నారు. బిజెవెఎం నేతల అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో శాసనసభ వద్ద బందోబస్తు పటిష్టం చేశారు.

# కర్ణాటక మాదిరి ప్రభుత్వ కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి

## ఉక్కు ఫ్యాక్టరీ 25 వేల ఎకరాలపై అదాని కన్ను: మాజీ ఎంపి చింతామోహన్



**విజయవాడ, మార్చి 18, ప్రభాతవార్త :** కర్నాటక లో మాదిరి ఏపిలో కూడా ప్రభుత్వ కాంట్రాక్టులను ఎస్‌సీ, ఎస్టీ లకు 24శాతం, ఓబిసిలకు 15శాతం రిజర్వేషన్లివ్వాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతామోహన్ డిమాండ్ చేశారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ దేశానికి మంచిది కాదంటూ కుండబద్దలు కొట్టారు. దేశసమైక్యతకు ఎస్సీ వర్గీకరణ వల్ల నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఇక ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వర్గీకరణ రావాలని, జాతీయ బ్యాంకులిచ్చే అప్పుల్లో వర్గీకరణ కావాలని, కోర్ట్ జడ్జిల నియామకాల్లో వర్గీకరణ జరగాలని డిమాండ్ చేశారు.

**విశాఖ ఉక్కు 25వేల ఎకరాలపై అదాని కన్ను:** ఎందరో ప్రాణాలర్పించిన సందర్భంగా నాటి ప్రదాని ఇంధిరాగాంది కృషితో విశాఖ ఉక్కును స్థాపిస్తే, ఆ ఉక్కు ఫ్యాక్టరీకు వున్న 25 వేల ఎకరాలపై అదాని కన్ను పడిందని, వాటిని అదానికి కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అదాని ఉక్కు ఫ్యాక్టరీగా మార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి 11వేల కోట్లు నిధులిస్తే సరిపోదని, శాశ్వత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

**తిరుపతి విమానాశ్రయంపై బిజెపి కన్ను:** తిరుపతి విమానాశ్రయాన్ని తాను ఎన్నో కష్టనష్టాలు, ఒడిదుడుకులు ఎదుర్కొని తీసుకొచ్చానని, నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ పునాది వేశారని, ఆ విమానాశ్రయంపై బిజెపి కన్ను పడిందని, విమానాశ్రయానికి వున్న 2వేల ఎకరాల భూములతో పాటు గరుడాకారంలో వున్న తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేటు పరం చేసేందుకు క్యాబినెట్లో బిల్లుపెట్టారని ఆరోపించారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తక్షణం ఆ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ధర్నాచౌక్‌కు మంత్రులను పంపే సంప్రదాయం నెలకొల్పండి

## తెలంగాణ ఉద్యమకారులకు ఇంటిస్థలాలు ఇవ్వండి : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## సాగు, తాగునీటి అవసరాలపై పదేళ్ల తరువాత అసెంబ్లీలో తలెత్తిన చర్చ : గంగుల కమలాకర్

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** ప్రజాసమస్యల పరిష్కారం కోసమో, ప్రభుత్వ విధానాలతో విభేదించి నిరసనలు, ధర్నాలు చేసే వారి వద్దకు మంత్రులను పంపి వారి సమస్యలు విధాన పరమైన విభేదాలకు కారణం తెలుసుకోవాలని సిపిఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ 1969 తెలంగాణ ఉద్యమకారులకు 1991లో ఉస్మానియాలో ఆవిర్భవించి తెలంగాణ లిబరేషన్ ఆర్గనైజేషన్ విద్యార్థుల నుంచి మొదలుకొని మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన ఉద్యమకారులకు 250 గజాల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఒయు విద్యార్థులకు వ్యతిరేకంగా ధర్నాలు చేయవద్దని స్లోగన్స్ ఇవ్వద్దని చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని ఆయన సూచించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతున్నంతసేపు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రన్నింగ్ కామెంటరీ చేయడంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తోపాటు కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డికి ఎంత చెప్పినా ఆయన విధానం మార్చుకోవడం లేదని అన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లు పైర్లు ఎండిపోతున్నాయని దాహార్తి తీర్చాలని చర్చజరగలేదని ఇప్పుడు కొత్తగా ఉమ్మడి రాష్ట్రంలో వినపడిన డిమాండ్ విన



పడుతోందని అత్యధిక సభ్యులు కాంగ్రెస్ సుంచి మాట్లాడిన ఎమ్మెల్యేలు సాగునీటికోసం తాగునీటి కోసం జీరో అవర్‌లో డిమాండ్ వినిపించారని ఆయన ఎద్దేవా చేశారు. డి86,87,89 కెనాల్‌లకు నీరు కాకతీయ నుంచి విడుదల చేయాలని సూ చించారు. తన నియోజకవర్గంలో నీరులేక పైర్లు ఎండు తున్నాయని ఆవేదన చెందారు.

# ఏప్రిల్ 4 వరకు 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** 'రాజీవ్ యువ వికాసం' అనే వినూత్న కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళ వారం గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మార్చి 17 నుండి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని అన్నారు.

# అలా వచ్చారు.. ఇలా వెళ్లారు

## మొక్కుబడిగా అట్రాసిటీ కమిటీ సమావేశం

**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 18, ప్రభాతవార్త:** జిల్లాలో దళితులకు సంబంధించిన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించాల్సిన జిల్లాస్థాయి విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సమావేశం మంగళవారం మొక్కుబడిగా జరిగింది. జిల్లాస్థాయి విజిలెన్స్ ,పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్ అయిన కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశం కేవలం అరగంటలోపే ముగియడం విమర్శలకు తావిచ్చింది. ఆయా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించాల్సిన జిల్లా స్థాయి బిజినెస్ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం నామమాత్రంగా జరగడం జిల్లావ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

**మీడియాకు నో ఎంట్రీ:** ఇక నియోజకవర్గాలకు సంబంధించిన ఈ సమావేశానికి మీడియా సైతం అనుమతించకపోవడం విమర్శలకు తావిచ్చింది.



19-3pg10.qxd:19-3pg10.qxd 01/01/01 7:12 AM Page 1



ఇండియన్ వెల్స్ టెన్నిస్ టోర్నీలో..

# విజేతగా రష్యా టీనేజ్ స్టార్ మీరా

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ రష్యా టీనేజ్ టెన్నిస్ స్టార్ మిరా ఆంద్రెయెవా రెండో టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సర్క్యూట్‌లో గ్రాండ్‌స్లామ్ టోర్నీ తర్వాత ఉన్నత శ్రేణి టోర్నీ అయిన 1000 సిరీస్‌లో ఆమె వరుసగా రెండో టైటిల్‌ను దక్కించుకుంది. గత నెలలో దుబాయ్ ఓపెన్-1000 టోర్నీలో టైటిల్ సాధించిన ఆంద్రెయెవా తాజాగా ఇండియన్ వెల్స్ ఓపెన్-1000 టోర్నీలో చాంపియన్‌గా అవతరించింది. కాలిఫోర్నియాలో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 17 ఏళ్ల ఆంద్రెయెవా 2-6, 6-4, 6-3తో ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ అరీనా సబలెంకా (బెలారస్)ను బోల్తా కొట్టించింది. ఈ ఏడాది బ్రిస్బేన్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలలో సబలెంకా చేతిలో ఎదురైన రెండు పరాజయాలకు ఈ గెలుపుతో ఆంద్రెయెవా బదులు తీర్చుకుంది.

2 గంటల 4 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో సబలెంకా తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. అయితే తన లోపాలను సరిదిద్దుకొని రెండో సెట్ నుంచి ఆంద్రెయెవా విజృంభించింది. మూడో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఆంద్రెయెవా నాలుగో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఆంద్రెయె వా తన సర్వీస్‌ను కాపాడుకొని సెట్‌ను 6-4తో దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో ఆంద్రెయెవా మూడో గేమ్‌లో, తొమ్మిదో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి 6-3తో సెట్‌తో పాటు, మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన ఆంద్రెయె వాకు 11,27,500 డాలర్ల (రూ.9 కోట్ల 77 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 1000 ర్యాంకింగ్ పాయింట్లు, ఇక రన్నరప్ సబలెంకాకు 5,99,625 డాలర్ల (రూ.5 కోట్ల 19 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఇండియన్ వెల్స్ టైటిల్‌తో ఆంద్రెయెవా తన కెరీర్ బెస్ట్ ర్యాంకుకు చేరుకుంది. ఐదు స్థానాలు ఎగబాకిన ఆంద్రెయెవా ఆరో ర్యాంకును అందుకుంది.



వరల్డ్ నంబర్ వన్ సబలెంకాపై సంచలనం

ఆట

## బ్యాడ్మింటన్ చాంపియన్‌గా యంగ్

### హోరా హోరీ పోరులో వాంగ్ జి ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్, దక్షిణ కొరియాకు చెందిన ఆన్ సె యంగ్ చాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ రెండో ర్యాంకర్, చైనాకు చెందిన వాంగ్ జి యి తో బర్మింగ్హామ్‌లో జరిగిన ఫైనల్లో ఆన్ సెయంగ్ 13-21, 21-18, 21-18తో విజయం సాధించింది. 95 నిమిషాల పాటు ఆద్యంతం హోరా హోరీగా జరిగిన ఈ తుది సమరంలో ఆన్ సెయింగ్ కీలక దశలో పాయింట్లు గెలిచి కెరీర్‌లో రెండోసారి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 2023లో తొలిసారి ఆన్ సెయింగ్ ఈ టైటిల్‌ను సాధించింది. కాగా పురుషుల సింగిల్స్ విభాగంలో చైనా ప్లేయర్, ప్రపంచ నంబర్ వన్ షియుకీ రెండోసారి ఈ టైటిల్‌ను దక్కించుకున్నాడు. తొలిసారి 2018లో విజేతగా నిలిచిన షియుకీ ఫైనల్లో 21-17, 21-19తో చైనీస్ తైపీకి చెందిన లీ చియా హావోపై నెగ్గాడు. విజేతగా నిలిచిన ఆన్‌సెయింగ్, షియుకీలకు 1,01,500డాలర్ల (రూ.88లక్షలు) చొప్పున ప్రైజ్ మనీ లభించింది.



# ఐపిఎల్‌లో పాక్ క్రికెటర్లు

## బ్యాన్ ఉన్నా షరతులు వర్తిస్తాయి

### వివిధ ఫ్రాంచైజీల తరపున ముగ్గురు ఆటగాళ్లు

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన రెండో లీగ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 టోర్నమెంట్ మరో 74 గంటల్లో ప్రారంభం కాబోతుంది. ఈ నెల 22వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నమెంట్ కొనసాగుతుంది. దాదాపు 75 రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్ కోసం అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ టోర్నమెంట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే 10 ఫ్రాంచైజీలకు చెందిన జట్లు ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాయి. తమ హోమ్ గ్రౌండ్ లో గంటల తరబడి ప్లేయర్లందరూ ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇటీవల కాలంలోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నమెంట్ కు సంబంధించిన మెగా వేలంలో చాలామంది ప్లేయర్లు భారీ ధర పలికారు. ఈ నేపథ్యంలో ఈసారి ఐపీఎల్ పైన అందరూ చాలా అంచనాలు పెట్టుకున్నారు. ఇక ఈ ఐపీఎల్ టోర్నమెంటులో పాకిస్తాన్ ప్లేయర్లు ఎవరు ఆడడం లేదన్న సంగతి తెలిసిందే. వాళ్లపై భారత క్రికెట్ నియంత్రణ మండలి బ్యాన్ విధించింది. 2008 సంవత్సరంలో జరిగిన ముంబై ఉగ్రవాదుల అరాచకాల నేపథ్యంలో పాకిస్తాన్ ప్లేయర్లను ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి తొలగించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆ బ్యాన్ కొనసాగుతోంది. అయితే పాకిస్తాన్ ప్లేయర్ల పైన బ్యాన్ ఉన్నప్పటికీ కొంతమంది ప్లేయర్లు మాత్రం ఐపీఎల్ ఆడుతున్నారు. పాకిస్తాన్‌లో పుట్టినా ఆ తర్వాత విదేశాల్లో స్థిరపడ్డ వాళ్లు మాత్రం ఐపీఎల్ ఆడుతున్నారు. వాళ్లకు పాకిస్తాన్ పౌరసత్వం కాకుండా వేరే దేశాల పౌరసత్వం ఉంది కాబట్టి భారత క్రికెట్ నియంత్రణ మండలి పర్మిషన్స్ ఇచ్చింది. అటువంటి వారిలో పాక్‌లో పుట్టి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డ ప్లేయర్లలో ఇమ్రాన్ తాహిర్ ఉన్నాడు. లాహోర్ లో పుట్టిన ఇమ్రాన్ తాహిర్ 2011 ప్రపంచ కప్ తర్వాత సౌతాఫ్రికా పౌరసత్వం తీసుకున్నాడు. ఈ తరుణంలోనే 2014 సంవత్సరంలో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున అవకాశం దక్కించుకున్నాడు ఇమ్రాన్ తాహిర్. ఆ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు కూడా ఆడాడు. అలాగే సికిందర్ రాజా కూడా పాకిస్తాన్ లోనే పుట్టాడు. కానీ జింబాబ్వే వారసత్వాన్ని దక్కించుకున్నాడు. పాకిస్తాన్ లోని సియాల్ కోటలో రాజా జన్మించినట్లు చెబుతున్నారు. కానీ బతుకుదెరువు కోసం పాకిస్తాన్ వదిలి జింబాబ్వే వెళ్లారట. ఈ నేపథ్యంలోనే 2023 సంవత్సరంలో పంజాబ్ కింగ్స్ తరఫున ఐపిఎల్ లో బరిలోకి దిగాడు. మరో క్రికెటర్ ఉస్మాన్ కవాజా కూడా పాకిస్తాన్ వాడే. ఇస్లామాబాదులో జన్మించిన ఉస్మాన్ 2016 సంవత్సరంలో ఐపిఎల్ లోకి వచ్చాడు. రైజింగ్ పూణే సూపర్ జెంట్స్ జట్టు తరపున ఆడిన ఉస్మాన్ కవాజా ఆ తర్వాత ఐపీఎల్‌కు దూరమయ్యాడు. అటు పాక్ మాజీ ఆటగాడు మహ్మద్ అమీర్ కూడా ఐపీఎల్ 2026 లో ఎంట్రీ ఇస్తాడట. బ్రిటీష్ పౌరసత్వం తీసుకున్న మహ్మద్ అమీర్ ఐపీఎల్‌లో ఆడేందుకు ఆసక్తి చూపిస్తున్నాడు.





## ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌కు ఓకే

**న్యూఢిల్లీ:** సుదీర్ఘ వివాదాలు, పరిపాలన గందరగోళాల అనంతరం బాక్సింగ్‌ను 2028 లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్‌లో అధికారికంగా చేర్చేందుకు మార్గం సుగమం అయింది. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రెసిడెంట్ థామస్ బాచ్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు 2028 ఒలింపిక్ ప్రోగ్రామ్‌లో బాక్సింగ్‌ను చేర్చేందుకు అనుమతిని ఇచ్చింది. ఈ వారంలో సుమారు 100 మంది ఐఓసీ సభ్యుల నుంచి తుది ఆమోదం వచ్చే అవకాశం ఉన్నాయి. కాగా 2019లో పరిపాలన, ఆర్థిక వివాదాల కారణంగా రష్యా ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ)తో ఐఓసీ సంబంధాలు తెంచుకుంది. 2023లో ఐబీఏను ఒలింపిక్ గేమ్స్ జాబితా నుంచి పూర్తిగా తొలగించింది. టోక్యో, పారిస్ ఒలింపిక్స్లో ఐఓసీ స్వతంత్రంగా బాక్సింగ్ ఈవెంట్లను నిర్వహించింది. ఈ క్రమంలో కొన్ని దేశాలు కలిసి వరల్డ్ బాక్సింగ్ అనే కొత్త పరిపాలనా సంస్థను ఏర్పాటు చేశాయి. ఇటీవలే వరల్డ్ బాక్సింగ్‌కు ఐఓసీ అధికారిక గుర్తింపు ఇచ్చింది. దీనికి అమెరికా, బ్రిటన్, ఇండియా, చైనా తదితర ప్రధాన ఒలింపిక్ దేశాలు దీనికి మద్దతు పలికాయి. రష్యా, స్పెయిన్‌తో పాటు, కొన్నిఆఫ్రికన్ దేశాలు ఈ ఫెడరేషన్లో చేరలేదు. ఈ ప్రతిపాదనకు ఐఓసీ సెషన్ ఆమోదం తెలుపుతుందని నాకు పూర్తి నమ్మకం ఉంది. ప్రపంచంలోని బాక్సర్లంతా తమ నేషనల్ ఫెడరేషన్ వరల్డ్ బాక్సింగ్‌నుంచి గుర్తింపుపొందేలా చేస్తే 2028 లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్‌లో పోటీపడే అవకాశం లభిస్తుందని ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రెసిడెంట్ థామస్ బాచ్ తెలిపారు.

# చిత్తుగా ఓడిన పాకిస్థాన్

### రెండో వన్డే: న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ఐదు టీ20లు, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న పాక్ క్రికెట్ జట్టుకు మరో పరాభవం ఎదురైంది. టీ20 సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు పాకిస్తాన్ 5వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. వర్షం కారణంగా 15 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 9 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. 46 పరుగులు చేసిన కెప్టెన్ సల్మాన్ అఘా టాప్ స్కోరర్గా నిలువగా, షాదా బ్ ఖాన్ (26), షాహీన్ అఫ్రిది (22 నాటౌట్), మహ్మద్ హారీస్ (11), ఇర్ఫాన్ ఖాన్ (11), అబ్దుల్ సమద్ (11) రెండంకెల స్కోర్లు చేశారు. పాక్ ఇన్నింగ్స్‌లో హసన్ నవాజ్ (0), ఖుష్దిల్ షా (2), జహన్దాద్ ఖాన్(0), హారీస్‌రౌఫ్(1) దారుణంగా విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేకబ్ డఫీ, బెన్ సియర్స్, జిమ్మీ నీషమ్, ఐష్ సోధి తలో 2 వికెట్లు తీసి పాక్‌ను దెబ్బకొట్టారు. అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు టిమ్ సీఫర్ట్ (22 బంతుల్లో 45), ఫిన్ అలెన్ (16 బంతుల్లో 32) చెలరేగిపోయారు. వీరద్దరి ధాటికి న్యూజిలాండ్ 4 ఓవర్లలోనే 50 పరుగుల మార్కును తాకింది. పాక్ స్టార్‌పేసర్ షాహీన్ అఫ్రిదివేసిన ఇన్నింగ్స్ 3వఓవర్లో టిమ్ సీఫర్ట్ శివాలెత్తిపోయాడు. ఈ ఓవర్లో సీఫర్ట్ ఏకంగా 4 సిక్సర్లు బాదాడు. అంతకు ముందు మొహమ్మద్ అలీ వేసిన రెండో ఓవర్లో ఫిన్ అలెన్ కూడా చెలరేగాడు. ఈ ఓవర్లో అలెన్ 3 సిక్సర్లు కొట్టాడు. వీరిద్దరూ క్రీజ్‌లో ఉండగా మ్యాచ్ 10 ఓవర్లలోనే ముగిస్తుందని అంతా అనుకున్నారు. అయితే పాక్ బౌలర్లు ఒక్కసారిగా ఫామ్‌లోకి రావడంతో న్యూజిలాండ్ 31 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయింది. మార్క్ చాప్‌మన్ (1), డారిల్ మిచెల్ (15), జిమ్మీ నీషమ్ (5) తక్కువ స్కోర్లకే ఔట్ కాగా, మిచెల్ హే (21 నాటౌట్), కెప్టెన్ బ్రేస్‌వెల్ (5 నాటౌట్) న్యూజిలాండ్‌ను విజయతీరాలకు చేర్చారు. దీంతోన్యూజిలాండ్ 13.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. పాక్ బౌలర్లలో హారీస్ రౌఫ్2, మొహమ్మద్ అలీ, ఖుష్దిల్‌షా, జహన్దాద్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు. ఈగెలుపుతో న్యూజిలాండ్ 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది.



# గోల్డ్ ఇటిఎఫ్‌లకు పెరుగుతున్న డిమాండ్

**ముంబై, మార్చి 18:** సెంట్రల్ బ్యాంకులు, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఇటిఎఫ్) పెట్టుబడిదారులు 2025లో బంగారం డిమాండ్‌కు కీలక చోదకులుగా మారతారని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పాటు ఆర్థిక అనిశ్చితులు బంగారం ధరలను పెంచుతాయని భావిస్తున్నారు. అయితే కేంద్ర బ్యాంకుల చర్యలు బంగారం ధరలను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ప్రైవేట్ వెల్త్ నివేదిక ప్రకారం, 2024లో భారతదేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచే పెట్టుబడి ఎంపికల్లో బంగారం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుంది. 2024లో బంగారం ఏకంగా పెట్టుబడిదారులకు 21 శాతం రాబడిని అందించింది. భారత మార్కెట్ బంగారంపై బలమైన పెట్టుబడి ఆసక్తిని కనబరిచింది. ముఖ్యంగా గోల్డ్ ఈటీఎఫ్‌లలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు రావడం వల్ల ఈ స్థాయి వృద్ధి నమోదైంది 2024లో భారతీయ గోల్డ్ ఈటీఎఫ్‌లు 112 బిలియన్ల నికర పెట్టుబడులను నమోదు చేశాయి. 2024 సంవత్సరం చివరి నాటికి 57.8 టన్నులకు చేరుకుంది. ఈ వృద్ధి సంస్థాగత, రిటైల్ పెట్టుబడిదారుల నుంచి బలమైన డిమాండ్‌ను సూచిస్తుందని నివేదికలు పేర్కొంటున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా బంగారం నిల్వల ధోరణిని కొనసాగించింది. 2024లో దాని నిల్వలకు 72.6 టన్నుల బంగారాన్ని జోడించింది. దీనితో దాని మొత్తం నిల్వలు 876 టన్నులకు చేరుకున్నాయి. ఏడో ఏడాది ఆర్‌బీఐ నికర బంగారం కొనుగోలుదారుగా నిలిచింది. బంగారం ఇప్పుడు ఆర్‌బీఐ విదేశీ మారక నిల్వలలో 10.6 శాతంగా ఉంది. అధిక ధరలు ఆభరణాల డిమాండ్‌ను ప్రభావితం చేసినప్పటికీ భౌతిక బంగారం, ముఖ్యంగా కడ్డీలు, నాణేలకు పెట్టుబడి డిమాండ్ బలంగా ఉంది. అధిక ధరల కారణంగా 2024లో డిమాండ్ తగ్గినప్పటికీ వివాహాల సీజన్ కొనుగోళ్ల కారణంగా జనవరి మధ్యలో క్రమంగా కోలుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ కోలుకోవడంలో ధరల స్థిరత్వం కీలక అంశంగా ఉంటుంది. వెండి విషయానికి వస్తే గత నాలుగు సంవత్సరాలుగా సరఫరాలో నిరంతర లోటు ఉందని, డిమాండ్ సరఫరాను మించిపోయిందని, దీనివల్ల వెండి ధరలు కూడా పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. 2020 నుంచి వెండికి పారిశ్రామిక డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఇది ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా చైనాలో తయారీ, పారిశ్రామికకార్యకలాపాలు మరియు గ్రీన్ టెక్నాలజీలలో సంభావ్య వృద్ధి కారణంగా ఈ స్థాయి వృద్ధి నమోదవుతుంది. అయితే వెండి బంగారం కంటే ఎక్కువ అస్థిరంగా ఉంటుంది. భారతీయ ఈక్విటీల మాదిరిగానే ధరల హెచ్చు తగ్గులను చూపుతుంది. అందువల్ల పోర్ట్ ఫోలియోలలో బంగారం దీర్ఘకాలిక వ్యూహాత్మక ఆస్తిగా ఉపయోగ పడుతుంది.




# ఐపిఒకు అమెజాన్!

**వాషింగ్టన్, మార్చి 18:** అమెరికాకు చెందిన ప్రముఖ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ దేశీయంగా తొలి పబ్లిక్ ఇష్యూకు (ఐపిఒ) రావాలని యోచిస్తోంది. తన భారత్ యూనిట్‌ను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. దీనికోసం చర్చలు ప్రారంభించిందని కొన్ని కథనాలు వెలువడుతున్నాయి. జేపీ మోర్గాన్‌తో పాటు, భారతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులతో అమెజాన్ చర్చలు ప్రారంభించిందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనికోసం గత వారంలో 810 బ్యాంకులను ఆహ్వానించిందని సమాచారం. దేశీయ ఇ కామర్స్ సంస్థలు మాత్రమే ఇన్వెంటరీ మోడల్‌ను కలిగి ఉండడానికి భారత్ నిబంధనలు అనుమతిస్తాయి. అప్పుడు వేగంగా డెలివరీలను పూర్తి చేసేందుకు, షిప్పింగ్ ఖర్చుల్ని ఆదా చేసేందుకు వీలు పడుతుంది. విదేశీ సంస్థలు కొనుగోలుదారులు, విక్రేతల మధ్య మధ్యవర్తిగా పనిచేసే మార్కెట్‌ప్లేస్ మోడల్‌గా మాత్రమే వ్యవహరించాల్సి ఉంటుంది. ఐపీఓకు రావడం ద్వారా డేటా లోకలైజ్ చేయడంతో పాటు, ఇన్వెంటరీ మోడల్‌ను కూడా కలిగిఉండొచ్చన్నది అమెజాన్ ఆలోచనగా ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. భారీ లాభాల్లో సూచీలు.. సెన్సెక్స్ 900 పాయింట్లు జంప్ మరోవైపు ఇ-కామర్స్ మార్కెట్ వాటాలో ఫ్లిప్‌కార్ట్ కంటే అమెజాన్ కాస్త వెనకపడి ఉంది. ముఖ్యంగా మెట్రోయేతర నగరాలపై దృష్టిసారించడం ద్వారా ఫ్లిప్‌కార్ట్ కస్టమర్ల బేస్‌ను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. అలాగే, 2025 చివరిలో లేదా 2026 ప్రారంభంలో ఐపీఓకు రానుంది. అందులో భాగంగా తొలుత తన హోల్డింగ్ కంపెనీని సింగపూర్ నుంచి భారత్‌కు తరలించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. ఈనేపథ్యంలో అమెజాన్ పబ్లిక్ ఇష్యూ కోసం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు క్విక్‌కామర్స్ స్టార్టప్‌లైన ఇన్‌స్టామార్ట్, బ్లింకిట్, జెప్టో నుంచి అమెజాన్ పోటీని ఎదుర్కొంటోంది. దీంతో కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌ను వేగంగా డెలివరీ చేసేందుకు తాజాగా బెంగళూరులోఅమెజాన్ నౌ పేరిట క్విక్ కామర్స్ సర్వీస్‌లను ప్రారంభించింది.



# పెరగనున్న టాటా మోటార్స్ ధరలు

**ముంబై, మార్చి 18:** 2025, ఏప్రిల్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాలతో సహా తన ప్రయాణీకుల వాహన ధరలను పెంచాలని యోచిస్తున్నట్లు టాటా మోటార్స్ మంగళవారం తెలిపింది. పెరుగుతున్న ఖర్చుల ప్రభావాన్ని పాక్షి కంగా భర్తీచేయడానికి ఈధరల సర్దుబాటు చేపట్టబోతున్నట్లు సంస్థ పేర్కొంది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు పరిధి మారుతుందని టాటా మోటార్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జనవరి లోనే, కంపెనీతన ప్రయాణీకుల వాహన పోర్ట్‌ఫోలియో ధరలను 3 శాతం వరకు పెంచింది. టాటామోటార్స్ వివిధ రకాల ప్యాసింజర్ వాహనాలను విక్రయిస్తోంది. వాటిలో రూ.5 లక్షల నుంచి రూ.25.09 లక్షల ధరల (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ) వరకు ఎలక్ట్రిక్ వాహనాలు కూడా ఉన్నాయి. టాటా మోటార్స్ తన వాణిజ్య వాహనాల శ్రేణి ధరలను సైతం వచ్చే నెల నుంచి 2 శాతం వరకు పెంచనున్నట్లు సోమవారం తెలిపింది. మారుతి సుజుకీ ఇండియా కూడా తన మొత్తం మోడల్ శ్రేణి ధరలను వచ్చే నెల నుంచి 4 శాతం వరకు పెంచాలని యోచిస్తున్నట్లు ఇప్పటికే తెలిపింది.



# రూ.750 కోట్లతో రియాల్టీ కంపెనీ కొనుగోలు

**ముంబై, మార్చి 18:** దేశీయ రియాల్టీ కంపెనీ కోల్టేపాటిల్‌ను కొనుగోలుచేస్తున్న గ్లోబల్ పెట్టుబడుల దిగ్గజం బ్లాక్‌స్టోన్ తాజాగా సాధారణ వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఇందుకు షేరుకు రూ.329 ధరలో దాదాపు రూ.759 కోట్లు వెచ్చించనుంది. తొలుత ప్రమోటర్ల నుంచి 25.7 శాతం వాటా సొంతం చేసుకోనున్నట్లు గత వారం ప్రకటించిన విషయంవిదితమే. ఇందుకు రూ.750 కోట్లు కేటాయించనుంది. మరోవైపు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో దాదాపు 1.27 కోట్ల ఈక్విటీ షేర్ల కోసం రూ.417 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీంతో మరో 14.3శాతం వాటా చేజిక్కించుకోనుంది. వెరసి 40శాతం వాటాకు రూ.1,157 కోట్లు వెచ్చించనుంది. ఈ బాటలో సాధారణ వాటాదారుల నుంచి మరో 26శాతం వాటా కొనుగోలుకి తాజాగా ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. బ్లాక్‌స్టోన్ గ్రూప్ సంస్థలు పబ్లిక్ వాటాదారుల నుంచి 2.3 కోట్ల షేర్లు కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్ ప్రకటించినట్లు కోల్టే పాటిల్ తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. షేరుకి రూ.329 ధరలో ఆఫర్ ఇచ్చినట్లు తెలియచేసింది. దీంతో కంపెనీలో బ్లాక్ స్టోన్ మొత్తం 66శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు పేర్కొంది. ఇందుకు రూ.1,800 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వెల్లడించింది. గత రెండు దశాబ్దాలలో దేశీయంగా 50 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసిన బ్లాక్‌స్టోన్, పెట్టుబడులను 100 బిలియన్‌డాలర్లకు పెంచనున్నట్లు ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో తాజా కొనుగోలుకి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా కోల్టే పాటిల్‌లో ప్రస్తుతం ప్రమోటర్లకు 69.45శాతం వాటా ఉంది. దేశీయ పెయింట్ల బిజినెస్‌ను విక్రయించే ప్రణాళికల్లో ఉన్న డచ్ దిగ్గజం ఆక్జో నోబెల్‌కు తాజాగా బ్లాక్‌స్టోన్ నాన్‌బైండింగ్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.



## వాణిజ్యం

# లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు

**ముంబై, మార్చి 18:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు దేశీయంగా ఫైనాన్షియల్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో వరుసగా రెండోరోజూ సూచీలు లాభపడ్డాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1200 పాయింట్ల మేర లాభపడగా, నిఫ్టీ 22,800 ఎగువన ముగిసింది. అన్ని రంగాల షేర్లు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,608.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,169.95) లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,385.76 గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1131.31 పాయింట్లు లాభపడి 75,301.26 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 325.55 పాయింట్ల లాభంతో 22,834.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 27 బలపడి 86.54గా ఉంది. జొమాటో, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ నష్టాలు చవిచూశాయి. అమెరికా మార్కెట్లతో పాటు, ఆసియా మార్కెట్లలో ర్యాలీ కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ అది ప్రతిబింబించింది. చైనా ఉద్దీపన చర్యల కారణంగా హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2 శాతం మేర లాభంతో మూడేళ్ల గరిష్ఠానికి చేరింది. అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో చైనా తీసుకున్న ఉద్దీపన చర్యలకు దిగింది. వినియోగాన్ని పెంచేందుకు అక్కడి ప్రభుత్వం కృషి చేస్తోంది. దీంతో ఆ దేశం నుంచి మెటల్‌కు డిమాండ్ పెరుగుతుందనే అంచనాలతో ఆ రంగ స్టాక్స్ లాభపడ్డాయి. వాణిజ్య యుద్ధభయాలతో చాలాకాలంగా మార్కెట్లు నష్టాల్లోనే ట్రేడయ్యాయి. వరుస నష్టాల నేపథ్యంలో చాలా కంపెనీల స్టాక్స్ ఆకర్షణీయంగా ఉన్నాయని విశ్లేషకులు తమ అభిప్రాయాలు వ్యక్తంచేయడం మార్కెట్‌కు కలిసొచ్చింది.




# స్టార్‌లింక్‌కు భారత్‌లో స్పెక్ట్రమ్ పన్ను!

**న్యూఢిల్లీ, మార్చి 18:** శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం అపరకుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో దేశీయఅగ్రగామి టెలికాంసంస్థలు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో మరికొద్ది రోజుల్లో భారత్‌లో స్టార్‌లింక్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే, దీనికి అనుమతులిచ్చేందుకు కేంద్రం కఠిన షరతులు విధించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. తాజాగా 'పన్ను' సవాళ్లు కూడా ఎదురవుతున్నట్లుతెలుస్తోంది. భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు స్పెక్ట్రమ్ పన్ను విధించే అవకాశాలు న్నట్లు సమాచారం. ఈ పన్ను విధిస్తే దేశంలో శాట్‌కామ్ వెంచర్‌కు సర్వీస్ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. దేశీయ నెట్‌వర్క్ ప్రొవైడర్లయిన రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాకు కొన్నేళ్లక్రితమే ఈస్పెక్ట్రమ్ పన్నును రద్దు చేసిన సంగతి తెలిసిందే. దేశంలో స్టార్‌లింక్ సేవల ద్వారా కంపెనీకి వచ్చే సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్)పై దాదాపు 3శాతం స్పెక్ట్రమ్ వినియోగ రుసుము విధించే అంశంపై కేంద్రం యోచిస్తున్నట్లు కథనాలుపేర్కొన్నాయి. "వేలానికి బదులుగా శాటిలైట్ ఆపరేటర్లకు నేరుగా స్పెక్ట్రమ్‌ను కేటాయిస్తున్నందున.. ఈ వినియోగ ఛార్జీలు వర్తిస్తాయి. అంటే.. టెల్కోలు చెల్లించే 8శాతంలైసెన్సు ఫీజు మాత్రమే కాకుండా.. శాట్ కామ్ ఆపరేటర్లు స్పెక్ట్రమ్ కోసం అదనపు ఛార్జీలు కట్టాల్సి ఉంటుంది. అది ఏజీఆర్‌పై 3శాతం కంటే ఎక్కువ కూడా ఉండొచ్చు. ఇందుకు సంబంధించిన తుది రేట్లపై చర్చలు జరుగుతున్నాయి" అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ ఛార్జీలు, శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపు కాలవ్యవధి వంటి అంశాలు ట్రాయ్‌వద్ద చర్చల దశలో ఉన్నాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps